# అత్తారింటికి దారేది...?

నీలిమ...

ఒక వెన్నెల కెరటం విరిగిపడ్డట్టు...

ఒక మంచు తుఫాను గ్రీష్మంలో పోటెత్తినట్టు...

ఆమె... నీలిమ!

వరండాలోని కేన్ కుర్చీలో కూర్చొని చూపుల్ని ఎక్కడో శూన్యంలో తగిలేసి... బరువు గుండెల్లోని బాధనంతా కనుకొసల్లోని కన్నీటి బొట్టులోకి చేర్చి... మనసు తగలబడిపోతుంటే... కుప్పకూలుతున్న దుఃఖాన్ని అనుక్షణం అక్కున చేర్చుకున్నదై... జీవితమంటే... మండే గాయాల మైలురాళ్లను దాటి గమ్యమనే శిఖరం చేరి... అదుపు తప్పి అగాధంలోకి జారిపోవటమేనా...?

ఏమిటీ జీవితం...?

జీవితమంటే ఏమిటీ?

ఆమె అంతరంగం నిండా అర్థంకాని ప్రశ్నలు???

ఆ ప్రశ్నల పరంపరలోనే 'గతం' లాగే కన్నీటిబొట్టు చెక్కిలి మీదికి జారిపోయింది.

పోనీ...పోనీ...పోతే పోనీ...

*   *   *   *

నీలిమ పెళ్లిచూపులు ఆరోజు...

ఇంట్లో అంతా హడావిడి. ఉన్నది అమ్మా, నాన్నే అయినా వాళ్లిద్దరి హడావిడి మాత్రం అంతా ఇంతా కాదు.

నీలిమకది రెండో పెళ్లిచూపులు.

మొదటిసారి పెళ్లికొడుకుతోసహా పదిమంది వచ్చి బాగా తిని కట్నం నచ్చలేదని పోయారు. అందుకే నీలిమకి కొంత భయంగా వుంది. ఏ చిన్న అలికిడైనా కిటికీలోంచి బజార్లోకి చూస్తోంది. ఆటో చప్పుడు, జీపు చప్పుడో అయితే గుండె చప్పుళ్లు పెరిగిపోతున్నాయి.

ప్రొద్దున తొమ్మిదిన్నరనించి ఎదురుచూస్తుంటె... మధ్యాహ్నం రెండింటివరకూ ఎవరూ రాలేదు. ఇక రారని నిర్ధారించుకొని వాడిపోతున్న మల్లెపూలదండని జడలోంచి తీసి గేటుప్రక్కన పూలకుండీల్లో పడెయ్యబోతుంటే...

"రామచంద్రంగారిల్లు ఇదేనాండీ?" అన్న స్వరం విన్పించి చూసింది. జిప్పీ బ్యాగు భుజాన తగిలించుకొని, బ్లాక్ ప్యాంటు మీద రోజ్‌కలర్ షర్ట్ టక్‌చేసి నీలిమనే చూస్తు మళ్లీ అడగబోతుంటే... గేటుతీస్తూ " ఇదే... ఇంతకీ మీరెవరు?" అంది.

"నాపేరు చంద్రప్రభాకర్."

ఆమాట వింటూనే ఉలిక్కిపడింది నీలిమ. కనురెప్పలు చప్పున వాలిపోయాయి. బుగ్గలోకి మందారం జరజా పాకిపోయింది. గులాబి పెదవుల్లో సన్నని వణుకు మొదలైంది.

గిరుక్కున వెనుదిరిగి 'అమ్మా' అంటూ ఇంట్లోకి పరిగెత్తింది.

అనసూయమ్మ, రామచంద్రయ్య ఎదురొచ్చి ప్రభాకర్‌ని సాదరంగా లోనికి తీసికెళ్లారు. కాళ్లు కడుక్కొన్న తర్వాత... "మీవాళ్లెవరూ రాలేదా బాబూ?" అనడిగాడు రామచంద్రయ్య.

'రాలేదండీ. అనుకోకుండా వాళ్లకు పనిబడింది. మాటిచ్చాం గదాని నేనొక్కణ్ణే రావల్సివచ్చింది" అన్నాడు ప్రభాకర్ ఇల్లంతా కలియజూస్తూ.

ఇంతలో నీలిమ తలొంచుకొని స్వీట్స్ తెచ్చింది. ప్రభాకర్ ముందు పెడుతూనే అలవోకగా కనురెప్పలు పైకెత్తి క్షణంలో పెళ్లికొడుకు ముఖాన్ని మనసులో క్లిక్‌మన్పించి ఆ వెంటనే వాలు చూపులతో వయ్యారంగా వెనుదిరిగిపోయింది. మొహమాటపడుతూనే స్వీట్స్ తిన్నాడు ప్రభాకర్. అనసూయమ్మకు ఆ అబ్బాయి అమితంగా నచ్చాడు.

రామచంద్రయ్య తన ఇంటిగురించి, నీలిమ గుణగణాల గురించి వివరిస్తున్నాడు. ప్రభాకర్‌లో ఆలసట కన్పిస్తోంది. కిటికీలోంచి గమనిస్తోన్న నీలిమకి అతడీరోజు ఇక్కడే వుండిపోతే బావుండునన్పిచింది.

కాని అప్పటికే అతడు లేచి నిల్చున్నాడు.

"ఎల్లుండి ప్రొద్దుటే ఈ వూర్లోనే ఇంటర్వ్యూ వుందండి. నేను మళ్లీ రావాలి" అన్నాడు బ్యాగు తీస్కుంటూ వినయంగా.

"అంతదూరం నించి మళ్లీ వస్తారా? ఇంటర్వ్యూ ఎల్లుండే కదా. అప్పటివరకూ మా ఇంట్లోనే వుండండి బాబూ" అన్నాడు రామచంద్రయ్య.

"సరేనండీ. మీ ఇష్టం" అన్నాడు ప్రభాకర్ వెంటనే.

కిటికీలోంచి గమనిస్తోన్న నీలిమకు చివుక్కుమంది అడిగిన వెంటనే అతడు ఆగిపోయినందుకు.

నాన్నగారు ఆపవల్సింది కాదేమో అనకుంది. అమ్మ హడావిడిగా అతడి స్నానానికి నీళ్లు తోడడానికి వెళ్లింది. నాన్నేమో గది సర్దడానికి వెళ్లాడు. వరండాలో అతడు... పైకప్పుని, గోడకు తగిలేసిన ఫోటోల్ని, ఇల్లంతా కలియజూస్తున్నాడు.

ఆ చూపులు తనని వెదకడానికి కాదని నీలిమ గ్రహించింది. ఎందుకో మనసు మూగవోయింది.

ఒకసారి ఎదురుపడితే పలకరింపుగా నవ్వాడు కాని మాట్లాడడానికి ప్రయత్నించలేదు.

ఆరెండు రోజులూ... ఆ ఇంట్లో ప్రభాకర్‌కి రాచమర్యాదలు జరిగాయి.

అతడేమీ కోరకముందే అన్నీ సమకూర్చారు. అతడు ఒంటరిగా చదువుకుంటున్న సమయంలో నీలిమ నీళ్లగ్లాసుపెట్టి అయిదు నిమిషాలు అక్కడే నిల్చుంది అతడేమైనా మాట్లాడితే బావుండని. కానీ అతడేమీ మాట్లాడలేదు. సభ్యత కాదని తన గదిలోకి వచ్చింది.

ఇంటర్వ్యూ రోజు ఉదయాన్నే అతడికి అన్నీ అమర్చారు. అమ్మ ప్రత్యేకంగా భోజనం వడ్డించింది. నాన్న రోడ్డుదాకా సాగనంపాడు. ఇంటర్వ్యూ తర్వాత అతడు అట్నించి అటే వాళ్ల వూరెల్లిపోయాడు.

అమ్మకి అప్డె నమ్మకం కుదిరిపోయింది ఈ పెళ్లి ఖాయమని. నాన్నయితే 'నీలిమ బావుందన్నాడు' అని రోజుకి వందసార్లు గుర్తుచేసుకున్నాడు. నీలిమ మనసులోకైతే వద్దన్నాఅతడొస్తున్నాడు.

తనలో తానే నవ్వుకోవటం... చేస్తున్న పని సగంలో మర్చిపోవటం... మరోసారి ఏదో అనుమానం... మరోసారి నమ్మకం... మనసు తూనీగలా ఎగురుతోంది. అమ్మా నాన్నల ముఖాల్లో ఏదో అద్వితీయమైన వెలుగు...

వారం గడిచింది...

రెండవ వారం...

మూడవ వారం...

నెలరోజులు గడిచాయి...

రామచంద్రయ్య పెళ్లికొడుకు వూరికి బయల్దేరబోతుంటే ప్రొద్దుటే నీలిమ ఫ్రెండ్

శైలజ వచ్చింది.

వస్తూనే నీలిమ చేతిలో పెళ్లి శుభలేఖ వుంచింది.

"ఇంత సడెన్‌గా పెళ్లేంటే.. నాకు చెప్పలేదు?" అంది ఆశ్చర్యంగా నీలిమ.

"అనుకోకుండా కుదిరింది. అరిస్టో మెడికల్ కంపెనీలో రిప్రజెంటేటివ్. రెండువారాల క్రిందటే ఉద్యోగమైందనుకో. కట్నం బాగానే పుచ్చుకుంటున్నాడు. మూడు లక్షలు..."

"ఇంతకీ ఎవరే ఆ ప్రబుద్ధుడు?" నవ్వుతూ అంది నీలిమ.

"చంద్రప్రభాకర్ అని. కరీంనగర్ సంబంధం. సరే. ఇంకా చాలా కార్డ్స్ పంచాలి. వెళ్తాను. పెళ్లికి తప్పక రండి. ఆంటీ, అంకుల్, మీరుకూడా... అంటూ వెళ్లిపోయింది శైలజ.

ఆ ఇంట్లో ముగ్గురి గుండెలు ఒక్కసారిగా ముక్కలయ్యాయి.

కనీసం లాడ్జింగ్ ఖర్చులు కూడా లేనివాడు... మెడికల్ రిప్రజెంటేటివ్ ఇంటర్వ్యూకోసం ఈ ఊరికి 'పెళ్లిచూపుల పేర' వచ్చి అతిథిగా అన్ని అవసరాలు తీర్చుకొని తమ కుటుంబాన్నే దగా చేసాడన్న నిజం వాళ్ల గుండెల్ని కుదిపేసింది.

అందరి మధ్యా స్మశాన స్తబ్దత...

అనసూయమ్మ తలుపువోరగా కూలబడింది. రామచంద్రయ్య వాలుకుర్చీలో ఒరిగిపోయాడు. నీలిమ గోడనానుకొని నిల్చుంది. ఆడపిల్ల కలలతో ఆడుకున్న వాడి రూపం గుర్తొస్తేనే ఒళ్లు జలదరిస్తోంది.

తల్లిదండ్రుల్ని చూసి గుండె కన్నీటి కడలయింది.

చెక్కిలిమీద కన్నీటి బొట్టు జారిపోయింది.

పోనీ...పోనీ...పోతేపోనీ...

*   *   *   *

నీలిమ... ఈసారి పెళ్లిచూపులకి అన్యమనస్కంగానే కూచుంది. వచ్చినవాళ్ల పెత్తనం అంతా ఇంతాకాదు.

పెళ్లికొడుకుతోసహా ఏడుగురొచ్చారు.

"ఏడుగురొచ్చారు. బేసి సంఖ్య. ఈపెళ్లి కుదురుతుందో లేదో?" ప్రక్కింటి మీనాక్షమ్మ అనసూయమ్మతో అనుమానంగా అంది వంటింట్లో.

"ఈ సంబంధమైనా కుదరాలని వేయి దేవుళ్లకు మొక్కుతున్నాను వదినా..." అంటుండగానే... "కాబోయే ఆడబిడ్డ ఉప్మా తినదట. సేమియా అయితే తింటుందట" అని ఎవరో వచ్చి చెప్పారు అనసూయమ్మతో.

అనసూయమ్మ సేమియా వండటంలో నిమగ్నమైంది.

పెళ్లికూతురై చాపమీద కూచున్న నీలిమ నిశ్శబ్దంగా కళ్లు పైకెత్తి అబ్బాయివైపు చూసింది.

అతడూ చూసాడు. ఇద్దరి చూపులూ కలిసాయి...

ఆడపిల్లలా అతడే తడబడ్డాడు. క్షణంపాటు కలవరపడి చూపులు త్రిప్పుకున్నాడు. నీలిమ నవ్వుకుంది గుంభనంగా...

కానీ అతడు ముభావంగా వున్నాడు. గుబులు రేపుతున్న ముఖంతో తలొంచుకొని కూచున్నాడు.

పెళ్లికొడుకు తండ్రి, తల్లి, ఆడపడుచులు ఇద్దరు, పెళ్లికొడుకు అన్న, వదిన రామచంద్రయ్యతో కట్నం గురించి మాట్లాడుతున్నారు.

ఒక ఆడపడచు నీలిమని లేచి అటూ ఇటూ నడవమంది.

వాకింగ్ టెస్ట్... పూర్తయింది.

'నీపేరేంటితో మొదలై... ఏ ఏ వంటలొచ్చు' వరకు మాట్లాడింది. టాకింగ్ టెస్ట్ పూర్తిచేసారు.

లక్ష రూపాయల కట్నం కుదుర్చుకొని... మళ్లీ రావటం కుదరదు గనుక ఇరవై అయిదువేలు పోసి ఈరోజే వరపూజ' చేయమని ఆర్డరేసారు. ఇంత జరుగుతున్నా అతడు మాత్రం తలొంచుకోనే కూచున్నాడు.

పెళ్లి కుదిరినందుకు వాళ్లకు సంతోషంగానే వున్నా.. ఇప్పటికిప్పుడు ఇరవై అయిదువేలు ఎలా తేవాలి? అన్న సమస్య నిలవనీయడంలేదు. నీలిమ తన గదిలోకి వచ్చింది.

పావుగంట తర్వాత రామచంద్రయ్య పెళ్లికొడుకు తండ్రితో బ్రతిమాలుతూ చెప్పాడు. "ఇంట్లో ఇప్పుడు పదిహేనువేలకు మించి లేవు. దయచేసి వాటితోనే ఇప్పుడు సర్దుకోండి" అని. ఈమాటతో వాళ్లల్లో వాళ్లు పదినిమిషాలు సైలెంట్‌గా తర్కించుకున్నారు.

తర్వాత "సరే... త్వరగా బ్రాహ్మణ్ణి పిలిపించండి. మిగతా కట్నం పెళ్లిలో తప్పకుండా ఇవ్వాలి. పెళ్లికూడా పదిహేనురోజుల్లో జరిగిపోవాలి" అన్నాడు పెళ్లికొడుకు తండ్రి.

"పెళ్లికి ఇంకొంచెం టైమివ్వండి అన్నగారూ" అంది.అనసూయమ్మ.

"లేదమ్మా... మాపెద్దవాడికి లీవ్ దొరకదు. మా కూతుళ్లు కూడా వుండలేరు. పదిహేను రోజుల్లో అయితేనే మేం మీ అమ్మాయిని చేసుకోడానికి రెడీ" అంది పెళ్లికొడుకు తల్లి.

"అవునూ... పదహేనురోజుల్లో పెళ్లి జరగాలి" అన్నారు ఆడపడుచులు, అన్న. అబ్బాయి మాత్రం బాధగా, అసహనంగా వుండటం నీలిమ గమనించింది.

సరేనని రామచంద్రయ్య పదినిమిషాల్లో పురోహితుణ్ణి తీసుకొచ్చి పండ్లు, పూలతోసహా కావాల్సిన సరంజామా అంతా అరగంటలో రెడీ చేసారు.

పెళ్లికొడుకు తల్లి వాడి చెవిలో ఏదో పోరుతోంది. వంటింట్లో నీలిమ తల్లితో అంది- "అమ్మా... ఏమిటే ఈ హడావిడి అంతా?" అని. అనసూయమ్మ నవ్వింది. ఆ

నవ్వులోనే కన్నీళ్లు.

"పిచ్చిదానా... కక్కొచ్చినా, కళ్యాణమొచ్చినా ఆగదంటారే... ఇదేనన్నమాట" అంది.

ఇంతలో అనసూయమ్మకి పిలుపొచ్చింది.

వరండాలో అంతా కూచున్నారు. పురోహితుడు మంత్రాలు చదువుతూ అబ్బాయి ముంజేతికి కంకణం కడుతున్నాడు. అనసూయమ్మ, రామచంద్రయ్య అబ్బాయికి కుంకుమ పెట్టారు. భుజాల మీదుగా టవల్ కప్పారు. తమలపాకులు, పోకవక్కలు, పళ్లతో సహా పదిహేనువేల రూపాయల్ని అబ్బాయి దోసిళ్లలో వుంచారు. అప్పుడు నవ్వాడతడు నిండుగా. అయినా ఏదో కలవరం. గంటసేపు నిశ్చయ తాంబూలాలు హడావిడిగా జరిగాయి.

ఆ తర్వాత ఫిబ్రవరి 15న అంటే... పధ్నాలుగు రోజులకే పెళ్లి నిర్ణయించారు. భోజనాలయ్యేసరికి చీకటిపడిందని... వచ్చినవాళ్లంతా త్వరగానే వెళ్లిపోయారు. జీపెక్కుతూ ఆ అబ్బాయి నీలిమవైపు చూసాడు. నీలిమ సిగ్గుపడింది.

వాళ్లు వెళ్లింతర్వాత... ఇసుక తుఫాను వచ్చిపోయినంత నిశ్శబ్దం!

మర్నాటి నించి...

నీలిమ కలలు కనడానిక్కూడా టైంలేనంత వేగంగా పెళ్లిపనులు జరుగుతున్నాయి. రామచంద్రయ్యకు డబ్బు సమకూరడానికే అయిదురోజులు గడిచింది. అనసూయమ్మ రెండురోజులు బంధువుల ఇళ్లల్లో చెప్పివచ్చింది. అనసూయమ్మ పెద్దకూతురు అరుంధతి వస్తూనే తల్లిదండ్రుల్ని తిట్టిపోసింది.

"నాకు టి.బి వుందనేగా. పెళ్లి నిశ్చయానికి నన్ను పిలవలేదు. నేనంటే ఎవరికీ ప్రేమలేదు" అని ఏడుస్తూనే గొంతు పొలమారి విపరీతంగా దగ్గుతూ మెలికలు తిరగసాగింది. ఆమెని ఆపటం వాళ్లకు ఇబ్బందిగా మారింది. కొద్దిగా ఆలస్యంగా వచ్చిన ఆమె భర్త శరత్ ఆ దృశ్యం చూడగానే బ్యాగులోంచి సీసాతీసి ఏదో టానిక్ తాగించి ఛాతీపై నిమిరాడు. అరుంధతి దగ్గు కంట్రోల్ కావడానికి పదినిమిషాలు పట్టింది.

శరత్ ఆమెని పడుకోబెట్టి "పర్లేదు మామగారు. టిబి.కి తోడు తనకి హై బి.పి కూడా వస్తోంది. మీ పనులు చూస్కోండి. నాకు ఫంక్షన్ ప్యాలెస్, వంటల పని విడిచిపెట్టండి. అవన్నీ నేను చూస్తాను" అన్నాడు.

అతడి మంచితనానికి వాళ్లందరి కళ్లూ చెమర్చాయి.

"అన్నట్టు... నీలిమ ఎటో రెడీ అయిందేమిటి?" అనడిగాడు.

"వేములవాడలోవున్న వాళ్ల పెద్దమ్మని తీసుకురమ్మని నేనే పంపిస్తున్నానయ్యా" అన్నాడు రామచంద్రయ్య.

"అలాగా... అప్పుడే పెళ్లికళ కూడా వచ్చేసింది" అన్నాడు నవ్వుతూ.

"ఛీ... ఫోబావా" అంది సిగ్గుపడుతూ. బ్యాగు తీసుకొని "అమ్మా, నేను వెళ్లొస్తా" అంది.

"వెళ్లిరా... జాగ్రత్తగా వెళ్లిరామ్మా" అంది తల్లి.

"నీలిమా!" అని ఆయాసంగా పిల్చింది అక్క అరుంధతి. నీలిమ దగ్గరకు రాగానే "అతడు... బావగారంతటి మంచి భర్త కావాలని వేములవాడ రాజరాజేశ్వరస్వామికి పూజలు చేసి రావే" అంది ఆయాసంతో రొప్పుతూ.

"అలాగే అక్కా... అమ్మకూడా చెప్పింది. పెళ్లయ్యాక మళ్లీ వస్తామని కూడా మొక్కమంది" అంది.

తర్వాత నీలిమ వేములవాడ వెళ్లిపోయింది.

* * * *

సాయంత్రం ఆరున్నరవుతోంది.

పల్చని చీకట్లు పదిలంగా పరుచుకుంటున్నాయి. కరెంటు కోతవల్ల వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణమంతా కొంత చీకటిగానే వుంది. ముందు శివరాత్రి వుందిగదాని భక్తుల సందడి కూడా పలచగానే వుంది.

నీలిమ వాళ్ల పెద్దమ్మతో చెప్పి పూలసజ్జతో గుడికొచ్చింది. చెప్పులు బయటే విడిచి ఎడంచేత్తో చీరకుచ్చిళ్లను పైకెత్తి నిదానంగా గుడిమెట్లెక్కుతూంది.

ఆలోచనలన్నీ అతడి చుట్టే...

నిన్నటివరకూ అతడి పేరే తెల్సుకోలేదు... నిరంజన్!

పెళ్లిపత్రికల్లో చూసాకగాని... పేరు గురించిన ఆలోచనే రాలేదు. ఎంత మంచి పేరు?!

బావలాగా గొప్ప వ్యక్తిత్వముంటే చాలు...

బావలాగా అన్ని పరిస్థితుల్లోను బాగా చూస్కుంటే చాలు...

అల్లుడంటే దశమగ్రహంలా కాక... కుటుంబ సభ్యుల్లో ఒక్కడిగా వుంటే చాలు.

అన్నిటికంటే తనని ప్రేమగా చూస్కుంటే చాలు.. జీవితాన్ని అతడి పాదాలచెంత పాదరసంలా రంగరించి పోయనూ?!

అతడిది ఉన్నత మనస్తత్వమైతే చాలు...

ఆలోచనల అలల్లో కొట్టుకుపోతూనే... ఆ మసక చీకట్లో... గుడిమెట్ల మీంచి ఎవరో ఇద్దరు వ్యక్తులు వేగంగా దిగిరావటం గమనించింది...

ఒకరు చేయి ఒకరు పట్టుకొని వేగంగా దిగిరావటం గమనించింది...

ఒకరు చేయి ఒకరు పట్టుకొని వేగంగా పరిగెత్తుకొస్తున్నారు. నీలిమ ప్రక్కకి జరగేలోపే

వాళ్లిద్దరూ నీలిమను ఢీకొన్నారు. ఆ దెబ్బతో చేతిలోని పూలసజ్జ గుడిమెట్లపై జారిపోయింది.

నీలిమ తూలిపడబోయి చప్పున నిలదొక్కుకుంది. మెట్లుజారి వాళ్లూ పడిపోయేవాళ్లే. నిలదొక్కుకున్నారు. సరిగ్గా అప్పుడే వచ్చింది కరెంటు...

ఆ వెలుగులో నీలిమ వాళ్లని చూసి కొయ్యబారిపోయింది.

వాళ్ల మెడల్లో పూలదండలు...

ముఖ్యంగా... అతడు...

అతడు...

అతడు... నిరంజన్!

తన కాబోయే భర్త. కాళ్లకింది భూమి కదిలిపోతున్నట్లయింది. గుడిగంటలు గుండెను పగలగొడుతున్నాయి. అతడు కూడా నీలిమను చూసి షాక్ తిన్నాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతడు నీలిమ కాళ్లని చుట్టేసుకున్నాడు.

"నన్ను క్షమించండి. నేనీ అమ్మాయిని ప్రేమించాను. మనస్ఫూర్తిగా ప్రేమించాను. ఎక్కడికైన పారిపోవాలనుకున్నాం. కాని చేతిలో డబ్బులేదు. ఆ విషయం తెల్సి మావాళ్లు మీతో బలవంతంగా పెళ్లి చేయాలనుకున్నారు. నేను మాత్రం మేం పారిపోవడానికి డబ్బు కావాలనే తలూపాను. ఏమండీ... ఆ అమ్మాయి లేనిదే నేను బ్రతకలేను. దూరంగా పోతున్నాం. మీరు కట్నం కిందిచ్చిన పదిహేను వేలతోనే పారిపోతున్నాం. మమ్మల్ని క్షమించండి.."

అతడు ఏడుస్తూనే వేడుకుంటున్నాడు.

నీలిమకంతా అయోమయంగా వుంది. నిరంజన్ ప్రక్కనే వున్న అమ్మాయికి నీలిమెవరో అర్థమైనట్టుంది.

చప్పున దగ్గరకొచ్చింది.

"అక్కా... మావాళ్లు వస్తున్నారు. దొరికితే ఇద్దర్నీ చంపేస్తారు. మమ్మల్ని ఆశీర్వదించి పంపండి" అంది

నీలిమ వాస్తవంలోకి వచ్చేసరికి మరో నిమిషం పట్టింది. వాళ్ల మెడలోని దండలోంచి ఒక బంతిపువ్వుని చించి ఆ పూరేకుల్ని వాళ్లపై చల్లింది. గొంతు గాద్గదమవుతుంటె "వెళ్లండి..." అంది శాసిస్తున్నట్టుగా...

వెళ్లబోతూ అతడు చెప్పాడు- "ఎక్కడున్నా మీకు ఉత్తరం రాసి క్షమాపణ కోరాలనుకున్నాను. కాని మీరే ఎదురుపడతారని అనుకోలేదు. మీరుణం తీర్చుకోలేను."

దూరంగా ఎవరో "అదిగోరా.. అక్కడ.." అని అరిచారు. వీళ్లు ఉలిక్కిపడ్డారు.

ఒకరి చేయినొకరు గట్టిగా పట్టుకొని వేగంగా కళ్యాణకట్ట కిందుగా చీకట్లోకి

కల్సిపోయారు.

గుడిమెట్లమీద నీలిమ స్థాణువులా నిల్చుండిపోయింది.

"ఒక చంద్రప్రభాకర్...

ఒక నిరంజన్...

తను ప్రేమించిన అమ్మాయితో జీవితం పంచుకోవడానికి... పారిపోయే ఖర్చుల కోసం మరో అమ్మాయి జీవితంతో చెలగాటమాడిన నిరంజన్ గుర్తొస్తూ...

మగపురుగులు గుండెను తొలుస్తున్నట్టుగా ధారాపాతమైన కన్నీళ్లు గొంతుకడ్డం పడుతుంటే...

నిస్సహాయంగా ఓ కన్నీటిబొట్టు చెక్కిలిమీదికి జారిపోయింది.

పోనీ...పోనీ...పోతేపోనీ...

* * * *

నీలిమ ఇంటికొచ్చేసరికి పెళ్లిపనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఒకరిద్దరు బంధువులు కూడా దిగారు. ఎవరి పనుల హడావిడిలో వాళ్లున్నారు. 'పెద్దమ్మ రేపొస్తుందట' అని చెప్పి నీలిమ ఆలోచిస్తూ పడుకుంది.

ఎవరికి, ఎలా, ఏం చెప్పాలో అర్థంకావట్లేదు. చెప్పే సందర్భం కూడా రావట్లేదు. సడెన్‌గా చెబితే ఎలా రియాక్ట్ అవుతారో అర్థంకావట్లేదు.

నిరంజన్‌లోని నిజాయితీ గుర్తొస్తుంది.

ఆ అమ్మాయి దీనత గుర్తొస్తుంది.

అంతలోకే తల్లి నీలిమ దగ్గరికొచ్చి అంది-

"నీలిమా... పెళ్లిబట్టలు తీస్కోవాలి. నువ్వు... తయారవుతే బజారుకెళ్దాం" అని. అదే అవకాశంగా తీస్కుంది నీలిమ.

"అమ్మా" అని పిలిచింది లాలనగా.

"ఏంటే... ఈమాత్రం ప్రయాణానికే అలసిపోయావ్' అంటూ దగ్గరికొచ్చి కూచుంది.

"అమ్మా... ఈపెళ్లి నాకిష్టంలేదు" అంది భయంగా.

తల్లి చివ్వున మంచంమీంచి లేచింది.

"ఏం మాటలే ఇవి? తలకాయ వుండే మాట్లాడుతున్నావా? నాన్నకు తెలిస్తే చీరేస్తారు" అంది కోపంగా.

"నిజమమ్మా... నేనీ పెళ్లి చేస్కోను. అస్సలు చేస్కోను. నాకీ పెళ్లి వద్దమ్మా" అంటూ తలగడలో ముఖం దాచుకొని ఏడ్వటం మొదలెట్టింది.

తల్లికిదంతా అయోమయంగా వుండి పెద్ద కూతురి చెవిలో వెయ్యడానికి వెళ్లింది.

పదినిమిషాల్లో ఇల్లు తుఫాను బీభత్సానికి ముందు ప్రశాంతతలా సడెన్‌గా నిశ్శబ్దమైపోయింది. తర్వాత చిన్నగా కలకలం మొదలైంది. ఒక్కొక్కరుగా నీలిమ గదిలోకి రావటం మొదలెట్టారు.

ప్రశ్నల పరంపరతో నీలిమను నిలువునా చీల్చారు.

పరువు ప్రతిష్టల యజ్ఞంలో నీలిమని ఆజ్యం చేసారు.

కుటుంబ విలువల మీద నీలిమను శిలువేసారు.

ఫలితంగా నీలిమ తండ్రి చేతిలో రెండుదెబ్బలు కూడా తింది. ఇంత జరిగినా ఆ ఘరానా మోసగాడు గురించి చెబితే వీళ్లు మరింత దెబ్బతింటారని సందేహించింది. తనకే తెలీని మంచికో, చెడుకో నిజాన్ని నిప్పుకణికెలా గుండెల్లోనే దాచుకుంది. కళ్లల్లో ఆవిర్లు కమ్ముకొని కనుకొనల్లోని శోకం నీటి చుక్కయి చెక్కిలి మీదికి జారిపోయింది.

**పోనీ...పోనీ...పోతేపోనీ...**

*   *   *   *

రామచంద్రయ్యకి ఆ ఇంటి గడప తొక్కాలంటేనే భయంగా, అవమానంగా వుంది. అయినా దీనంగా వెళ్లి ఆ ఇంటిముందు నిల్చుని 'బాబూ... నిరంజన్' అని పిల్చాడు.

ఆ ఇంట్లో కూడా పెద్దగా పెళ్లిసందడేం కన్పించట్లేదు. రామచంద్రయ్యని చూసి ఆ ఇంట్లో వాళ్లంతా గతుక్కుమన్నారు. వాళ్ల గుండెలు గుభేలుమన్నాయి. అయినా రామచంద్రయ్యని సాదరంగా ఆహ్వానించి కూచోబెట్టారు. ఆ అప్యాయతలకు చలించిపోయిన రామచంద్రయ్య బేలగా దుఃఖాన్ని దిగమింగుకుంటూ చెప్పాడు.

"మమ్మల్ని క్షమించండి. ఈ పెళ్లికి మా అమ్మాయి ఇష్టపడటంలేదు" అని మాటలు కూడబలుక్కొని చెప్పాడు.

వాళ్లకా మాటలు అయోమయంగా అనిపించినా... ఆ తర్వాత ఆనందంగా మొహాలు విప్పారాయి. అయినా దాన్ని బయటపడనీయకుండా అబ్బాయి తండ్రి-

"మీరేం మాట్లాడుతున్నారో అర్థంగావట్లేదు. పెళ్లి క్యాన్సిల్ అవటం ఏంటి?" అనడిగాడు బోల్డంత ఆశ్చర్యంతో.

రామచంద్రయ్య గబుక్కున అతడి చేతులు పట్టుకున్నాడు.

"మమ్మల్ని మన్నించండి. మా గ్రహచారం బాగాలేక ఈ పెళ్లి క్యాన్సిల్ చేస్కుంటున్నాం. తప్పు మాదే కాబట్టి దయచేసి క్షమించండి" అన్నాడు దీనంగా.

అబ్బాయి పదిహేను వేలతో పారిపోయి, గుళ్లో మరో అమ్మాయిని పెళ్లిచేస్కొని పారిపోయి మోసం చేసాడని తెలిసే వచ్చాడేమో... ఆ డబ్బు ఇప్పుడిమ్మంటాడేమోనని ఇంటిల్లిపాది భయపడుతున్న సమయంలో రామచంద్రయ్య మాటలు వాళ్లకు కొంచెం సేపు జీర్ణం కాలేదు.

నిరంజన్ తండ్రి ఒక్కసారిగా సీరియసయిపోయాడు.

"అదేంటండీ... మేం పెళ్లిపనులన్నీ చేస్కున్నాం. మాకెంత ఇన్సల్ట్ ఇది. మీరిచ్చిన పదిహేను వేలు కూడా ఖర్చయిపోయాయి" అన్నాడు.

"పోతేపోనీయండి. ముదనష్టపు డబ్బు. మీరు నాకివ్వక్కర్లేదు. అంతా నాఖర్మనుకుంటాను. నన్ను మన్నించండి." అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

పరిస్థితి గమనించి ఇంట్లోనివాళ్లంతా రామచంద్రయ్య మీద గయ్యమని లేచారు. "సర్లే...సర్లే... ఇంకోసారి ఇలా జీవితాల్తో ఆడుకోకండి" అని వార్నింగ్ ఇచ్చారు.

అన్నింటినీ సహనంగా భరించి వెనుదిరిగాడు రామచంద్రయ్య.

ఆయనకర్థంగాని దొక్కటే...

నీలిమ ఎందుకిలా చేసింది?

ఇంత మర్యాదగల కుటుంబం మళ్లీ దొరకదేమో...??

నీలిమ చేజేతులారా జీవితాన్ని పాడుచేసుకుందేమిటి??

ఈ ఆలోచనల్తో భుజంమీది కండువా రోడ్డుమీద పడిపోయినా అతడు గమనించలేదు.

* * * *

నెలరోజులు గడిచాయి...

ఇంట్లో మామూలు పరిస్థితి నెలకొంటూంది. నీలిమ మౌనం అందర్నీ బాధిస్తుంది. అరుంధతి క్షయ మరింత ముదురుతోంది. ఒక్కోసారి ఊపిరి తిత్తులు చిట్లిపోతున్నంతగా దగ్గుతోంది. అల్లుడు శరత్ ఓపికని చూస్తుంటే వీళ్ల గుండెలే తరుక్కుపోతున్నాయి.

ఈ పరిస్థితుల్లోనే ఆ వూరి పూజారి మరో పెళ్లిసంబంధం తెచ్చాడు నీలిమకోసం.

మళ్లీ పెళ్లిచూపులనగానే వణికిపోయింది. ఆర్థికంగా కూడా చితికిపోయిన ఆ కుటుంబాన్ని ఆదుకోడానికి... కట్నం లేకుండానే చేసుకుంటాడని పూజారి చెప్పాడు. అప్పటికే పెళ్లయి... నాలుగేళ్ల కిందటే భార్య చనిపోయి ఒక పాపతో వున్న అతడు మంచి ప్రభుత్వోద్యోగి అని కూడా చెప్పాడు.

శుభలేఖల వరకూ వచ్చిన పెళ్లి ఆగిపోవటంతో నీలిమ మీద నీలినీడలు ప్రాకుతున్నాయప్పటికే...

ఇక నీలిమకు పెళ్లికాదేమోనన్న భయంతో వున్న తల్లిదండ్రులకు ఆ సంబంధమే చల్లటి వార్తయింది.

నాల్రోజుల తర్జన భర్జనల తర్వాత... రెండో పెళ్లివాడయితేనేం? అన్న రాజీకి వచ్చారు. ఆ విషయమే నీలిమ దగ్గర కదిపారు. కన్నీటి కడలికి కట్టవేసినట్టు...

నీలిమ అవుననలేదు. కాదనలేదు...

శిలా విగ్రహంలా వుండిపోయింది...

గుండె అనుభూతిని కోల్పోయింది. శరీరం స్పర్శని కోల్పోయింది. రామచంద్రయ్య పూజారికి కబురుపెట్టి నీలిమ పెళ్లి జరిపిస్తాం అని చెప్పాడు.

అప్పుడు...

సరిగ్గా అప్పుడు... కఠిన శాసనాన్ని కదిలించాడు ఆ పూజారి.

పెళ్లికి ముందే ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకోవాలని! అదే కట్నమని తుళ్లిపడ్డారంతా! చేష్టలుడిగిపోయి విన్నారు. కాని ఆ పూజారి విడమర్చి చెబుతూ... "తనకి పిల్లలు పుడితే ఇప్పుడున్న పాపని సరిగా చూసుకోదేమోనని భయమంతే.." అన్నాడు నిదానంగా. ఆ మాటవిని నీలిమ చలించలేదు. నవ్వలేదు... ఏడ్వలేదు...

అంతా మొత్తుకున్నది అరుంధతే... అనసూయమ్మే...

చేతులారా గొడ్రాలితనాన్ని ఆపాదించొద్దని రామచంద్రయ్యని వేడుకున్నారు. కాని కూతురిపట్ల అతడికేదో కోపం... నిస్సహాయత..

"దాన్నే ఆలోచించుకోమనండి" అని చెప్పి బయటికెళ్లిపోయాడు.

మూడుముళ్లు వేయకుండానే గర్భనాళాలు ముడివేయిస్తున్న ఆ దుష్టుణ్ణి అనసూయమ్మ తిట్టిపోసింది.

సవతి తల్లి ద్వేషాగ్నులు బిడ్డపై పడొద్దని అతడి కుత్సిత నిర్ణయాన్ని అరుంధతి తూర్పారబట్టింది.

"ఇరవై ఏళ్లకే గొడ్రాల్ని చేయమన్న ఆ సంబంధం ఒప్పుకోకే నీలిమా" అంటూ ఆ ఇద్దరూ ఏడ్చారు.

కాని నీలిమ మౌనంగా వుండిపోయింది.

ఆ సాయంత్రం... అరుంధతి బాగా ఆలోచించి తండ్రి ముందు తన అభిప్రాయాన్ని చెప్పింది.

"నాన్నా... నీలిమని 'ఆయన' కిచ్చి పెళ్లి చెయ్యండి."

అందరి నెత్తిన చలిపిడుగు పడ్డట్టు ఆమాట...

నీలిమ సైతం నివ్వెరపోయింది. బావతో పెళ్లా? అక్కకు సవితిగా... గుండెనెవరో కెలుకుతున్నట్టుగా బాధపడింది.

"అవున్నాన్నా... నావల్ల ఆయనకు ఏ సుఖమూ లేదు. ఇక నాకు పిల్లలు పుట్టే అవకాశం కూడా లేదు. ఆయన రుణాన్ని ఇలా చెల్లెనిచ్చి అయినా తీర్చుకుందాం" అంది ఆయాసం ఎక్కువవటంతో.

వాలుకుర్చీలో కూర్చున్న రామచంద్రయ్యకు అల్లుడు శరత్ గుర్తొచ్చాడు. అతడి ఉత్తమ వ్యక్తిత్వమూ గుర్తొచ్చింది.

"పెళ్లికి ముందే ఆపరేషన్ చేసుకోమంటున్న ఎవరో అనామకుడికి దాన్ని కట్టబెట్టేబదులు నా భర్త సౌఖ్యాన్ని కోరి చెబుతున్నా నాన్నా... ఆయనికిస్తే తప్పేంటి? ఇప్పుడివ్వాలకుంటున్నది కూడా రెండో పెళ్లివాడికేగా" దగ్గు రావటంతో ఆమె చెప్పటం ఆగిపోయింది. ఈ పరిస్థితి ఏ కుటుంబంలోనూ రాదేమో...?

నీలిమ అక్కణ్ణించి లేచి వెళ్లింది.

ఆ తండ్రి గుండెల్లో కడలి ఘోష... ఆ తల్లి మనసులో కన్నీటి రొద...

రామచంద్రయ్య వాలుకుర్చీలో అలాగే కూచుండిపోయాడు. చాలాసేపు. అరగంట తర్వాత నీలిమ నిశ్శబ్దంగా వచ్చి తండ్రి ఎదురుగా నిలబడింది. బిడ్డని చూడగానే అతడికి నిలువెత్తు శోకమూర్తిలా కన్పడింది. కాఠిన్యం కరిగిపోయింది.

"ఏంటమ్మా... ఏదైనా నిర్ణయం తీస్కున్నావా?" అనడిగాడు లాలనగా. ఆమాటలో ఎన్నో అర్థాలు!!

"పూజారిగారి సంబంధం ఖాయం చేయండి నాన్నా... ఆపరేషన్‌కి నేను సిద్ధమే" అంది. ఏ రాయి అయితేనేం తల పగలగొట్టుకోడానికి అనుకుందేమో- గుండె గదుల్లో బాధల బాంబులు పేలి ఎన్ని బీటలువారాయో... కంఠనాళాన్ని సైతం పెరికేసినట్టు జీరబోయిన గొంతుతో చెప్పి తన గదిలోకెళ్లింది... నిశ్శబ్దంగా!

ఆ నిశ్శబ్దం... కడలి తుఫాన్‌ని కూడా భయపెట్టే స్థాయిలోది!!

అప్పుడే 'పోస్ట్' అని కేక విన్పించి.. అందరూ ఆశ్చర్యపోయారు. మగపెళ్లివాళ్లనించి ఉత్తరాలు రావటం... ఆదుర్దాగా చదివి నిరాశ చెందటం... కొద్దిరోజులుగా జరుగుతున్నదయితే... కవర్ నీలిమ పేరున రావటంతో...

"నీలిమా. లెటర్ నీకేరా..." అన్నాడు తండ్రి ఉత్తరం తీస్కుంటూ.

*　　　*　　　*　　　*

నీలిమ ఆశ్చర్యపోయింది. ఈ సమయంలో ఎవరు రాసుంటారు? అని. కవరందుకొని చించగానే గుర్తుపట్టింది. అది శైలజ రైటింగని. 'పెళ్లయిన మూణ్ణెళ్లకిగాని గుర్తురాలేదు దీనికి' అనుకుంది.

ఆ వెంటనే చప్పున 'చంద్రప్రభాకర్' గుర్తొచ్చాడు.

ఒక్కక్షణం గుండెల్లో ఏదో వెలితి... ఘర్షణ... వైరాగ్యం... దేనికీ అంతుచిక్కని శూన్యం.

"చంద్రప్రభాకర్ కాబోయే భర్తగా కలలుకంది. వాడుకాస్తా దీని మొగుడై కూచున్నాడు. ఎలావుందో వీళ్ల కాపురం' అనుకుంటూ ఉత్తరాన్ని చదివింది.

"నీలీ... బాగున్నావా?

నా మాణ్ణెళ్ల కాపురం బాగానే వుంది. మాటల మధ్యలో ఈయనగారు మూడ్రోజులు

మీ ఇంట్లో గడిపి... కట్నం ఎక్కువ ఇవ్వలేరనే మీ పొజిషన్ గుర్తించి... నన్ను చేసుకున్నాట్ట... మొదటిసారి మొగుడనేవాడిమీద గౌరవంపోయింది.

ఆయన పూర్తిగా డబ్బుమనిషి.

రెండోనెలనించే మరో లక్ష తెమ్మని బుజ్జగిస్తున్నాడు. దైన్యంగా బ్రతిమాలుతున్నాడు. ఏదో ఇండస్ట్రీ పెట్టాలన్న ఆలోచన. మొన్నోసారి పడగ్గదిలో పాదాల్ని ముద్దెట్టి డబ్బడిగారు దీనంగా. ఆయన మొహం చూడలేక నాన్నగార్కి లెటర్ రాసాను. వాళ్లు అతికష్టంమీద ఇరవై వేలు పంపించారు. ఆయనకు నచ్చలేదు.

మొదటిసారిగా మావాళ్లను బండబూతులు తిట్టాడు. నేనీ ప్రాబ్లెంలో వుండగానే అనుకోకుండా నా జీవితం మరో మలుపు తిరుగుతోంది.

గోదావరిఖని నించి వంశీకుమార్ పేరుతో నాకు ప్రేమలేఖలు వస్తున్నాయి. మాపిన్ని వూరు గోదావరిఖని చాలాసార్లు వెళ్లినప్పటికీ... నాకక్కడ వంశీకుమార్ అనేవాడెవ్వడూ తెలీదు.

మొదటి ఉత్తరం చదివి గుండె ఆగినంత పనయింది. ఎన్నో ఏళ్లు పరిచయమున్నట్టుగా... ఎన్నో సాయంత్రాలు కల్సి తిరిగినట్టుగా రాసాడువాడు. మా ఆయనలేని సమయంలో ఆ ఉత్తరం రావటంతో చించి లావెట్రీలో పడేసి నీళ్లుపోసాను.

మూడోరోజు... రెండో ఉత్తరం వచ్చింది.

ఎడమ రొమ్ముమీది పుట్టుమచ్చ మరీ మరీ గుర్తొస్తుందని రాసాడు. నేను హతాశురాలయ్యాను. బెడ్డుమీద గుడ్డెద్దు చేలోపడ్డట్టు ప్రవర్తించే నా మొగుడే ఏనాడు ఆ చిన్ని పుట్టుమచ్చని గుర్తించి వుండడనుకుంటాను.

వీడెవడు? వీడికెలా తెలుసు? దుఃఖం పొర్లుకొచ్చింది. మధ్యాహ్నం ఆయన ఇంట్లో వుండడు కాబట్టి సరిపోయింది. గ్యాస్ స్టవ్‌మీద దాన్ని తగలేసాను.

ఆయన ఇంటికి రాగానే నా గుండెల్లో దడ... తొట్రుపాటు ఎక్కువయ్యాయి. మావాళ్లు డబ్బు పంపలేదని మొహం మాడ్చుకొని వుంటున్న ఆయన నన్నెక్కడ గమనించారు గనక!

నాల్రోజుల తర్వాత... మరో ఉత్తరమొచ్చింది.

చించి చదవకుండానే దాన్ని తగులబెట్టాను. ఆ తర్వాత మరో రెండ్రోజులకు వచ్చిన ఉత్తరాన్ని కూడా చించకుండానే తగలేసాను. తీరా అది అమ్మ ఆరోగ్యం బాగాలేదని నాన్నరాసిన ఉత్తరమని ఆ తర్వాత తెల్సి... చాలాసేపు ఏడ్చాను.

ఆయన మొహంలోకి చూడాలంటేనే బెరుకు...భయం...

ఆయన ఇంటిదగ్గర వున్నరోజు ఒళ్లంతా చెమటలు పట్టి వణుకొస్తుంది. అంతటి భయంలోనే ఆరోజు సాయంత్రం ఆయన వరండాలో ఏదో చదువుతుంటె పోస్ట్‌మాన్ వచ్చి లెటరిచ్చాడు...

నా గుండెల్లో ఫిరంగులే ప్రేలాయి... అయింది... అనుకున్నంతా అయింది.

లెటర్ చదువుతూ ఆయన మొహంలో రంగులు మారాయి. వెంటనే పోస్ట్‌మాన్‌ని కేకేసి పిల్చాడు... నేను శిలాప్రతిమలా బెడ్‌రూంలోంచి గమనిస్తున్నాను...

పోస్ట్‌మాన్ రాగానే అయిదు రూపాయలు చేతిలోపెట్టి 'ఈమధ్య ఇంకేమైనా లెటర్స్ వచ్చాయా?' అనడిగాడు సౌమ్యంగా!

"అదేంటండీ... ఈ పది పదిహేను రోజుల్నించి అయిదారు ఉత్తరాలు తెచ్చిచ్చాను గదండీ" అన్నాడు.

ఆమాట విని నా శరీరం ప్రేలిపోయిందేమో? నరాలు చిట్లిపోయాయి... కళ్లు చీకట్లు కమ్మాయి...

ఇంట్లోకొచ్చి... డొక్కలో ఆయన ఈడ్చితన్నితే... కడుపులో పేగులు అల్లకల్లోలమై నెత్తురు మంచులా గడ్డకట్టి ఆగిపోయింది. గుండె పిడచకట్టి గుప్పెడు రక్తం నోట్లోకొచ్చింది.

రెండురోజులు ఆయన చేతిలో చిత్రహింసలు అనుభవించాను. ఆవెనకే... మరో ఉత్తరం వచ్చి ఆయన చేతిలో పడింది.

అది చదివి ఆయన బాగా చలించిపోయారేమో?

నిన్న నాపై చివరి అస్త్రం ఉపయోగించారు.

"మీవాళ్లని పిలిపించి... ఈ ఉత్తరాలు చూపించి నీనించి విడాకులు తీసుకోదల్చాను" అని చెప్పి మావాళ్లకు టెలిగ్రాం చేసారు.

నీలీ... మనస్సాక్షిగా చెప్తున్నాను. వంశీకుమార్ అనేవాడెవడూ నాకు తెలీదు. ఎందుకు నా జీవితాన్ని నాశనం చేస్తున్నాడో కూడా తెలీదు. నా బ్రతుకు ఏం కానుందో నాకే అర్థంకావట్లేదు.

ఎదురుగా నువ్వుంటే... నీ ఒళ్లోదూరి భోరున ఏడ్వాలనుందే... మన 'రేవతి' చెప్తుండేది గుర్తుందా?

సంసారం అనే సంస్థానంలో భార్య అనబడే బానిసగా బ్రతికేబదులు చావే నయం. పెళ్లి అనేది నా డిక్షనరీలోంచి తీసేస్తున్నాను' అనేది. అది అంతే ధైర్యంగా ఇప్పటికే ముగ్గురితో కాపురం పెట్టి వాళ్ల మనస్తత్వాలు నచ్చక వదిలేసిందట. ఎప్పుడైనా ఒంట్లో కోరిక పుడితే 'వన్‌డే లవర్' గా ఎవడికో వెళ్లి వేడి చల్లార్చుకుంటుందట. మొన్న కలిసి విపరీతంగా నవ్వుతూ చెప్పింది.

నిన్ను మరీ మరీ గుర్తుచేసింది. చదువుకునే రోజుల్లో...

'త్రివేణీ సంగమం' అని అంతా పిలిచే మన ముగ్గురి జీవితాల్లో ముందుగా నా జీవితమే కడలిలో కల్సిపోయేలా వుందే.

సె'లవ్' తో

నీ... శైలజ.

కన్నీళ్లు ఎప్పుడు చేరాయో తెలీదు. చెంపలపైనించి పెదవుల మధ్య ఉప్పగా తగిలేసరికి ఈలోకంలోకొచ్చింది.

"ఎక్కణ్ణించమ్మా" ఆందోళనగా అడిగింది తల్లి.

కళ్లు తుడుచుకుంటూ 'ఫ్రెండ్‌నించిలే' అని గదిలోకెళ్లి పడుకుంది. మెదడంతా మొద్దుబారినట్లయింది. గుండె ఏదో చరణాన్ని పలవిరస్తున్నట్టు...

"రానీ... రానీ... వస్తేరానీ...

కష్టాల్ నష్టాల్ కోపాల్ శాపాల్ రానీ..."

*　　　　*　　　　*　　　　*

"నీలిమా... నీలిమా..." అన్న పిలుపుతో కళ్లు తెరిచింది. తలుపు దగ్గర శరత్. చప్పన లోచి "రండి బావా" అంది. అతడు రాకుండానే "నేవన్నిది నిజమేనా?" అనడిగాడు. ఆ అడగటంలో బాధ తప్ప కోపం, అసహ్యం కన్పించలేదు.

ఏం విన్నాడో గుర్తొచ్చి... నిమిషం తర్వాత నిశ్శబ్దంగా తలూపింది. "చదువుకున్నదానివి... నీఆలోచనలు కూడా దిగజారుతున్నాయా? పెళ్లికి ముందు ఆపరేషన్ చేసుకొమ్మన్నాడంటే ... ఛ... ఈ మనుషులు నైతికాన్ని మర్చిపోతున్నారు. నిజమే... నేను రెండ్రోజులుగా ఎక్కడికెళ్లానో తెలుసా? నాకు తెలిసిన ఒక సంబంధం వుంటె నీకోసం వెళ్లాను.

ఆ ప్రబుద్ధుడేమన్నాడో తెల్సా? మీరిచ్చే కట్నం పెళ్లిసందడికే సరిపోతుంది. నా ఉద్యోగం కోసం అరవైవేలు లంచమడుగుతున్నారు. అవసరమైతే అ అమ్మాయి నా ఉద్యోగం కోసం కిడ్నీ కూడా ఇవ్వగలగాలి. అని! వాడి పళ్లు రాలగొట్టాను. అయినా పెళ్లికోసం ఎందుకింత హైరానా పడుతున్నారు..." అన్నాడు ఆవేశంగా.

అతడి మంచి మనసుకి నీలిమ కళ్లల్లో నీళ్లు ఉబికాయి. క్షణంపాటు పరిశీలనగా చూసింది.

మూర్తిమత్వం నిండిన సంపూర్ణ మనిషి...

"బావా... మీరు నన్ను పెళ్లిచేసుకోగలరా?" చప్పన అంది ఎటో చూస్తూ.

ఆగదిలో బాలిస్టిక్ మిస్సయిల్ ప్రేలినంత సడెన్‌గా ఉలిక్కిపడ్డాడు శరత్! గొంతు తడారి మూగవోయింది. ముఖం పాలిపోయింది. అరనిమిషం అచేతనయ్యాడు.

ఎప్పుడూ సరదాగా సరసాలాడే మరదలు పిల్ల సరసమాడుతోందనుకొని ఆశ్చర్యంలోంచి తేరుకొని నవ్వాడు.

నీలిమ నవ్వలేదు. దగ్గరకొచ్చి చప్పన శరత్ చేతిలో... పెట్టి "ఇదేంటో తెల్సా బావా? తెల్లవెంట్రుక. ఎవరిదో తెల్సా? నీలిమ అనబడే వృద్ధకన్యది" అనేసి బయటికెళ్లింది.

శరత్ నివ్వెరపోయాడు. నిర్వీర్యుడయ్యాడు. నిశ్చేష్టుడయ్యాడు. అప్పటికే అరుంధతికి దగ్గుతెర విపరీతంగా రావడంతో శరత్ అటువైపు పరిగెత్తాడు. ఆపాటికి అరుంధతి కఫంతోపాటు నెత్తురు ముద్దకూడా కక్కింది.

శరత్‌ని చూడగానే "మీకెలాగూ నాతో సుఖంలేదు. మీరు నీలిమను చేస్కోండి" అంది ఆయాసంగా.

"ఛ... ఊర్కో" శరత్ కసురుకొని ఆమె మొహం తుడిచి పడుకోబెట్టాడు. అతడిలో విచిత్రమైన ఘర్షణ మొదలైంది...

అతడు మౌనంగా అయిదురోజులు గడిపాడు... పోటెత్తే ఆలోచనల మధ్య... ఆతర్వాత శరత్ భార్యతో చెప్పాడు-

"నీ ఇష్టప్రకారమే కానీయ్..."

ఆమాట ఇల్లంతా పాకి... సమస్యకి శాశ్వత పరిష్కారం దొరికినట్లయింది.

అయినా అందరి గుండెల్లోనూ... అర్థంకాని బాధ... వెలితి... అసంతృప్తి...

అన్నింటినీ అధిగమిస్తూనే... నీలిమ పెళ్లయింది!! నిరాడంబరంగా... భ జంత్రీల ఆర్భాటాలు లేకుండా! పూలవర్షంలా అక్షింతలు కూడా పడకుండా... ముత్యాల పందిరి లేకుండా... ముత్తయిదువుల సరసాల్లేకుండా... ముద్దుగుమ్మల ముచ్చట్లు వినకుండా...

నీలిమ మెళ్లో మూడుముళ్లు పడ్డాయి. నిరాడంబరంగా!!

పెళ్లయింది... కాని 'శోభన కార్యం' నెలరోజులు వాయిదాపడింది బ్రాహ్మడి పంచాంగం రీత్యా...

పెళ్లయిన వెంటనే శోభనం జరిగితే 'అరుంధతి'కి అరిష్టమట!!

* * * *

నీలిమ బయల్దేరింది శరత్‌వెంట...

అరుంధతితోపాటు!!

సామానంతా సర్దాక శరత్ ఆటో తీసుకురావడానికెళ్లాడు. నీలిమ వెళ్లిపోతుందనే దిగులు అనసూయమ్మని కుంగదీసింది.

రామచంద్రయ్య గుండె బరువుగా మూల్గింది. అరుంధతి ఆయాసంగా తండ్రి దగ్గరకొచ్చి గుంజనానుకొని నిలబడి నెమ్మదిగా అంది.

"నాన్నా... నీలిమ పెళ్లికోసం దానిపేర మూడెకరాల పొలాన్ని వుంచావు కదూ..."

"అవునమ్మా..." అన్నాడు తండ్రి భారంగా.

"ఆపొలం కాగితాలిస్తే..." అంటూ నసిగింది.

ఒక్కక్షణం ఆ ఇంట్లో అందరి గుండెలూ ఆగిపోయాయి. అనసూయమ్మ చేతిలోని

గిన్నె అసహాయంగా జారిపోయింది.

నీలిమ నివ్వెరపోయి 'అక్కా' అంటూ పరిగెత్తుకొచ్చింది...

అప్పటికే తండ్రి చెప్తున్నాడు-

"అవునమ్మా... ఆ పొలం దానిదే. ఇప్పుడు మీది. కాని ఆ పొలం మీద బ్యాంకులో కొంత అప్పు వుంది. బాగా గుర్తుచేసావమ్మా... ఇప్పుడిచ్చేవాణ్ణి కాని ఆ కాగితాలు బ్యాంకులోనే వుండిపోయాయి. నెలరోజుల్లో ఆ అప్పు తీర్చేసి పొలం కాగితాలు తెచ్చిస్తాను" అన్నాడు గద్గదంగా.

అక్కడి గంభీర వాతావరణాన్ని భంగపరుస్తూ... ఇంటిముందు ఆటో ఆగింది. శరత్ వస్తూనే...

"అరూ... ఆటో వచ్చింది. త్వరగా తెమలండీ" అంటూ బ్రీఫ్‌కేసు అందుకున్నాడు.

అరుంధతి వెళ్ళి ఆటోలో కూచుంది.

నీలిమ నిమిషం పాటు తల్లిమెడవంపులో తలదాచుకొని నిశ్శబ్దంగా ఏడ్చింది. తండ్రి కాళ్లకి మొక్కివచ్చి శరత్ ప్రక్కన కూచుంది.

ఆటో కదిలిపోయింది...

కాని అప్పటికే.. అనసూయమ్మ కాలు బయటపెడితే మాటల తూటాలతో ఎక్కుపెట్టిన మిషన్‌గన్‌లలా ఎదిరుచూస్తున్నారు వాడలోని అమ్మలక్కలంతా...

* * * *

"నీలిమా... నీకు లెటరొచ్చింది. ఫ్రమ్ అడ్రస్‌లో 'రేవతి' అని వుంది" అన్నాడు శరత్. ఆమాట వింటూనే పరిగెత్తుకొచ్చింది నీలిమ.

"ఇలా ఇవ్వు బావా" అంది వస్తూనే.

"ఇవ్వను. నువ్వే వచ్చి తీస్కో" అన్నాడు వరండాలోనే పరిగెత్తి. నీలిమ 'ఇవ్వు బావా' అంటూనే వెనకే పరిగెత్తుకొచ్చింది.

శరత్ మరింత పరిగెత్తాడు కవర్ అందకుండా చేతిని పైకెత్తి.

నీలిమ శరత్‌ని దొరకబట్టి కవర్‌కోసం పైకెగిరింది 'ప్లీజ్ ఇవ్వు బావా' అంది గోముగా.

"నేనడిగింది... ఇస్తేనే" నవ్వుతూ అన్నాడు శరత్.

గదిలోవున్న కారణం... శరత్ రెండురోజులుగా తనగదిలోకే రాలేదు.

బాధగా లేచి వరండాలోకి వచ్చింది.

నీలిమ కవరందుకోబోయి శరత్ చేతిలో చిక్కుకుంది. నడుంమీద పడ్డ చేయిద్వారా ఏదో విద్యుత్ తరంగాలు ప్రసరిస్తున్నట్టు.... వింతైన స్పర్శ.

"ప్లీజ్ బావా... లెటరివ్వు" అంది మరింత గారంగా.

"ఏవండీ... లెటరిచ్చేయండి" అరుంధతి చిరాగ్గా అనడంతో నీలిమను విడిచాడు శరత్.

నీలిమ లెటరందుకొని తనగదిలోకి పరిగెత్తింది.

"బ్రాహ్మడు చెప్పిందాని ప్రకారం.. కొద్దిరోజులు దానికి దూరంగా వుండండి" అంది కొంచెం కోపంగా.

"నువ్వు కాపలా కాస్తున్నావా? వెళ్లి రెస్టు తీసుకో" కొంచెం కోపంగా అనేసి వెళ్లిపోయాడు శరత్.

అరుంధతి ఆశ్చర్యంగా... ఆందోళనగా చూసిందతడివైపు.

* * * *

"నీలూ...

నేను రేవతిని...

కుశలమేనా? నీ సెకండ్ హేండ్ మొగుడు బాగున్నాడా? రిపేర్లేమీ లేవు కదా!

నువ్వు రెండోపెళ్లివాణ్ణి చేస్కున్నావని తెలిసింది. మొగుడు ఏ హేండ్ వాడైనా సంసారం బాగుంటే చాలనుకునే పతివ్రతలు మీరు. మన శైలజ కూడా నీలాగే కదా! పొద్దున్నే వంటా వార్పు చేస్తున్నావా? కూరలు కుదరకపోతే 'సూప్ టొమాటో ఫ్రైడ్ జింజర్' అంటూ అర్థంకాని కొత్తపేర్లు పెట్టేయ్. ఇదేదో కొత్త వంటకమని ఇష్టంగా తింటారు మగాళ్లు.

నేనీమధ్య కోర్టుకెళ్తున్నాను. గతంలో పరిచయమున్నవాడొకడు నాకిష్టంలేకుండానే నన్నునుభవించేశాడు. వాడిమీద చిరెత్తి రేప్‌కేస్ పెట్టాను.

కోర్టులో నల్లగబ్బిలాలు రెక్కలల్లార్చుకొంటూ వాడిపక్షాన బలంగా వాదిస్తున్నాయి. నా 'శీలం' గురించి వాదనలు వాయిదాల పద్ధతిలో జరుగుతున్నాయి. నీలూ... ఆడదానికి శీలమంటే ఏమిటే?

కన్నెపొర చిరిగిపోవటమేనా?

పచ్చిగా రాస్తున్నాననుకోకు! అదేగనక అయితే... తొమ్మిదో తరగతిలో స్కూల్లో రాజేష్‌గాడితో కబడ్డీ ఆడుతుంటే 'డెత్‌లైన్' తొక్కకుండా వాడు కాలుపట్టి లాగినప్పుడే... శీలం పోయిందనుకుంటాను.

కోర్టులో ఆడదాని శీలం మీద వాదనలు వింటుంటే... 'నైనాసాహ్ని' తందూరి పొయ్యిలో హాయిగా ప్రాణం విడిచివుండాలి. అంతకంటే దారుణం..

మర్మస్థానం కాదది... నీ జన్మస్థానం... మానవత్వం ఉద్భవించే పుణ్యక్షేత్రం... అన్న మహనీయుని పాదాల్ని కన్నీళ్లతో కడగాలన్పిస్తుంది. రేప్ జరిగిందంటే నన్ను డాక్టర్లు (ఆ పుణ్యక్షేత్రాన్ని) పరీక్ష చేసారు.

మరి వాణ్ణెందుకు పరీక్షలు చేయలేదు??

ఆ కన్నెపొరను మొగుడనే మగపురుగు తొలిచినప్పుడే మనం పతివ్రతలుగా సర్టిఫై చేయబడతామా? నా పక్షాన లాయర్ ఎవరూ లేరు. అనుమతితో నేనే వాదిస్తున్నాను.

నా శీలం ఖరీదు అయిదు వందలని ఆ మగజడ్జిగారు భావించి... జరిమానాగా వాడికి విధిస్తూ...

"చివరగా నువ్వేమైనా చెప్పుకుంటావామ్మా..." అనడిగారు నన్ను.

"వాడి అంగాన్నికోసి నాకు ప్రెజెంట్ చేయండి యువరానర్" అని అరిచాను. ఆ మగజడ్జికి సింహాసనం మీదే గుండెపోటొచ్చింది.

"అయిదు వందలు మధ్యలో వాడు మీ కోర్టుకెందుకివ్వాలి. రేప్ చేయబడ్డదాన్ని నేను. ఆ డబ్బు నాకివ్వాలి" అని ఆక్రోశిస్తే కోర్టులో వకీళ్లతోసహా జనమంతా జురాసిక్ పార్క్‌లో రాకాసిబల్లిని చూసినంత విచిత్రంగా నన్ను చూసారు. ఐ డోంట్‌కేర్...

మసుగేసుకొని బ్రతకటం నాకు చేతగాదు...

వాడు కోర్టు బయట దర్జాగా పళ్లికిలించి నవ్వితే... ఆవేశంగా ఛాలెంజ్ చేసాను.

"రేయ్... అవకాశం దొరికినరోజు నీ అంగాన్ని తెగ్గోసి అక్వేరియంలో అందమైన చేపలా నా ఇంటి వరండాలోని గాజుతొట్టెలో భద్రంగా పదిలపరుస్తాను. ఇట్స్ మై ఛాలెంజ్"

దానికే బెదిరిపోయాడు వాడు.

శైలజా, నువ్వూ, నేనూ... గంగ, యమున, సరస్వతిల్లాంటి 'త్రివేణి సంగమం' అనే 'నిక్‌నేమ్'తో పిలువబడ్డ మనలో... గంగానదిలాగా పూర్తి మురికి కూపంలోకి కూరుకుపోయింది నేనే కదూ! నా బాధ నాలోనే వుండనీ...

నా మనస్సాక్షిగా నేను పవిత్రురాలిని. సరే... ఇది చెప్పడానికి లెటర్ రాయలేదు. సెకంహాండ్ మొగుడితో నువ్వేం కొరడా దెబ్బలు తింటున్నావేమోనన్న బాధతో రాస్తున్నాను. రక్తం ద్రవపదార్థం కానట్టే... కన్నీళ్ల నీళ్లుకావు. నిప్పులు అని గుర్తుంచుకో! పురుషాధిక్యతతో ఇంతగా భయపడుతున్న మనం... ముడులు విప్పడం నేర్చుకుంటే మగాడి జీవితంలో గొప్పేంలేదు.

వాడికి మనం కూర్చితేనే... శృతి.

వాడికి మనం పేర్చితేనే...చితి.

ఈ 'తెగింపు' మీదే శైలజకి కూడా లెటర్ రాసాను. సెలవా మరి?

నీ రేవతి"

నీలిమ ఉత్తరం చదివి భారంగా నిట్టూర్చింది.

రేవతి ఎంతగా ... ఏమనాలి?

చెడిపోయిందా?

దిగజారిపోయిందా??

స్వేచ్ఛ పేరుతో తెగిన గాలిపటమయిందా??

పురుష ప్రపంచంతో పోరాడుతోందా???

ఏమనుకోవాలి? అర్థంకాని ప్రశ్నలు ఉక్కిరి బిక్కిరి చేసాయి ఆ రోజంతా!

*  *  *  *

''అరూ... ఇంట్లోనే వున్నావా?'' అంటూ వచ్చింది సరోజిని ప్రక్కింటావిడ.

''రా అక్కా... ఇంట్లోనే వున్నాను'' అంటూ నవ్వింది అరుంధతి. జీవంలేని నవ్వది.

''రెండురోజులుగా నీ దగ్గు విన్పించకపోతేనూ... నువ్వు ఇంట్లో లేవనుకున్నాను.''

''కంచికచర్ల స్వామిచ్చిన చెట్లమందులు వాడుతున్నానక్కా... అదేంటో దగ్గు ఎక్కువగా రావట్లేదు. రిలీఫ్‌గా కూడావుంది'' అంది ఆనందంగా.

సరోజిని కిందినించి పైదాకా అరుంధతిని చూసి ఆశ్చర్యాలు పోతూ...

''నిజమేనే అరుంధతి... నీ శరీరంలో కూడా మార్పు కన్పడుతోంది. నువ్ సంపూర్ణ ఆరోగ్యవంతురాలివి కావాలనే కదా నేకోరేది. అన్నట్టూ... నీలిమేది?'' అనడిగింది.

''గదిలో చదువుకుంటుందక్కా''

''ఆహా... మీ ఆయన ఉద్యోగం ఇప్పించబోతున్నాట్ట కదా... వాళ్లిద్దరూ స్కూటర్ మీద జామ్మని వెళ్లిపోతే... నిన్నెవరు చూస్తారే, ఎవరూలేని టైంలో విపరీతంగా దగ్గొస్తే ఇంకేమైనా వుందా?'' అంది సరోజిని గుసగుసగా.

''నీలిమకు ఉద్యోగమా? ఆయన నాతో మాట మాత్రమైనా చెప్పలేదు'' స్వగతంగానే ఆందోళనగా అంది అరుంధతి.

''ఇంకా నీతో ఏం పని? రోజంతా నవ్వులు, ఇకఇకలు, పకపకలే వినొస్తున్నాయనుకో. ఏమైనా అరూ... మీ చెల్లెని అంటగట్టి నువ్వు పెద్ద తప్పు చేసావే. ఎంతైనా మగాడు. దాని మోజులోపడి రోజురోజుకీ నీమీద చిరాకులు పరాకులు చూపడా? నువ్వే చూస్తుండు'' అంది సరోజిని హెచ్చరికగా.

ఈవారం రోజులుగా ఇంట్లో అడుగుపెడుతూనే అరూ అనిగాక నీలూ అంటూ శరత్ రావటం గుర్తొచ్చింది.

రెండుమూడురోజుల్నుంచి గదిలోకి రాకపోవటం కూడా గుర్తొచ్చింది.

''ఏదైనా మొదట్లోనే సర్దాలి. పాకం గట్టిపడ్డాక విడదీయటం మన తరమా? అయినా నాకేంటిలే. వెళ్లొస్తానే అరూ...'' అంటూ వెళ్లింది.

అరుంధతి ఆలోచనల్లో పడింది...

ఎమ్టీ మైండ్ ఈజ్ డెవిల్స్ వర్క్‌షాప్ అన్నట్టుగా ఏలో ఆలోచనలు అరుంధతి మెదడుని తొలచటం ప్రారంభమైంది.

నీలిమని శరత్‌కిస్తే తనకిష్టమైన మూడెకరాల పొలం కూడా తనదవుతుందని ఆశపడింది కాని శరత్ దూరమైతే తను భరించగలదా? రోజంతా చెదపురుగుల్లాంటి ఆలోచనలు... సరోజని మర్నాడు చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఇంకా శోభనం కాలేదుగదా! అదే అయితే గాలికూడా వాళ్లమధ్య చొచ్చేటట్టులేదు. ఇక నువ్వంతే అరూ?"

"ఏదైనా మొదటే చెయ్యాలి. అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలని ఎందుకన్నారు. రేపు నీకే తెలిసొస్తుందిలే..."

"ఏంటే అరూ... శోభనం కాకముందే చిలకా గోరింకలయ్యారు. రేపు వాళ్లకు పిల్లలు పుడితే నిన్నింక మందలించేవాళ్లు కూడా వుండరేమో?"

సరోజని మాటాలు క్రమంగా అరుంధతి మనసులో భయాన్ని లోడ్ చెయ్యటం ప్రారంభించాయి.

ఇక శరత్ తనకి దూరమవుతాడా? అన్న వన్వే ఆలోచనల్లోనే అరుంధతి వుండిపోవటం మొదలెట్టింది. తన ఆలోచనకి బలాన్ని చేకూర్చే సంఘటన కూడా ఆ రోజు అనుకోకుండా జరిగింది.

పోస్ట్‌లో వచ్చిన పొలం కాగితాల్ని చూసి శరత్ ఆశ్చర్యపోయాడు. మామగారు రిజిష్టర్డ్ పోస్టులో కాగితాలు తనకు పంపటమేమిటో అర్థంగాక నీలిమనడిగాడు.

నీలిమ విషయం చెప్పగానా కోపంగా ఆ కాగితాన్ని తీసికెళ్లి అరుంధతి ముఖం మీద కొట్టాడు.

"అరూ... బుద్ధుందా నీకసలు? ఈ స్వార్థంతోనా నీలిమని నాకు అంటగట్టింది. అంటే సొంత చెల్లెలిమీద ప్రేమకాదన్నమాట. రోగంతో చచ్చేదానివి నీకింకా భూముల మీద ప్రేమెందుకు? నాకీ విషయం ముందే ఎందుకు చెప్పలేదు? అసలే నీలిమ మనసు గాయపడి వుంది..."

అనేసి "నీలిమా...తొందరగా వచ్చేయ్" అని కోపంగా పిలిచాడు.

"ఎక్కడికి బావా?" అని నీలిమ ప్రశ్నించినా విన్పించుకోకుండా "ముందు స్కూటరెక్కు" అని నీలిమని స్కూటర్ మీద ఎక్కించుకొని వెళ్లిపోయాడు.

స్కూటర్ వీధి మలుపు తిరగ్గానే సరోజని అడుగుపెట్టింది. "హు... పెళ్లయి ఇరవై రోజులు కూడా కాలేదు. నరకం మొదలైందన్నమాట. ఏమే అరూ... నే చెప్పానా? లేదా?"

అంటూ వచ్చింది.

ఎన్నడూ అంతగా శరత్ కోపాన్ని చూడని అరుంధతి "అక్కా..." అంటూ సరోజిన్ని పట్టుకొని బావురుమంది. ఆ ఏడుపులోనే ఊపిరితిత్తుల్ని పిసికినట్టు దగ్గుతూ మెలికలు తిరిగింది.

ఓదార్చుతూనే నూరిపోసింది సరోజిని.

"ఇంతకీ పెళ్లికాని తనని అక్క త్యాగం చేసి బావకిచ్చింది అని మీ చెల్లికైనా బుద్ధుండొద్దూ. మొగుడు పిలవగానే తగుదునమ్మా అని స్కూటర్ మీద ఎలా వెళ్లిందో చూసావా? ఇంకా పట్టుమని పదిరోజులు కూడా లేదు శోభనం. అది కాస్తా అయితే పదకొండోరోజున నిన్నీ ఇంట్లో వుంచుతారో లేదో... రోగిష్టిదని తరిమి కొడతారేమోనని వాడంతా బెంగెట్టుకుంది.

"అయినా అరూ... నీ గొంతు నువ్వే కోసుకున్నావ్. ఇప్పుడేడ్చి ఏం లాభం?" అంది టానిక్ స్పూన్‌లో పోసి అందిస్తూ...

అరుంధతిలో ఆయాసం తగ్గింది. దగ్గుతోబాటు నోట్లోంచి పిసరంత రక్తం పడింది.

"నేనిప్పుడు లేకపోతే నీ గతేమయ్యేదే అరూ... సమయానికి మందిచ్చే మొగుణ్ణి చెల్లెలికిచ్చావ్. ఇప్పుడిమ్మంటే ఆవిడ తిరిగిస్తుందా... ఆయన నీవైపు తిరిగొస్తాడా... అయినా నాకెందుకులే. వెళ్తానే అరూ..." అంటూ వెళ్లింది. నిప్పు రాజుకుంటుందని సరోజినికి తెల్సు.

కొందరి గుండెలెప్పుడూ మండుతుంటాయి. ఆ మంట మరో గుండెకు అంటిస్తేతప్ప వీళ్ల మంట చల్లారదు. అది వాళ్ల మనస్తత్వం. సరోజినిదీ అంతే!!

సరోజని వెళ్లాక ఆ ఇంట్లో అరుంధతి ఒంటరిదైపోయింది.

"శోభనమయ్యాక రోగిష్టిదని నిన్ను తరిమి కొడతారేమో?" సరోజిని మాటకు అరుంధతి మనసు బలహీనపడుతోంది. పదే పదే ఆ మాట గుర్తొస్తూంది.

మొన్న అశ్రద్ధ...

నిన్న నిర్లక్ష్యం...

ఈరోజు చిరాకు...

రేపు కోపం...

ఎల్లుండి ద్వేషం...

ఆ తర్వాత...???

నిజమే... సరోజిని మాటల్లో నిజముంది అనుకుంది. అసహాయత నిండిన గుండెలో నీలిమ పట్ల అనాలోచితంగా అగ్ని రగుల్కొంది...

అక్కా అని పిలిస్తేనే అసహ్యంగా చూడటం మొదలెట్టింది. తలిల లాంటి అక్కలో

సడెన్‌గా మొదలైన ఈ మార్పుకు నీలిమ నివ్వెరపోయినా... ఏదో చిరుకోపం అనుకుంది.

అలా నాల్రోజులు గడిచాయి.

ఈలోగా సరోజిని రెండుసార్లొచ్చింది. గత రెండురోజుల్నించి శరత్ కూడా దిగులుగా వుండటం చూసి నీలిమ అడిగింది.

"ఏంటి బావా... రెండురోజుల్నుంచి అప్సెట్‌గా కన్పడుతున్నారు? నావల్ల ఏదైనా ప్రాబ్లెమా?" అనడిగింది.

శరత్ మౌనంగా వుండిపోయాడు.

"చెప్పు బావా... ప్లీజ్... చెప్పవూ?" అంది లాలనగా. శరత్ తల పంకించాడు.

"ఎలా చెప్పాలో నాకర్థం కావట్లేదు. మీ అక్కయ్య గురించే. నిన్న డాక్టర్స్ తన స్పూటమ్ టెస్ట్ రిపోర్ట్స్ ఇచ్చారు. మైక్రో బాక్టీరియం ట్యూపర్క్యులై... కఫంతోపాటు బ్లడ్ కూడా పడుతుంది కదా... డిసీజ్ క్రానికల్ స్టేజికొచ్చింది.. అదీ కంటామినేటెడ్ డిసీజ్ గనక ఇక అరుంధతిని టి.బి హాస్పిటల్లో వుంచడమే మంచిదంటున్నారు. ఈ విషయం అరుంధతికి చెప్పడానికి రెండురోజులుగా మధనపడుతున్నాను. తననిక హాస్పిటల్‌లోనే వుంచెయ్యడానికి మనసొప్పటం లేదు..." మాటలు కూడగట్టుకొని బాధగా చెప్పాడు శరత్.

నీలిమ మనసు ఇసుక తుఫానే అయ్యింది.

"వద్దు బావా... అక్కని హాస్పిటల్లో పడెయ్యొద్దు. అది తట్టుకోలేదు. టీబీ అంటురోగమైనా కాకపోయినా దానికి సేవలు చేయడానికి నేను సిద్ధమే బావా. కాకపోతే దాని బెడ్‌ని ఆ చివరి గదిలోకి మారుద్దాం" అంది బాధగా.

"సరే...నీ ఇష్టం" అన్నాడు శరత్.

* * * *

"అరూ... నీ బెడ్‌ని ఆ గదిలో మారుద్దాం. కొంచెం దూరంగా వుండాలని డాక్టర్ చెప్పారు. అందుకని..." బరువుగా చెప్పాడు శరత్.

"అవునక్కా... ఆ గది నీట్‌గా సర్దాను. విశాలంగా కూడా వుంది" అంది నీలిమ.

అరుంధతి చిక్కిపోయిన మొహంతో నిర్వికారంగా చూసింది వాళ్లవైపు.

గుండెల్లోంచి దుఃఖం ఎగదన్నుకొస్తుంటే... హిస్టీరియా వచ్చినదాన్ల కీచ్‌చ్‌మని అరుస్తూ టానిక్ సీసాని నీలిమ వైపు బలంగా విసిరింది.

ఆ సీసా గోడకి తాకి భళ్లున బ్రద్దలయింది.

ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు. ఆమె ఎందుకలా ప్రవర్తించిందో అర్థం కాలేదు. తర్వాత బేలగా ఏడుస్తున్న అరుంధతిని... విశాలమైన గదిలోకి మార్చారు.

మార్చిన మర్నాడే సరోజిని పనిగట్టుకొని వచ్చింది. వస్తూనే "అయిందీ... నేను అన్నం

పనీ జరిగిందీ... అరూ... నిన్నీ స్టోర్ రూంలో పడెయ్యడానికి వాళ్లకు మనసెలా ఒప్పిందే? ఇవ్వాళ స్టోర్ రూంలో .... రేపు పెరట్లో... అయ్యో తల్లీ. చెల్లిని మొగుడి కంటగట్టి నాశనం చేస్కున్నావ్ గదే"' అని కంటతడి పెట్టింది.

అరుంధతి చలించిపోయింది...

"అయినా ఏరి వాళ్లు... నా పిచ్చిగాని ఎల్లుండే శోభనం పెట్టుకొని విడిపోయుంటారా. ఎవరైనా, ఒకళ్లమీది ఒకళ్లకు ఎంత ప్రేమ పొంగుకొస్తుండాలి?" అంది ఇల్లంతా కళ్లతోనే గాలించి.

"ఏం చేయనక్కా..." బాధగా గోడకి చేరగిలబడుతూ నిట్టూర్చింది అరుంధతి.

"ఏం చేయడమేంటె పిచ్చిదానా... అలా అనుకుంటూనే ఇంతదూరం తెచ్చావ్. నిన్ను శాశ్వతంగా టిబి హాస్పటల్లో పడేసే ఆలోచనల్లో వుంది నీ చెల్లెలు. మా ఆయన చెప్పాడులే! దానిదంతా చెల్లెలి ప్రేమ కాదు. సవతి ప్రేమ... నువ్వు ఇంకా దాన్ని వదిలించుకోకపోతే నీది అధోగతే..."

చివరి మాటకి ఉలిక్కిపడి అరుంధతి "ఎలా వదిలించుకోవాలి?" అంది ఆందోళనగా.

"అదే... ఎలాగా?" అరుంధతి కళ్లలో పైశాచికత్వం కదలాడింది.

"ఎన్ని మార్గాల్లేవూ... పాలల్లో విషమిచ్చేయ్" గుసగుసగా చెప్పి భయంగా లేచిపోయింది సరోజిని.

అరుంధతిలో క్రూరత్వం క్రమంగా రూపుదిద్దుకొంది.

సాయంత్రం కాగానే...

ముస్తాబవుతున్న నీలిమ దగ్గరికొచ్చింది అరుంధతి ఆయాసంగా. నీలిమ కంగారుగా "అదేంటక్కా... పాలు త్రాగలేదేంటి?" అంటూ వచ్చింది.

"నాకొద్దే నీలిమా. ఆయాసంగా వుంది. నువ్వే త్రాగు" అని అందించింది.

సర్లే అని గ్లాసు తీసుకొని టేబిల్‌పై పెట్టి... అద్దం ముందు పూర్తి జడ వేసుకోవడంలో నిమగ్నమైంది.

అరుంధతి గుండెదడ పెరుగుతుంటే తన గదిలోకొచ్చింది.

అప్పుడు జరిగింది... ఆసంఘటన.

శరత్ వస్తూనే నీలిమని వెనకనించి ఒడిసి పట్టుకొని ముద్దెట్టుకున్నాడు. నీలిమ విసురుగా త్రోసెయ్యగానే టేబిల్‌పై ఒరిగిపోతూ...

"ఈ పాలేంటి? ఎల్లుండి శోభనం కోసం ఇప్పట్నుంచే రిహార్సల్స్ చేస్తున్నావా? ఒ.కే. థాంక్యూ..." అనేసి గటగటా త్రాగాడు. నీలిమ నవ్వుతోంది.

ఆ దృశ్యం చూసిన అరుంధతి "ఏవండీ..." అని అరిచింది.

కంఠనాళాలు తెగిపోయాయి...

ఊపిరితిత్తులు చిట్లిపోయాయి...

గుండె పగిలి గుప్పెడు రక్తం నోట్లోకొచ్చింది. రక్తచలనం నిశ్చలమైతే నరాలు కుంచించుకుపోయి... తలుపు దగ్గరే కుప్పకూలిపోయింది.

నీలిమ ఆందోళనగా పరిగెత్తింది... అక్కా అంటూ...

శరత్ తూలిపడ్డాడు... కళ్లు బైర్లుకమ్ముతుంటే ఏమైందంటూ వచ్చాడు. అప్పటికే అరుంధతి శవం మీద పడి నీలిమ బావురుమంది.

"ఏమండీ... ఇటు చూడండి" అని రోదిస్తూ శరత్‌ని చూడగానే జీవం చచ్చిపోతున్న జవసత్వాలతో అచేతనంగా అరుంధతి మీద ఒరిగిపోయాడు శరత్.

కట్టలు తెంచుకున్న దుఃఖం ఒక్కసారిగా గొంతులో గడ్డకట్టినట్టు... నోరు తెరిచి పిచ్చిగా చూస్తుండిపోయింది నీలిమ.

ఇద్దరూ... అచేతనంగా...

శరీరం స్పర్శ కోల్పోయి... మెదడు మొద్దుబారి నిర్వకారంగా చూస్తుండిపోయింది. ఓ కన్నీటి చుక్క చెంపమీంచి జారిపోయింది. పోనీ... పోనీ... పోతేపోనీ...

అప్పుడేడ్చింది... వేయి గొంతుకల రోదనతో గుండెను చిదివేసినంత బలంగా...

వాడంతా కలకలంగా...

నీలిమ జీవితం అల్లకల్లోలంగా...

*　　　　*　　　　*　　　　*

నీలిమను చూసి ఆ తల్లిదండ్రుల మనసు తరుక్కుపోయింది.

కళ్లనిండా మౌనం... గొంతునిండా మౌనం... గుండెనిండా మౌనం. ముందూ వెనకా... మౌనం మౌనం! శోకమూర్తి ప్రతిమలా వున్న నీలిమని చూసి పూజారిగారు కూడా కంటతడి పెట్టారు.

"నేను చూపించిన సంబంధం ఏదో దిక్కుమాలిందని మీరనుకుంటిరి. నీలిమ జాతకం కూడా మంచిదికాదు. పెళ్లయినా, శోభనం కాకముందే శరత్ చచ్చిపోయాడని లోకమంతా తెలుసు. జాతకరీత్యా మన నీలిమకు మొదట్నుంచి 'భరణి' సంబంధమే మంచిదని నేను మొత్తుకుంటూనే వున్నాను" అన్నాడు పూజారి.

వాళ్లు తలూపితే ఆపరేషన్ చేయించుకొమ్మన్నవాడి సంబంధం ఇప్పటికీ ఖాయపర్చడానికీ తను సిద్ధమేనన్న ఉద్దేశ్యం పూజారి మాటల్లో వుంది.

"భరణి మంచి ఉద్యోగస్థుడు. నెలకు నాలుగువేల జీతం. దురదృష్టవశాత్తు పాప పుట్టాక భార్యపోయింది. పాపకోసం కూడా చేసుకోవాలనుకుంటున్నాడు కాబట్టి... ట్యూబెక్టమీ

ఆపరేషను...'' అంటూ నసిగాడు.

నీలిమ తన గదిలోకెళ్ళిపోయింది.

''పూజారిగారూ... పుట్టెడు శోకంతో వుందది. మమ్మల్ని కాస్త ఆలోచించుకోనివ్వండి'' అన్నాడు రామచంద్రయ్య.

''పరిస్థితులు నాకు మాత్రం తెలీవా? ఎందుకు చెప్తున్నానంటే... భరణి ట్రాన్స్‌ఫరై మరో నెల్రోజుల్లో హైదరాబాద్ వెళ్ళిపోతున్నాడు. అందుకని ఈమాట మీచెవిలో వేద్దామన్పించి...'' అని ఏ రెస్పాన్సు రాకపోవటంతో నిదానంగా వెళ్ళిపోయాడు పూజారి.

ఆ ఇంటినిండా స్మశాన స్తబ్దత.

విషాదం నిశ్శబ్దంతో చేతులు కలిపి భయంకరంగా తాండవిస్తోంది.

క్షణమొక శకంలా గడుస్తున్న ఆ ఇంట్లో రోజులు దొర్లటం దుర్లభమే అయింది. ఆరోజు... 'టెలిగ్రాం' అన్న కేక విన్పించి నెత్తినేదో పిడుగుపడ్డట్టే భయపడ్డారంతా!

'శైలజ సీరియస్... నీలిమ స్టార్ట్ ఇమ్మీడియట్లీ'

టెలిగ్రాం సారాంశం!

నీలిమ మనసేటో కీడు శంకించింది... అయినా వెంటనే తయారై బయల్దేరింది.

రామచంద్రయ్య కూతుర్ని బస్సెక్కించాడు.

*             *             *             *

కరీంనగర్ హాస్పిటల్లో... ఒళ్ళంతా కాలిపోయి గుర్తుపట్టరాకుండా వున్న శైలజని చూసి బావురుమంది నీలిమ.

అప్పటికి శైలజ ఇంకా స్పృహలోకి రాలేదు. శైలజ తల్లిదండ్రులు నీలిమని చుట్టేసుకొని హృదయవిదారకంగా ఏడ్చారు. శైలజ ముఖం కమిలిపోయిన నెత్తుటి ముద్దలా భయంకరంగా వుంది. నెమ్మదిగా కళ్ళువిప్పింది. నీలిమని చూడగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''శైలూ... నేను... నీలిమని. ఎలా జరిగిందే?'' అనడిగింది దుఃఖాశ్రువులతో.

అప్పుడే డాక్టర్, నర్స్, పోలీస్ సిబ్బంది కూడా గదిలోకొచ్చారు స్పృహ వచ్చిందని తెలిసి!

''గ్యాస్ స్టవ్... పేలి... మంటలు... చీరకంటుకొని...'' శైలజ ఆయాసంతో రొప్పుతోంది. మాటలు మరణ వాంగ్మూలంగా రాయబడుతున్నాయి.

''వంటింట్లో... వాడే గ్యాస్‌లీక్ చేసాడు. ఎందుకో తెల్సా. నన్ను వదిలించుకోవాలని. రేవతి ఉత్తరం నాలో తెగింపునిచ్చిందే. అందుకే మంటలు నన్ను చుట్టుకోగానే వాణ్ని వెంబడించాను. వాడు వీదిలోకి పరగెత్తాడు. అయినా వేగంగావెళ్ళి మంటలతో వాణ్ణి చుట్టేసాను. నా బిగి కౌగిలితో వాడికీ మంటలంటింటుకున్నాయి...''

శ్వాస అడక కాసేపు చెప్పటం ఆపింది శైలజ.

"కట్నం కోసం కాల్చే ఏ మగాడికైనా ఇదే సరైన శిక్ష. నీలూ... నీకింకో దారుణం తెలుసా..." ఊపిరాడక మళ్లీ ఆగింది.

నీలిమ దుఃఖంతో "ఇంకా ఏం జరిగిందే?" అంటూ దగ్గరగా జరిగింది.

"వంశీకుమార్ పేరుతో నాకొచ్చిన ఉత్తరాలన్నీ వాడే సృష్టించాడు. మావాళ్ల మధ్య నన్ను అప్రతిష్టపాల్జేసి... నాకో ప్రియుడున్నాడని నమ్మించి కట్నం తేలేని నన్ను అవిధంగా వదిలించుకోవాలనుకున్నాడే...

ఓరోజు వాడు ఎడంచేత్తో ఆ ఉత్తరం రాస్తుంటే... రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాను. వాడి బండారం బయటపెడతానని గొడవచేసాను. దాంతో ఇలా సిలిండర్ పేల్చి..."

ఆయాసం ఎక్కువవటంతో, దుఃఖం గొంతులో అడ్డుపడడంతో శైలజకి మాటలు రాలేకపోయాయి.

అక్కడున్న అందరి కళ్లలోనూ... ఆవేదన సుడులు తిరిగింది.

ఇంతలో ఓ నర్స్ అక్కడికొచ్చి "డాక్టర్... చంద్రప్రభాకర్ అనే కాలిపోయిన పేషంట్‌ని నిమిషం కిందే 'నిమ్స్' కి తరలించారు" అంది.

ఒక్కసారిగా అందరూ నర్స్‌వైపు చూసారు.

శైలజ కళ్లు అటు తిరిగాయి.

"వాడు ఇంకా చావలేదా? వాడు చావాలి. వాడు చావాలి..." కాలిన గాయాలతో శైలజ మెలితిరిగింది. చర్మం మీది బొబ్బలు చిట్లిపోతుంటే... అక్కడక్కడా చర్మం వూడి ఆ బాధను భరించలేనట్టు... శైలజ ఊపిరి నిలిచిపోయింది.

ఒక్కపెట్టున ఆగదిలో ఆర్తనాదాలు మిన్నుముట్టాయి.

* * * *

నీలిమ నవ్వుని మర్చిపోయి చాలా రోజులయింది. బయటికెళితే తోటి ఆడవాళ్లు వింత జంతువుని చూసినట్టు చూడటం భరించలేకపోయింది. బయటికెళ్లటమే మానేసింది. ఈలోగా పూజారి రెండుసార్లు వచ్చివెళ్లాడు.

ఆ రోజు... రేవతి నించి ఉత్తరం వచ్చింది.

"నీలూ...

శైలజ చనిపోయిందని తెలిసి ఎంత ఏడ్చానో... మొగుణ్ణి చంపిందని తెలిసి అంత ఆనందించాను. కాని వాడు బతికి బయటు పడ్డాడని తర్వాత తెలిసింది. నువ్వు కూడా భర్తని కోల్పోయావని తెలిసి ఇది రాస్తున్నాను. నీ భర్త పోయినందుకు నేను బాధపడను. నువ్వు జీవితాంతం విధవరాలిగా వుంటే మాత్రం వచ్చి తంతాను.

మధ్యలో వచ్చివెళ్లే మొగుడనే వాడికోసం... మనం వాడిపోవటమేంటి? మనకు మనసుంది... వయసుంది. కోరికలున్నాయి. అందుకే మళ్లీ పెళ్లిచేసుకో... వాడికి వంటా వార్పు చేయడానిక్కాదు. మన శరీరం కూడా సుఖపడాలని గుర్తుంచుకో. 'చలం' పుస్తకాలు చదువు. ఆ గాడ్‌ఫాదర్‌ని మన ఆడాళ్లింకా గుర్తించకపోవటం శోచనీయమే. 'మైదానం' చదువ్... మళ్లీ పెళ్లిచేసుకో.

నీ అరవయ్యో ఏట కూడా మళ్లీ నీ మొగుడు చస్తే వైధవ్యం స్వీకరించకు. మగాళ్లకేం కరువుండదు. అప్పుడు కూడా పెళ్లిచేసుకో...

నీ

రేవతి.

ఉత్తరంలోని ఆఖరి వాక్యం చదివి నీలిమ పెదాల మీద చిన్నగా చిర్నవ్వు విరిసింది. కన్నీటి పుట్టమీద గొంగళి పురుగులా ముడుచుకున్న పెదాలు సీతాకోకచిలుకలా అరవిచ్చాయి.

అప్పుడే పూజారి అడుగుబెట్టడంతో... నీలిమ మనసు కుదిపినట్లయి కొంత పులకించింది. పూజారి నాన్నగారితో అంటుంటె తలుపువారగా నిల్చుని వింది.

"భరణికి ప్రమోషనొచ్చి వారంలోగా హైద్రాబాద్ వెళ్తున్నాట్ట. నీలిమ అతడికి బాగా నచ్చిందట. కట్నకానుకలేవీ వద్దు. చివరిసారి అడిగి రమ్మన్నాడు. ఇక మీ ఇష్టం..." అని ఆగాడు పూజారి.

రామచంద్రయ్య అనసూయమ్మవైపు చూసాడు.

అనసూయమ్మ నీలిమ గదిలోకి వచ్చింది.

మళ్లీ పూజారి చెప్పాడు.

"మీరు గనక ఓ.కే. అంటే... పాపని వెంటబెట్టుకొని ఈ సాయంత్రం మీ ఇంటికి వస్తానన్నాడు. కాని ఆపరేషన్ మాత్రం... తప్పనిసరంటున్నాడు..."

చివరిమాట విని అనసూయమ్మ ఆగిపోయింది. కూతురి కళ్లలోకి చూసింది. పూజారి అంటున్నాడు-

"నీలిమకు మళ్లీ పెళ్లి జరగటం చాలా కష్టం. ఈ సంబంధమే మీ అదృష్టమనుకోండి. ఆపరేషన్‌కు మీకు భయమక్కర్లేదు. ఆయన ఫ్రెండ్ ఒకామె గైనకాలజిస్టుంది. అదేదో ఆయనే చూస్కుంటాడు."

నీలిమ కూడా తల్లి కళ్లల్లోకి చూసింది.

నిమిషంపాటు అందరి మధ్య నిశ్శబ్దం...

అనసూయమ్మ అడక్కముందే... నీలిమ వంచుకున్న తలూపింది సరేనన్నట్టుగా.

ఆ ఆమోదం తల్లిని ఆనందపర్చకపోయినా... వరండాలోకొచ్చి పూజారితో చెప్పింది.

''ఆయన్నీ సాయంత్రం రమ్మనండి.''

పూజారి 'శుభం' అనేసి వెళ్లిపోయాడు. ఆ ఇంట్లో ముగ్గురి మధ్యా మాటలే కరువయ్యాయి. సాయంత్రం అవుతుంటే నీలిమలో ఏదో ఆందోళన. కాలం ఆగకుండా అయిదు గంటలు కొడుతున్నప్పుడు... పాపతో సహా అడుగుబెట్టారు భరణి, పూజారి.

భరణి వస్తూనే నీలిమకు నమస్కారం చెప్పాడు. నీలిమ కంగారుపడింది.

''ఈ శుక్రవారం ఆఫీసర్ ప్రమోషన్ మీద హైద్రబాద్ వెళ్తున్నాను. స్టాఫంతా స్వాగతం చెబితే నాప్రక్కన మీరుండటం నాకు సంతోషంగా వుంటుంది. గురువారం రోజు ఏ ఆర్భాటాలు లేకుండా రిజిస్టర్డ్ మార్యేజి చేసుకుందామనుకుంటున్నాను. మీరు సోమవారం హాస్పిటల్లో అడ్మిట్ అవుతే...' అని ఆగిపోయాడు.

''సరే బాబు...'' అన్నాడు రామచంద్రయ్య.

నాలుగేళ్ల పాప నీలిమ దగ్గరికి వచ్చి పరీక్షగా చూస్తూ నిల్చుంది. ముద్దుగా...బొద్దుగా వుంది. ఆపిల్‌లా... అందంగా వుంది.

''డాడీ... ఈమేనా మమ్మీ... బావుంది'' అంది.

ఆ మాటకు నీలిమ మొహం నిండా సంతోషం అలుముకుంది. పాపని దగ్గర తీసుకొని ముద్దెట్టుకుంది.

''ఇలా... ఈ బిడ్డే నీ కన్నకూతురనుకోమ్మా... సవతి తల్లి నీడలు పొడసూపకూడదనే భరణిగారి భయం. అందుకే మీరు ఎల్లుండి ఉదయం జాహ్నవి నర్సింగ్‌హోంకి వస్తే... సరిపోతుంది'' అని చెప్పాడు పూజారి.

ఆ అరగంట- పాప నీలిమను అంటిపెట్టుకునే వుంది. తర్వాత వాళ్లు వెళ్లిపోయారు.

* * * *

ఆపరేషన్ బెడ్‌మీద పడుకున్నాక నీలిమకు తన జీవితం విచిత్రంగా తోచింది. తమ 'త్రివేణి సంగమం'లో ఒక నది (శైలజ) అప్పుడే సాగరంలో కల్సిపోయింది. మరోనది (రేవతి) పాపాల్ని మోస్తూ మురికిదారులై చీలిపోతోంది. మరోనది(తను) గుండశిలల్ని ఢీకొంటూ లోయల్లోంచి అగాధాల్లోకి పడుతూ... పుడుతున్న నిప్పుని గుప్పెడంత గుండెలో దాచుకొంటూ సాగుతోంది.

నర్స్ ఇచ్చిన ఇంజక్షన్‌తో కళ్లు మూతలుపడిపోతున్నాయి.

ఏ ఆడదానికీ జరగనంత హేయంగా... పెళ్లికి ముందే ఆమె గర్భనాళాలు ముడిపడ్డాయి! అంతకన్నా దురదృష్టం మరోటి వుండదేమో? నీలిమకు మెలకువ రాగానే కుట్లతోవున్న తన కడువుని చూసుకుంది నిర్వికారంగా...

ఆ గర్భంలో ఇక ఏ కదలికా వుండదు జీవితాంతం! అన్న వూహే మనసుని

నులిపెడుతోంది. కట్నం ఇచ్చుకోలేని తమ అసహాయతకి ఎన్ని కఠిన పరీక్షలు ఎదుర్కొంటూందో తల్చుకుంటె తల పగిలిపోతుంది.

ఆస్పత్రి నించి డిశ్చార్జి అయ్యాక మూడోరోజునే నీలిమ రిజిష్టర్డ్ మ్యారేజి జరిగింది. భరణి, పాపతోపాటు హైదరాబాద్ బయల్దేరింది.

తల్లిదండ్రులు బరువుగానైనా ఊపిరి పీల్చుఉన్నారు.

* * * *

భరణి తీసుకున్న ఇల్లు అందంగా వుంది. అతడు ఆఫీసులో జాయినయ్యాడు. నీలిమ పాపకి స్నానం చేయించడానికి గౌను విప్పి నోరు తెరిచింది. పాప లేత శరీరం మీద అక్కడక్కడా కమిలిపోయిన మచ్చలు...

"మేఘనా... ఈ దెబ్బలేంటి?" అంది ఆశ్చర్యంగా.

"ఇవా... మానాన్న రోజూ రాత్రి తాగి నన్ను బాగా కొడతాడు." అంది బిక్కమొహంతో.

నీలమనేదో అపశృతి తాకిపోయినట్లయింది మళ్లీ.

తన జీవితం మరో సుడిగుండం కాబోతుందా అన్న వూహే నిలువెల్లా వణికించింది.

"నాన్నగారు... త్రాగుతారా?" అంది ఆందోళనగా, అనుమానంగా.

"ఓ... చాలా... సిగరెట్లు కూడా!" అంది బేలగా. మేఘనకి స్నానం చేయిస్తూ కొన్ని విషయాలు తెల్సుకుంది. తల్లిని పోగొట్టుకుందన్న కోపంతో కొడతాడేమోనన్న భావంతో సర్దుకుంది.

భరణి రోజూ రాత్రి పదకొండు తర్వాత తాగివచ్చేవాడు.

ఆరోజు రాత్రి... మగత నిద్రలో నిలిమ భరణిపై చెయ్యేసింది.

చెయ్యి తీస్తూ చెప్పాడు భరణి-

"నీకు ఆపరేషనయ్యిందని వూరుకుంటున్నాను. మనిద్దరి మధ్య ఇప్పుడప్పుడే సెక్సు మంచిదికాదు" అన్నాడు.

నీలిమ నివ్వెరపోయింది. భరణి ప్రవర్తన అర్థంకావట్లేదు. రోజూ తాగి రావటం...మొదటి భార్యని విపరీతంగా తిట్టి నిద్రపోవటం జరుగుతోంది. మేఘన మాత్రం నీలిమకు బాగా దగ్గరయింది.

ఆరోజు మందు దొరకలేదని చిరాగ్గా వచ్చాడు భరణి. నీలిమ కాఫీ తెవడానికి వంటింట్లోకెళ్లింది. భరణి మేఘనని లాలనగా పిలిచాడు.

"బేబీ... ఇలారా..." అని దగ్గర తీసుకొని "అమ్మ ఇంట్లోనే వుంటుందా? పక్కింట్లోని ఎవరైనా మగాళ్లతో మాట్లాడుతుందా?" అనడిగాడు.

కాఫీ తెస్తున్న నీలిమ నిర్ఘాంతపోయింది.

"నాకలాంటి ఆలోచనలు వుండవులెండి" అంది సీరియస్‌గా కాఫీ ఇస్తూ. భరణి దెబ్బతిన్నట్టుగా చూసాడు.

మరేం మాట్లాడలేదు.

రాత్రి పదకొండు దాటింది...

భరణి అటుతిరిగి పడుకున్నాడు. నీలిమ అసహనంగా అటూ ఇటూ దొర్లింది. భరణివైపు తిరిగి గబుక్కున బలంగా లాక్కుంది తనవైపు.

భరణి ముడుచుకుపోయాడు. ఒళ్లంతా క్షణంలో చెమటలు పట్టాయి. నీలిమని విదిలించకొని మంచం మీంచి లేచివెళ్లి సిగరెట్ వెలిగించుకున్నాడు.

నీలిమ సిగ్గుతో తలొంచుకుంది.

సిగరెట్ పొగ గదంతా ప్రాకుతోంది. భరణి చిన్నగా నవ్వాడు. నీలిమ తలెత్తి చూసింది.

"ఇంకెప్పుడూ ఇలాంటి ఆలోచనలు పెట్టుకోకు. నేను ఫ్రాంక్‌గా చెప్తున్నాను. నాకు... మగతనం... లేదు."

చలిపిడుగు నెత్తిన పడ్డట్టయింది నీలిమకు. గుండెను శరాఘాతమై తాకిన మరోగాయం...

"అందుకే ఈ సొసైటీ గుర్తించకుండా... నాకులేని మగతనం బయటపడకుండా పెళ్లికి ముందు నీకు ఆపరేషన్ అన్న కండీషన్ పెట్టి నిన్ను చేస్కుంది".

నీలిమకి అయోమయంగా వుంది. చీకటి శకలాల కింద నలిగిపోతున్న బతుకుని ఉగ్గిపడుతూ సందిగ్ధంగానే అడిగింది.

"మరి... మరి... మీకు ఈ పాప?"

"అది నా మొదటి భార్య కన్నది. కాని నాకు కాదు. నీలాగే సరసాలాడితే నాకు మగతనం లేదని తెలిసాక... నాకు తెలీకుండా... ఓ కాలేజి కుర్రాడితో సరసాలాడి అక్రమంగా కంది. అందుకే దాన్ని కూల్‌గా చంపేసా..." అన్నాడు.

నీలిమ ఆ మాటతో వణికిపోయింది. భయంగా "చంపేసారా?" అంది.

"అవును. వేరేవాడితో కులికితే మగాణ్ణి నాకు రోషముండదా? నీకెలాగూ ఆపరేషనై పిల్లలు పుట్టరని ఈలోకానికి తెల్సు. మనిద్దరం కాపురం చేస్తున్నామనే లోకానికిలాగే వుండాలి."

చివుక్కున అతడు నీలిమపైకి వంగాడు. బెడ్‌లైట్ వెలుతుర్లో అతడి ముఖం వికృతంగా కన్పడుతోంది. నిజరూపం బయటపడి నికృష్టంగా కన్పడుతున్నాడు.

అతడిలోనీ శాడిజమంతా ముఖంలోకి ప్రాకింది.

"అదుపు తప్పిందాన్లాగా నువ్వా ఎవడితోనైనా సరసాలాడితే నీకూ సిగరెట్ వాతలు

తప్పవు. సాంపిల్ చూస్తావా?" అన్నాడు.

నీలిమ అరుపు నాలుగ్గోడల మధ్య పగిలిపోయింది. నిజం భరించలేని నీలిమ రాత్రంతా రోధిస్తూనే వుంది.

సూర్యుడు రక్తం కక్కుకుంటూ భళ్లున తెల్లారాడు.

* * * *

రోజంతా... మెదడు పొరల్లో అనంతమైన ఘర్షణ...

సంద్ర కెరటాలై ఢీకొంటున్న గర్జన...

భరణితో కాపురం చేయటం పులిబోనులో సావాసం చెయ్యటమేనని గుర్తించింది. క్రమంగా మొదలైన తెగింపు...

పిరికివాణ్ణి రెచ్చగొడితే తిరగబడే ధైర్యం... మొండి ధైర్యం.

నిస్సహాయ స్థితిలో నిర్జీవుడి నరాల్లో సైతం పొంగే నెత్తుటి గీతం పాడే ప్రతిఘటన.

యజ్ఞం ముందు నిల్చిన బలిపశువు హోమగుండాన్ని ఢీకొన్న తెగింపు...

బాత్రూంలోంచి తల తుడుచుకుంటూ వచ్చిన భరణి... సూట్‌కేస్‌తో నిల్చున్న నీలిమని చూసి స్టన్నయ్యాడు.

"ఎక్కడికే బయల్దేరావ్?" కఠినంగా కంగారుగా అడిగాడు.

"ఏట్లోకి" విసురుగా జవాబిచ్చింది.

"పెళ్లయి నెల్రోజులు కూడా కాలేదు. అప్పుడే విడిపోయేంతవరకొచ్చిందా?"

"మగతనమే లేని వాడివి. నీతో కాపురమేమిట్రా?" వికారంగా మొహం పెట్టి అంది-

దెబ్బతిన్న పులిలా పైకొచ్చాడు భరణి.

"అడుగు ముందుకేస్తే ఈ కత్తిపీటతో చంపేస్తాను" నీలిమ ఉగ్రావతారాన్ని చూసి తగ్గిపోయాడు.

"ఎందుకురా... పదిమందిలో నువ్ పెద్దమనిషివని... నీకో అందమైన భార్య వుందని... దాంతో సంసారం చేస్తున్నానని... ఆపరేషన్‌తో పిల్లలిక చాలని... నీస్వార్థం కోసం నేను గర్భనాళాలు ముడేసుకొని బలయ్యానురా బాస్టర్డ్...

పెళ్లికి ముందు ట్యూబెక్టమీ ఆపరేషన్‌తో ఏ ఆడపిల్లా త్యాగం చెయ్యదురా... కాని నేను చేసాను. త్యాగమే కాదు... అవసరమైతే ఇప్పుడు హత్య కూడా చేయగలను. ఇంకా నా ఛాయలకొచ్చినా నీ నీడ కూడా లేకుండా చేస్తాను. గుడ్‌బై..."

మగజాతి మీదే తిరగబడ్డ కృతనిశ్చయంతో కసి నింపుకున్న బెబ్బులిలా కదిలింది. గేటు తీసి బయటికి అడుగు పెడుతుంటే... 'అమ్మా' అని పిలుపు...

ఆర్ద్రమైన పిలుపు-

అవ్యాజమైన అనురాగపు పిలుపు...

ఆవేదనగా వెనక్కి తిరిగి చూసింది. కన్నీళ్లతో కంపించిపోతూ... మేఘన. ఆ పిలుపులో కదిలించే కరుణం... గర్భకోశంలో కుండపోతయిన వరుణం... తన జీవిత మజిలీలో ఆ పదమే అరుణారుణం...

బ్రీఫ్‌కేస్ వదిలి... వేగంగా పరిగెత్తుకొచ్చింది మేఘనని విడిచి నువ్వుండలేవు" అన్నాడు నవ్వుతూ.

భరణి నవ్వు విని చివ్వున లేచింది.

"నాకు తెలుసు. నువ్వెళ్లలేవు. మేఘనని విడిచి నువ్వుండలేవు" అన్నాడు నవ్వుతూ.

"గుండె గండశిలలా మారిందిరా... మేఘనే కాదు, సూర్యుడు అడ్డమొచ్చినా వుండను" అని వెనుదిరిగింది.

మేఘన దీనమైన పిలుపులకు కాళ్లు వెనక్కి లాగుతున్నా- గుండెకోత పెడుతున్నా నిగ్రహించుకొని గేటు దాటింది.

గేటు దాటాక చప్పున వచ్చిన ఆలోచన...

ఎక్కడికెళ్లాలి???

పుట్టింటికి...!!!

"వద్దు... వద్దు... మళ్లీ ఈ జీవితం ఇలా అయిందంటే వాళ్లు బ్రతకరు. వాళ్లనలాగే సంతోషంగా వుండనీ, పుట్టింటికి వద్దు..." ఆమె మనసు ప్రతిఘటిస్తోంది. గమ్యం తెలీక రోడ్డు మీంచి వెళుతుంటే... ప్రక్కనించి వెళ్లినవాడల్లా పోస్ట్‌మాన్ తిరిగొచ్చాడు.

"మేడమ్, మీపేరు నీలిమ కదూ..." అన్నాడు.

"అవును" అంది నిర్లిప్తంగా.

మీ ఇంటికే వెళ్తున్నాను. మీకు రిజిస్టర్ పోస్ట్ వుంది. మీరు వూరెళ్తున్నట్టున్నారు" అని సంతకం తీసుకొని పెద్దకవర్ ఇచ్చాడు.

ఫ్రమ్ అడ్రస్‌లో 'రేవతి' పేర వుండటంతో రోడ్డుప్రక్కనే వున్న సిమెంట్ బెంచీపై కూలబడి కవర్ విప్పింది.

"నీలూ...

మళ్లీ పెళ్లి చేసుకొని ఆనందంగా వున్నావని తలుస్తాను. రెండు మూడ్రోజుల్నించి డెయిలీ పేపర్లు చదివి నాగురించి ఆందోళన పడ్డావా? ఏం వర్రీ కావద్దు. నేను ఆనందంగా వున్నాను.

నా ఛాలెంజ్ నెరవేరింది. నన్ను రేప్ చేసినవాడ్ని దగ్గరతీసి వాడి అంగాన్ని తెగనరికాను. వాడు చచ్చిపోతాడేమోనని భయమేసింది. కాని డాక్టర్లు బ్రతికించారు. థాంక్‌గాడ్. వాడు

బ్రతకాలి... ఈ సమాజం అంతా వింతగా, వెర్రిగా, ఎగతాళిగా వాణ్ణి చూస్తుంటే క్రుళ్లి క్రుళ్లి బ్రతకాలి. రేప్ చేయబడ్డ ఆడదాని మానసిక వేదనకన్నా వాడి బాధ ఎక్కువేంకాదు.

ఇప్పుడు రాష్ట్రంలో నేనో సంచలనం వ్యక్తిని. కెమెరాలు, పత్రికలు నామీదే ఫ్లాష్ అవుతున్నాయి. నన్ను అరెస్ట్ చేసాక నేను చేసిన పనికి కోర్టు ఆరు సంవత్సరాల కారాగార శిక్ష వేసింది.

నీలూ... నాకు మగజాతి మీద, ఈ సమాజం మీద విరక్తి పుట్టిందే. జైలులో ఆధ్యాత్మికంగా ప్రిపేరవాలనుకుంటున్నాను. ఆరేళ్లు... ఆ తర్వాత కూడా ఈ మనుషుల మధ్యకు రాను. ఇరవై రెండేళ్లకే నూటయాభై ఏళ్ల అనుభవాన్ని గడించాను. అందుకే ఆశ్రమానికి వెళ్లాలనుకుంటున్నాను. ఈ రంగుల జీవితం వదిలేముందు వరంగల్‌లో నాకున్న చిన్న ఇంటిని నీ పేరున రాసి... ఆఇంటి తాళం చెవుల్ని కూడా రిజిస్టర్ ద్వారా నీకు పంపుతున్నాను. ఎప్పుడైనా...

కట్నం తేలేదని నీ మొగుడు విసుగుపడితే... గర్వంగా ఈ ఇంటిని చూపించు. నా కలల పంటలో వుంటూ నన్ను కలకాలం గుర్తుంచుకో. శైలజ ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థిస్తూ... రాజమండ్రి లేడీస్ సెల్‌కి వెళ్తూ...

నీ రేవతి."

నీలిమ కళ్లు మసకబారి అక్షరాలు సరిగ్గా కన్పించలేదు.

పోస్ట్‌మాన్ ఏడుకొండలెత్తు దేవుడిలా ఎదిగిపోయి కన్పించాడు.

కళ్లు తుడుచుకొని... కవర్‌లోని తాళం చెవుల్ని తీసి... ఉత్తరాన్ని గుండెల మధ్య దాచుకొని ఇమ్లిబన్ కొచ్చి వరంగల్ బస్సెక్కింది.

సీటుకి జారగిలబడి 'రేవతీ... రేవతీ... నీకు వేనవేల కృతజ్ఞతలే" అని వందలసార్లు అనుకుంది.

*  *  *  *

ఆ ఇల్లు..! అందంగా, పొందికగా వుంది. సామానేమీ లేకపోయిన అయిదు గదులతో అందంగా వుంది. ఆ ఇంట్లో చేరిన మూడోరోజున నీలిమ బయట అడుగు పెట్టింది ఉద్యోగాన్వేషణలో...

కాజీపేట... హన్మకొండ, వరంగల్... లేడీస్ ఎంపోరియాల్లో, క్లాత్ స్టోర్స్‌ల్లో, ప్రైవేట్ స్కూల్స్‌లో, చివరికి పనిమనిషిగా... అంతటా నిరాశే ఎదురైంది.

మరోరోజు...

ఇంకోరోజు...

తిరుగుతూనే వుంది. ఎవరెవరినో కలుస్తూనే వుంది.

హన్మకొండ చౌరస్తాలో సుధా ఫైనాన్స్‌లో అడుగుపెట్టి అక్కడున్న వ్యక్తితో- "ఏమండీ... ఏదైనా పని దొరుకుతుందా?" అనడిగింది. ఆ వ్యక్తి నీలిమని ఎగాదిగా చూసి "మీకు టైపొచ్చా?" అనడిగాడు. ఆయనకి ఏభై ఏళ్లుంటాయి.

"ఇంగ్లీష్ లోయర్ పాసయ్యాను" అంది ఆనందంగా.

"మీ సర్టిఫికెట్స్ ఇవ్వండి. మామేనేజర్‌గార్కి చూపిస్తాను. రేపే టైపిస్టు కావాలని పేపర్లో వేయాలనుకుంటున్నాం" అన్నాడతడు.

నీలిమ గతుక్కుమంది. "సార్... సర్టిఫికెట్స్ లేవు... సారీ... నేను బాగా టైప్ చేస్తాను" అంది ప్రాధేయంగా.

"భలేవారండీ. నాక్కూడా టైపొచ్చు. కాని సర్టిఫికెట్ లేదు" అన్నాడా పెద్ద మనిషి.

"సార్... నేను చాలా కష్టాల్లో వున్నాను. ప్లీజ్! నాకీ ఉద్యోగమిచ్చి పుణ్యం కట్టుకోండి" అంది కళ్లనీళ్లతో. ఆమె కన్నీళ్లు చూసి ఆ పెద్దమనిషి చలించిపోయాడు.

"సర్టిఫికెట్ లేకుండా ఉద్యోగమెలా ఇస్తారమ్మా... మీరే చెప్పండి" అన్నాడు.

"నిజమేసార్... కాని నేను బాగా టైప్ చేయగలను. కావలిస్తే ఏదైనా మ్యాటరివ్వండి. టైప్ చేసి చూపిస్తాను" అంది.

ఆ పెద్దమనిషి కాసేపు ఆలోచనలో పడిపోయాడు.

"చూడమ్మా... ఒక పద్ధతి చెప్తాను. మీరు ఒక వారం రోజులు ఎలాంటి జీతం లేకుండా పనిచెయ్యండి. మీరు టైప్ చేసిన కాగితాల్ని మేనేజర్‌గార్కి చూపి మీ పరిస్థితి చెప్తాను. అప్పటికీ ఆయన్ని ఒకే చేయడానికి ప్రయత్నిస్తాను. తప్పుల్లేకుండా టైప్ చేయాలి. ఏమంటారు?" అన్నాడతడు.

ఈ ఉద్యోగం సంపాదించాలంటే అతడు చెప్పింది నిజమేననిపించింది. సరే అంది ఆనందంగా.

"రేపట్నించి రండి..." అన్నాడాయన తన పనిలో మునిగిపోతూ.

* * * *

నాలుగు రోజుల్నించి నీలిమ టైపు చేస్తూనే వుంది. టైపు చేస్తున్న మ్యాటర్‌ని బట్టి అది నలభైదిలక్షలతో నడుస్తున్న ఫైనాన్స్ కంపెనీ అని అర్థమైంది. దాదాపు ఇరవైమంది వరకూ పనిచేస్తున్నారు.

ఆరోజు మధ్యాహ్నం క్యాషియర్‌గా పనిచేస్తున్న ఆ పెద్దమనిషి నీలిమ దగ్గరికొచ్చి నాలుగు రంగుల గులాబీలున్న ఫ్లవర్ బోకేనిచ్చి-

"ఇది మా మేనేజర్‌గారు మీకిమ్మన్నారు" అనేసి వెళ్లిపోయాడు. నీలిమకేమీ అర్థం కాలేదు.

మరో మగపురుగు తన జీవితాన్ని తొలచడానికి రాయబారమా అనుకుంది. అందమైన ఫ్లవర్ బొకేలో వున్న చిన్న స్లిప్‌ని తీసి చదివింది-

"నీలిమ గార్కి-

ఈరోజు సాయంత్రం మా ఇంటికి రండి. ఎదురుచూస్తుంటాను" అన్న వాక్యం చదివి త్రుళ్లిపడింది. ఇప్పటివరకు అతణ్ణి చూడనేలేదు. ఇంటికి రమ్మంటాడేమిటి? ఈ ఉద్యోగం ఎరగా... ఏమైనా కోరతాడా? ఛ...ఛ... ఇంకా ఆలోచించలేకపోయింది. ఒకవేళ అదే జరిగితే... తగిన సమాధానం చెప్పాలి.

అవసరమైన ప్రతిసారీ... ఇక పురుష ప్రపంచాన్ని ఎదుర్కోవల్సిందే అని నిశ్చయించుకుంది.

"శర్మగారు... ఎం.డి గారి అడ్రసెక్కడ?" అని వచ్చి అడిగింది.

"3-24-12, వేయి స్థంబాల గుడి ప్రక్కన" క్లుప్తంగా చెప్పి తన పనిలో మునిగిపోయాడు క్యాషియర్.

* * * *

సాయంత్రం ఆరున్నర దాటింది...

ఆ ఇంటి ఆవరణలో అడుగుపెడుతూనే గుండె చిక్కబట్టుకుంది నీలిమ. అందంగా... క్రోటాన్ మొక్కలతో... రకరకాల గులాబీలతో... ఎర్ర మందరాలతో నిశ్శబ్దంగా వుంది. గేటు దాటి రాగానే బొచ్చుకుక్క మూలిగి తిరిగి పడుకుంది. తలుపులు తెరిచే వున్నాయి.

అయిదు నిమిషాలు తలుపు దగ్గరే నిలబడింది. లోపల్నించి ఏ అలికిడీ రాలేదు. ధైర్యంగా వరండాలోకి అడుగుపెట్టి ఇల్లంతా కలియజూస్తూ... ఒక్కసారిగా దిగ్భ్రమతో కళ్లని కట్టేసి చూపుల్ని శిలువవేసినట్టు... గోడమీది లాంగ్‌సైజు ఫోటోని చూస్తుండిపోయింది...

అందమైన 'నీలిమ' ఫోటో...

తన ఫోటో ఇక్కడ... ఈ ఇంట్లో...

నమ్మశక్యంగాక కళ్లు తేలేసి చూస్తుంటే 'నమస్కారం' అని విన్పించి ఈలోకంలోకొచ్చింది. చప్పున తిరిగి చూస్తే... చేతులు జోడించి నవ్వుతూందామె.

ఆమెవరు? ఆమెనెక్కడో చూసింది...?

ఎక్కడ చూసింది? ఎక్కడ? ఎక్కడ?

"నన్నింకా మీరు గుర్తుపట్టలేదా? రండి కూచోండి" అంది సాదరంగా. అసలు తమ మేనేజర్ మగవాడన్నట్టు గుర్తు...

అప్పుడే పైమెట్లు దిగివస్తూ 'నమస్కారం నీలిమగారూ...' అన్న వ్యక్తివైపు చూసి షాక్ తింది.

అతడు... నిరంజన్. ఈమె అతడి భార్య.

నిశ్చయ తాంబూలాల రోజు ఇచ్చిన పదిహేనువేల రూపాయల్తో పారిపోయిన నిరంజన్...

వేములవాడ గుడిమెట్ల మీద క్షమించమని ప్రార్థించిన... నిరంజన్. నీలిమ పదినిమిషాలవరకూ తేరుకోలేకపోయింది.

"పెళ్లిచేసుకొని పారిపోయొచ్చాక మీ డబ్బుతో బ్రతకటం నేర్చి ఈ పీరియడ్‌లోనే ఎదిగి ఫైనాన్స్ పెట్టాను. నా గదిలోని అద్దాల్లోంచి మీరు కన్పిస్తారు. మిమ్మల్ని చూసి... మీ ముందుకొచ్చి తలెత్తుకొనే సంస్కారం లేక మా ఇంటికి ఆహ్వానించాను. మీరు ఇంకా క్షమించకపోయినా... మేం మిమ్మల్ని ఆరాధిస్తున్నాం" అని తన ఫోటోవైపు చూపెట్టాడు.

"రోజూ మేమిద్దరం లేవగానే మీ ఫోటోకి నమస్కరించందే... ఏ పనీ ముట్టుకోం" అంది ఆవిడ. ఆమె పేరు నైమిషగా పరిచయం చేసుకుంది.

నీలిమకింకా కలో, నిజమో అర్థంకావట్లేదు.

"మీరికనించీ మా ఇంట్లోనే వున్నా అభ్యంతరం లేదు" అందావిడ.

"వద్దు... వద్దు... సారీ" అంది నీలిమ. మాట్లాడుతూనే ఆవిడ డైనింగ్ టేబిల్‌పై రకరకాల వంటకాలు వడ్డించింది. వాళ్ల బలవంతంతో నీలిమ భోజనం చేసింది.

భోజనం చేస్తూ నిరంజన్ అన్నాడు-

"మీ వ్యక్తిగత విషయాలడిగి మిమ్మల్ని బాధపెట్టను. క్యాషియర్ శర్మగారు నాకు కొంత చెప్పారు. మీరు చేసే టైపిస్ట్ ఉద్యోగానికి నేనిచ్చేది జీతం అనడానికి నాకే ఇన్సల్ట్‌గా వుంది.

మాకు జీవితాన్నిచ్చిన మీకు నెలకి అయిదువేలు చొప్పున చెక్ పంపిస్తాను. అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తుండండి."

నిరంజన్ భార్య నైమిష నీలిమకి కొసరి కొసరి వడ్డించింది. ఈ ఒంటరి నగరంలో తనకో ఆత్మీయుల్ని చూపించిన దేవుడికి మనసులోనే మొక్కుకుంది.

ఆ సంతోషంతోనే... సెలవ్ తీసుకుంది.

* * * *

నెలరోజులు గడిచాయి.

నీలిమలో ఏదో స్వేచ్ఛ... క్రొత్త ఉత్సాహం... శరీరంలో కూడా మార్పు. ఓరోజు ఫైనాన్స్‌లోకి అడుగుపెట్టిన నీలిమ... మేనేజర్ గదిలో వున్న భరణిని చూసి గతుక్కుమంది. కలవరపడింది... కంగారుపడింది.

నిరంజన్ నీలిమ దగ్గరికొచ్చాడు. నీలిమ తలొంచుకుంది.

"నీలిమగారు... మీకోసం మీ ఆయనొచ్చారు. పాపం మీ కూతురికి చాలా జ్వరంగా

వుందట" అన్నాడు.

ఆవెనకే వచ్చిన భరణి "నిజం నీలిమా. ఏదో భార్యభర్తలం. సరదాగా గొడవపడ్డంత మాత్రాన ఇలా వేరే కాపురం పెట్టేయడమేనా? మేఘన నీకోసం పలవరిస్తోంది. తెల్సా? నన్ను క్షమించు నీలిమా... ఇంటికెళ్దాం పద" భరణి బాధగా అద్భుతంగా చెప్పాడు.

అప్పటికే ఫైనాన్స్‌లోని జనమంతా నీలిమవైపు చూడటం మొదలెట్టారు. నీలిమకి కంపరంగా వుంది.

"నీలిమగారూ... డబ్బు ఇబ్బందులైతే నాకు కబురెట్టండి. కానీ మంచి భర్తని విడిచిపెట్టి..."

"నిరంజన్‌గారూ..." తీవ్రంగా అరిచింది నీలిమ.

"వాడు మంచి భర్తా? కాదు. వాడొక మొగతనం లేని శాడిస్టు. వాడికోసం నా మాతృత్వాన్ని కూడా..." కంఠంలో దుఃఖం సుడులు తిరుగుతుంటే ఇంకా అనలేకపోయింది.

"నీలిమ. ఈమాత్రం గొడవకు భర్తమీద ఇలా నిందలెయ్యటమేనా? నీతో పర్సనల్‌గా మాట్లాడాలి" అంటూ నీలిమ రెక్కబట్టుకొని బయటికీడ్చుకొచ్చాడు.

"వదులు" అంది పెనుగులాడుతూ. ఫైనాన్స్‌లోంచి బయటికొచ్చాక భరణి నవ్వి చెప్పాడు "నీ జీతం అయిదువేలని తెల్సింది. నెల నెలా అందులోంచి నాలుగువేలు పంపిస్తానని మాటివ్వు. సైలెంట్‌గా వెళ్ళిపోతాను. లేదంటే చాలా గొడవవుద్ది..." అన్నాడు కూల్‌గా.

నీలిమకేమనాలో పాలుపోలేదు. కొంచెం ఆలోచించి ఆ పరిస్థితిలోంచి బయటపడటానికి 'సరే' అంది సందిగ్ధంగానే.

"వెరీగుడ్... అయితే ఈరోజు నీ జీతం తీస్కుంటున్నావ్. అప్పటివరకూ నేనిక్కడే వెయిట్ చేస్తాను. నీ ఖర్చులకు వెయ్యి వుంచేసుకో. ఆడదానివిగా.. అతిగా ఏముంటాయ్?" అన్నాడు మెట్లు దిగుతూ.

మొదటి జీతం కోసం కలలుగన్న నీలిమకు ఆమాట అశనిపాతమై తగిలింది. ఎలా బయటపడాలో అర్థంకాలేదు. వాడన్నింటికీ తెగించినవాడు. తన ఒంటరి బతుకుని చించేసి పోగల సమర్థుడు.

నిశ్శబ్దంగా ఆఫీసులోకెళ్ళి మేనేజర్‌గారి దగ్గర జీతం తీసుకొని క్రిందికొచ్చి భరణి చేతిలో నాలుగువేలు పెట్టింది.

భరణి చిన్న నవ్వాడు.

"వెరీగుడ్ నీలిమా. వచ్చేనెల ఇదే తారీక్కు వస్తాను. బై..." అని వెళ్ళిపోయాడు. నీలిమలో దుఃఖం పొంగుకొచ్చింది. హిమశిఖరంలా కదిలొచ్చి తన సీట్లో కూచొంది. కాని అందరి చూపులు తనవైపే వుండటం గమనించి...

వ్రేళ్లు టైప్ మిషన్ మీద సరగ్గా ఆడలేకపోయాయి.

కన్నీళ్లు రాబోయి వెనక్కిపోయాయి.

పోనీ...పోనీ...పోతేపోనీ...

× × ×

ఇరవై రోజులు జరిగిపోయాయి...

నెల దగ్గిర పడుతుంటే ఇరవై రెండో తేదీన...

పనిలో నిమగ్నమైన నీలిమతో "నీలిమగారు... మీకోసం మీ నాన్న వచ్చాడు" క్యాషియర్ మాటతో ఉలిక్కిపడింది.

తిరిగి చూస్తే దిగులు బొమ్మలా... రామచంద్రయ్య. నీలిమ కళ్లల్లో కన్నీటి నురుగలు బుసలుకొట్టాయి.

"నాన్నా... ఎప్పుడొచ్చావ్? అమ్మ బావుందా? ఇంటికెళ్దాం. ఒక్క నిమిషమాగు నాన్నా..." అమి మేనేజర్‌తో చెప్పి హడావిడిగా తండ్రిని తీస్కొని ఆటోలో ఇంటికి చేరింది.

"ఇంటినించే వచ్చావా నాన్నా?" అంది తాళం తీస్తూ.

"లేదమ్మా. హైదరాబాద్ నించి వస్తున్నాను" అని తండ్రి అనటంతోనే నీలిమకంతా అర్థమైంది.

నీరసంగా కూచుంటూ "అల్లుడొచ్చి రెండురోజులుండి పోయాడమ్మా" అన్నాడు.

గుండె చరియలు విరిగిపడ్డట్టుగా చూసింది నీలిమ.

"వాడు... వాడు మనింటికొచ్చాడా? ఎందుకునాన్నా?"

"నీకు ఆపరేషన్ జరిగాక కడుపులో ప్రేగుకు పుండై హాస్పిటల్‌లో సీరియస్‌గా వున్నావని... ఇరవై వేలు అర్జంట్‌గా కావాలని... నానీలిమని బ్రతిగించండని విపరీతంగా ఏడ్చాడమ్మా."

నీలిమ కాళ్లకింద భూమి కదిలిపోతోంది...

ఒంట్లోని రక్తం సలసలా మరిగిపోతోంది...

"నీకలా అయ్యిందని మీ అమ్మా నేను బావురుమన్నాం. మూడెకరాల పొలాన్ని అమ్మి వాడిచేతిలో ఇరవై వేలు పోసాం. మేమొస్తామంటే నిన్ను మద్రాస్ హాస్పిటల్‌కి తీసికెళ్తున్నట్టు... నాల్రోజుల తర్వాత తిరిగి వచ్చాక రమ్మని చెప్పివెళ్లాడు. కాని నేను హైదరాబాద్ వెళ్లితే... నువ్వసలు వాడతో కాపురమే చెయ్యట్లేదని తెల్సి... నీ అడ్రస్ తెల్సుకొని ఇక్కడికొచ్చాను" పంచెతో కళ్లు తుడుచుకుంటూ చెప్పాడు తండ్రి.

"నాన్నా... వాడిమీద పోలీస్ కేస్ పెడదాం" అంది కళ్లు చండ్ర నిప్పులవుతుంటె ప్రచండమైన క్రోధాగ్నితో వూగిపోతూ.

"నీ బతుకే ఇలా జరిగాక ఏం చేసి ఏం లాభమమ్మా? మీ అమ్మకు ఈ విషయాలన్నీ

తెలుస్తే దాని గుండె పగుల్తుంది" అన్నాడు బాధగా.

"అమ్మకిప్పుడేదీ చెప్పకు నాన్నా. అన్ని పరిస్థితులూ అవే సర్దుకుంటాయి. మీరు స్నానం చేయండి. నా జీవితంలో వాణ్ణి ఒక పీడకలగానే భావిస్తున్నాను" అంది ఆవేశం తగ్గించుకొని ఆలోచిస్తూ...

వాళ్లిద్దరి మధ్యా అగాధం వున్నట్టు మాటలే కరువయ్యాయి. కాని మనసులు ఘోషిస్తున్నాయి.

రెండురోజులుండి రామచంద్రయ్య విధిలేని పరిస్థితిలో వెళ్లిపోయాడు.

*　　　　*　　　　*　　　　*

ఆరోజు... మూడో తారీఖు.

నీలిమకి ఫైనాన్స్ కెళ్లాలంటేనే ఆందోళనగా వుంది. జీతం కోసం వాడు మళ్లీ వస్తాడు. నాలుగు వేలూ పట్టుకుపోతాడు.

నంగనాచిలా ఇంటికెళ్లి తను చావుబతుకుల్లో వున్నట్టు నాటకమాడి పొలం అమ్మించి డబ్బు పట్టుకుపోయిన వాడిపట్ల రగిలిపోయిన మనసు అట్టుడికిపోతోంది.

వాడీరోజు మళ్లీ వచ్చి ఫైనాన్స్‌లో మొగుడిగా నానా రభస చేసి డబ్బులు పట్టుకెళ్తాడు. ఏంచేయాలి? అన్న ఆలోచనల్తోనే పది గంటలయ్యింది.

పోనీ... ఈరోజు ఫైనాన్స్ కెళ్లకపోతే? పిరికిచర్యగా అన్పించినా అదే మంచిదనిపించింది. వెళ్లకూడదని నిర్ణయించుకొని గడియారంవైపు చూస్తుంటె... వాడొచ్చి వుంటాడా? తనకోసం ఆరా తీస్తుంటాడా? డబ్బులకోసం నిరంజన్‌ని అడుగుతాడా?

తన ఇంటి అడ్రస్ తీసుకొని వెతుక్కుంటూ వస్తాడా? వస్తే ఏం చేయాలి? ఆలోచనల్తో మెదడు నరాలు చిట్లిపోతున్నాయి. గుండెల్లో అగ్నిపర్వతాలు ప్రేలుతున్నాయి. కన్నీళ్లు కూడా ఇంకిపోతున్నాయి. సమయం పన్నెండయింది.

"అమ్మగారూ..." ఆఫీస్‌బోయ్ వచ్చి పిలవటంతో ఉలికిపాటుతో చూసింది.

"మీకెసమెవరో ఫైనాన్స్‌కొచ్చారు. ఇంటికి తీసుకొచ్చాను" అన్నాడు వాడు వినయంగా.

శిలాప్రతిమలా లేచి నిల్చుంది నీలిమ.

వాడే. వాడే వచ్చుంటాడు. ప్రేతాత్మలా తోడై తన జీవితాన్ని పీక్కుతింటున్నవాడు. పచ్చి నెత్తురు తాగుతూనే పవిత్రంగా కన్పించేవాడు.

నో... వాడింకా రావటానికి వీల్లేదు. వీల్లేదు. ఆక్రోశిస్తూ అంతం చేయాలన్నంత ఆవేశంగా బయటికొచ్చింది.

కాని బయటెవరో... అపరిచితుడు!

నీలిమని చూడగానే "నమస్కారమండీ. నాపేరు రాఘవ. భరణి ఆఫీసులోనే

పనిచేస్తుంటాను...'' అని చెప్పి నేల చూపుల్తో ఆగిపోయాడు.

''చెప్పండి... ఏం కావాలి?'' అంది దృఢంగా.

అతడు చెప్పలేదు.

''చెప్పండి... అతడు పంపించాడా?'' అంది తీవ్ర స్వరంతో.

''లేదమ్మా... భరణి... భరణి... మూడ్రోజులు కిందట ఎలక్ట్రిక్ షాక్‌తో చనిపోయాడు'' అని చెప్పాడు.

శీతల పవనమేదో గుండెని తాకినంత చల్లగా విన్పించిందా మాట!

యుద్ధం మధ్యలోనే శత్రువు చచ్చిపోయాడన్న వేగుల వార్తలా... హాయిగా వుందామాట. నీలిమ ముఖంలో నీలి నీడలేవో తొలగిపోయినట్లయింది.

''ఆఫీసువాళ్లమే అంత్యక్రియలు జరిపాం. కాని భరణి కూతుర్ని ఏంచేయాలో తెలీక... ఆఫీసులో అందరం చర్చించుకొని ఆ పాపని మీకు అప్పగించాలని తీసుకొచ్చాను'' అన్నాడు.

అప్పటివరకూ అతడి వెనక దాక్కున్న మేఘన దాగుడుమూతలాడినట్టు... అతడి వెనకనించి వంగి 'అమ్మా' అని పిల్చింది.

నీలిమ శరీరం పాదరసమై జారిపోయిందా పిలుపుతో...

గుండె జలపాతమై దూకిందా మాటతో...

ఇంకా ఆగలేనట్టు పరిగెత్తుకొచ్చి... నీలిమని చుట్టేసింది. మేఘన ఒంటినిండా నీలిమ ముద్దులు కురిపించింది.

అతడు సెలవ్ తీసుకొని వెల్లిపోయాడు.

*  *  *  *

నీలిమ మేఘనకు అన్నం తినిపిస్తూ అయిదోరోజున అడిగింది.

''అసలు నాన్నకు కరెంట్ షాక్ ఎలా తగిలింది? తాగి పడిపోయాడా?'' అని.

క్షణాల్లో మేఘనచిన్నారి ముఖం గంభీరంగా మారిపోయింది.

''నేనే కరెంట్ షాక్ ఇచ్చి డాడీని చంపేసాను.''

యుద్ధ రాకెట్లేవో మెరుపుదాడి చేసినట్టు త్రుళ్లిపడింది నీలిమ.

''మేఘనా...'' అంది అప్రయత్నంగానే.

''అవును... డాడీ రోజూ ఎలక్ట్రిక్ షేవర్‌తో గడ్డం చేస్కుంటాడుగా. మొన్నోరోజు ఆ షేవర్‌ని బ్లేడ్‌తో కోసి దాంట్లోని ఎరుపు వైరుని, పచ్చ వైరుని కలిపేసి స్టిక్కర్ అంటించా. రోజూలాగే షేవ్ చేస్కుంటూ... షాక్ తగిలి చచ్చిపోయాడు. ఇక నిన్నూ, నన్నూ రోజూ కొట్టేవారుండరుగా... అందుకే.''

''మేఘనా...'' అంటూ ఆ పాప ముఖాన్ని చప్పున గుండెల్లో దాచుకుంది.

"మగాడా... భూమ్మీదపడ్డ మరుక్షణమే జాత్యహంకార మృగానివై ఉక్కుతీగల ముళ్లకంచెను నాటి... శతాబ్దాల బందీని చేసి... ఇంకా శిథిలం చేయాలని ప్రయత్నిస్తే...

అంతమొందించడానికి ఆయుధాలెందుకు?

ఆడదాని అరమోడ్పు కళ్లల్లో ఫెళఫెళమని ప్రాకే ఎర్ర జీరల్లోంచి కీలాగ్ని రేఖల ప్రళయ ప్రభంజనం చాలు... నీ ఉనికి సైతం కన్పడకుండా స్త్రీత్వం మీద ఉరేయడానికి..."

నీలిమ కళ్లలోంచి వెచ్చటి కన్నీటి బొట్టు చెంపలపై జారిపోయింది.

పోనీ...

పోనీ...

పోతేపోనీ...

* * * *

పదిహేను రోజులు గడిచాయో లేదో...

నీలిమ తల్లి అనసూయమ్మ వచ్చింది. బిడ్డ పరిస్థితి విని బావురుమంది. ఇప్పటికైనా పాపతోసహా ఇంటికెళ్దాం రమ్మని పట్టుపట్టింది.

నీలిమకి తన వూరెళ్లటం ఇష్టంలేదు.

ససేమిరా రానంది. అనసూయమ్మ బ్రతిమాలింది. కోపగించింది.

"ఆడపిల్లకి అత్తగారిల్లంటే అంతఃపురంలోకి వెళ్లే దారులు ఎప్పుడైనా మూసుకుపోవచ్చు. కాని మూతపడ్డ దారులదగ్గరే ఎన్నాళ్లని పడిగాపులు కాస్తాం. పుట్టింటికి దారులు వెతుక్కుంటూ రావల్సిన అవసరం లేదమామ. అమ్మా అని పిలిస్తేనో, నాన్నా అని పలవరిస్తేనో చాలు...

పచ్చటి దారులు ప్రత్యక్షమవుతాయి. నువ్వెప్పుడొచ్చినా మాకు ఆనందమే.

నీకోసం మేం అనుక్షణం ఎదురుచూస్తుంటామని మర్చిపోకు..."

నీలిమ రాదని తెలిసి అనసూయమ్మ కన్నీళ్లతో బయల్దేరింది.

వెళ్లేముందు మరోసారి బ్రతిమాలింది.

"నేనింకా అలిసిపోలేదమ్మా... జీవితంలో పూర్తిగా అలిసిపోయిన రోజు... తప్పకుండా నీదగ్గరికే వస్తాను" అంటూ సాగనంపింది నీలిమ.

* * * *

నీలిమ ఉదయం లేచి మేఘనకి స్నానం చేయిస్తుండగా... కాలింగ్ బెల్ మ్రోగింది. బాత్‌రూంలో మేఘన అల్లరికి చిరుకోపంగా కసురుకుంటున్న నీలిమ అంత ప్రొద్దున్నే 'ఎవరొచ్చి వుంటారబ్బా' అనుకుంటూ వచ్చి తలుపు తీసింది.

తలుపు తీయగానే... కనిపించిన ఆ భార్యభర్తల్ని చూసి ఆశ్చర్యపోయింది. అతడు నిరంజన్, అతడి భార్య నైమిష. వాళ్లిద్దర్నీ చూడగానే నోటమాటరాలేదు.

"మీరు... మీరు..." అంది సందిగ్ధంగా.

"ముందు లోపలికి రానిస్తావా అక్కా" అంది నైమిష. నీలిమ తేరుకొని "రండి... రండి" అంది లోపలికి దారితీస్తూ.

బాత్రూంలోంచి మేఘన కేకలు వేస్తోంది. కుర్చీలు తుడిచి ఇద్దర్నీ కూచోమంది. నిరంజన్ ఇల్లంతా కలియజూస్తున్నాడు. నైమిష కూడా చూసి " చిన్నగా వున్నా అన్నీ పొందిగ్గా, అందంగా అమర్చారు. అవునూ... ఇప్పుడేం చేస్తున్నారు?" అనడిగింది.

"మేఘనకి స్నానం పోస్తున్నాను" నీలిమలో టెన్షన్.

"ముందు స్నానం చేయించిరండి. పిలివని పేరంటంలా మేమిలా చెప్పాపెట్టకుండా వచ్చామేమిటని అనుకుంటున్నారా? ఏమీలేదు. ముందు మీరు పాపకి స్నానం చేయించి రండి" అన్నాడు నిరంజన్.

"ముందు టీ ఇస్తాను. ఒక్క నిమిషం" అంటూ వంటింట్లోకి నడిచింది నీలిమ. వెనకే నైమిష వచ్చి "టీ నేను పెడతాలే అక్కా... ముందు నువ్ పాపకి స్నానం చేయించు" అంది చొరవగా.

నీలిమకి అయోమయంగా వుంది. వీళ్లు అంత ప్రొద్దున్నే రావటం, "ఆఫీస్‌బోయ్‌ని పంపిస్తే నేనే వచ్చేదాన్నిగా" అంది సంశయంగా పాలు గిన్నెలో పోస్తూ "ఏంటక్కా... మీ ఇంటికి మేం రాకూడదా?" స్టవ్ అంటించింది నైమిష.

"రాకూడదని కాదు. నేను మీ ఆఫీస్‌లో ఓ వర్కర్‌ని..." అంటూ ఆగింది.

"మాకు జీవితాన్నిచ్చిన పెద్దదానివి. నిన్ను ఆయనెప్పుడూ వర్కర్ అనుకోవట్లేదు. వర్కర్ అనుకుంటే మా వరండాలో నీ ఫోటో పెట్టి పూజించుకుంటామా? నువ్వో దేవతవి. ఆరోజు వేములవాడ గుడిమెట్లమీద దీవించి పంపిన దేవతని ఈరోజు మరో వరమివ్వమని కోరడానికొచ్చాం" అంది నైమిష.

నీలిమకేమీ అర్థంకాలేదుకాని... టీ మరగగానే వడపోసింది- బాత్రూంలోంచి మేఘన "మమ్మీ... సబ్బు కళ్లల్లోకి పోతుంది. త్వరగా వచ్చేయ్" అని అరుస్తూనే వుంది.

నైమిష ఒక కప్పు నిరంజన్‌కిచ్చి వచ్చింది. తిరిగి వంటింట్లోకి వచ్చి తను ఓ కప్పు తీసుకుంది. నీలిమ నిరాసక్తంగా నవ్వి...

"నేనో శాపగ్రస్తురాలిని... ఆవిషయం నన్ను అనుక్షణం పొడుస్తూనే వుంటుంది. దేవతవంటూ పొగడుతున్నారు మీరేమో."

"అంజనేయుడి బలం ఆయనకే తెలీనట్టు... నీలో దైవగుణమే లేకుంటే ఆరోజు నీ కట్నం పుచ్చుకొని మరో అమ్మాయితో పారిపోతున్నందు ఆయన్ని అక్కడే చంపేసేదానివి. అంత నీచమైన పని ఏ మగాడూ చేసుండడేమో? కాని నువ్వుఉ దీవించావ్. మా తప్పుని

నీపైన వేసుకున్నావ్. నువ్వే కావాలని పెళ్లి కాన్సిల్ చేసుకుంటున్నట్టు చెప్పి మీవాళ్లని ఒప్పించావ్. ఇంతకన్నా ఏం త్యాగం కావాలి? నువ్వు మాలో దేవతగా నిలిచిపోవడానికి...'' ఆవేశంగా అంది నైమిష.

''అదంతా జరిగిపోయిన గతం... నాగతమే ఒక బాధల కుంపటి. భరణి చచ్చిపోయాక... మేఘనే నా జీవితంగా ఇలా వెళ్లదీస్తున్నాను. త్యాగం దేవతలాంటి పదాలు తప్ప ఏం మిగలలేదు'' నిరాసక్తంగా అంది నీలిమ.

''నీ గతాన్ని తవ్వటం మా ఉద్దేశం కాదక్కా... ఒక విషయం నీతో మాట్లాడాలి. ఓ కోరిక నిన్ను కోరాలని వచ్చాం. ఇప్పటివరకూ ఏ ఆడది మరో ఆడదాన్ని ఇలాంటి కోరిక కోరలేదేమో... ఏ చరిత్రలోనూ, ఏ పురాణాల్లోనూ ఇలాంటి ఘటన కన్పించదేమో. అందుకే ఉదయాన్నే నీకోసం వచ్చాం'' అంది నైమిష.

నీలిమ విచిత్రంగా నైమిషవైపు చూసింది.

మెదడ్లో ఆలోచనల సుడులు తిరుగుతుంటే ''అంత పెద్ద కోరిక నేనేం తీర్చగలను'' అంది.

నైమిష కళ్లల్లో తడి.

ఆ తడి నీలిమ మనసు పొరల్ని కదిలించింది.

నైమిష మౌనం చూసి...

''ఏంటి మీ కోరిక... నాకు చేతనవుతే తప్పక తీరుస్తాను. కానిదైతే మాత్రం నేనేం చేయలేను'' అంది.

''నీతో అయ్యేదే... మా జీవితాల్ని నిలబట్టేది. చెప్పక్కా. తీరుస్తావు కదూ!'' నైమిష కళ్లు చెలిమలయ్యాయి.

నీలిమ కరిగిపోయింది.

''మీరు అంతగా బాధపడుతున్న సమస్యేంటి? చెప్పు. తప్పకుండా తీర్చడానికి ప్రయత్నిస్తాను'' అంది నైమిష ఏదో చెప్పబోయేంతలో...

''మమ్మీ... వ్వా... జారిపడ్డాను'' బాత్రూంలోంచి మేఘన కేక విన్పించి ''కాసేపయ్యాక మాట్లాడుకుందాం నైమిష'' అంటూ బాత్రూంవైపు పరిగెత్తింది.

మేఘన జారిపడి ఏడుస్తూనే వుంది.

''అయ్యో... పడిపోయావా... సారీ చిన్నూ...'' అంటూ మేఘనని లేవదీసి స్నానం చేయించింది. టవల్‌తో తుడుస్తుంటే...

''వచ్చిందెవరు మమ్మీ'' అనడిగింది.

''నైమిష ఆంటీ...''

"ఆమెవరు?" అనడిగింది మళ్లీ.

"నీకు తెలీదులే."

"మరి... ఏ ఆడది మరో ఆడదాన్ని కోరని కోరిక ఏమిటి? ఆవిడ నిన్నడుగుతోంది కదా?" అంది అమాయకంగా.

నీలిమ మనసు ఆమాటతో త్రుళ్లిపడింది.

నిజమే... ఏమిటది??

ఏ ఆడదీ మరో ఆడదాన్ని కోరని కోరిక...???

ఏ చరిత్రలోనూ... ఏ పురాణాల్లోనూ కన్పించని ఘటన???

ఏమిటది?

ఏమిటదీ ??

ఏమైవుంటుంది???

నీలిమ ఆలోచనలకు ఏమీ తట్టలేదు. అయినా కష్టాల సుడిగుండాలు, సుడిగాలులు ప్రకంపనలు మళ్లీ తన జీవితాన్ని చుట్టేయకపోతే చాలు.

"ఏంటి మమ్మీ ఆలోచిస్తున్నావ్? అదేనా?" అంది మేఘన.

నీలిమ ఈ లోకంలోకొచ్చి 'నీకెందుకమ్మా.. నువ్ తయారై స్కూల్‌కెళ్లు. పెద్దవాళ్ల విషయంలో పిల్లలు తలదూర్చకూడదు" అంది.

"మరి పిల్లల విషయంలో పెద్దవాళ్లెందుకు తలపెడతారు?" అంది మేఘన.

నీలిమ నవ్వి "నీతో వేగటం నాకు రోజురోజుకీ కష్టమైపోతుంది. మమ్మీని ఇలా సాధించొచ్చా" అంది చిరుకోపంగా.

"సారీ అమ్మా"

మేఘనని రెడీచేసి ఆటోలో పంపించి వచ్చింది నీలిమ. వస్తూనే తనూ కూచుంటూ "సారీ... మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాను. ఇంతకీ మీరు అనేదేమిటి?" అనడిగింది.

నిరంజన్ అయితే తలొంచుకు కూచున్నాడు.

నైమిష మౌనంగానే వుంది. నీలిమ వాళ్లిద్దర్నీ చిత్రంగా చూస్తుండిపోయింది.

రెండు నిమిషాలు గడిచాయి...

"అదేంటి మౌనంగా వుండిపోయారు. ఏంటి నైమిష మీసమస్య" అంది నీలిమ మళ్లీ.

"అక్కా..." నైమిష గొంతులో జీర. కళ్లల్లో కన్నీటి ఊట.

"ఏంటమ్మా... అంత బాధాకరమైన సమస్యా అది" అంటూ లేచివచ్చి నైమిష తలపై చేయి వుంచింది ఆలంబనగా.

నైమిష కళ్లు జలపాతమే అయ్యాయి.

నిరంజన్ ఏమీ మాట్లాడలేదు.

"చెప్పమ్మా... ఏంటి మీ కోరిక... తప్పక తీరుస్తాను. ముందు అదేంటో చెప్పు" అంది.

ఆ మాటతో నైమిష కళ్లు తుడుచుకుంది. అయినా కన్నీళ్లు ఉబికి వస్తుంటే... "నా... నా గర్భసంచి తీసేశారు" అంది.

నీలిమ కళ్లల్లో జాలి కురిసింది.

"నెల తప్పిన నేను డాక్టర్‌కి చూపించుకోగానే... గర్భసంచి పలుచగా వుందని బిడ్డ పెరిగితే తల్లికి ప్రమాదమని పిండాన్ని పిండంతోపాటు గర్భసంచిని తీసేశారు."

"అవునా...!"

"అవునక్కా... ఇక మాకు పిల్లలు పుట్టే యోగం లేదు" అంది కన్నీళ్ల పర్యంతమై.

నీలిమ ఓదారుస్తూ "ఊరుకో నైమిష" అంది. ఆ వెంటనే మనసులో 'మేఘనని దత్తత కోరడానికి గాని వచ్చారా?' అనుకుంది.

తన జీవితంలో అల్లుకుపోయిన తీగలాంటి మేఘన దూరమైతే ఇంకేమైనా వుందా? నో... ఎట్టి పరిస్థితుల్లోనూ మేఘనని వాళ్లకివ్వకూడదు. ఈ విషయంలో రాజీపడకూడదు. ఇప్పటికే జీవితంలో అన్నీ కోల్పోయాను. ఇప్పుడు మేఘనని కూడా పోగొట్టుకుంటే... ఇంకా ఒంటరిగా... వూహూ... ఆవూహే భయంకరంగా వుంది. మేఘనని వీళ్లకివ్వను" అనుకుంది.

"ఇంక మాకు పిల్లలు పుట్టే అవకాశం లేదు. అందుకని..." ఆగిపోయింది నైమిష.

నిమిషంపాటు అందరి మధ్యా మౌనం.

"చెప్పు నైమిష" నిర్లప్తంగా అడిగింది నీలిమ.

"అందుకని... మాకో బిడ్డని కనివ్వడానికి... నువ్వు తల్లివి కావాలి." నెత్తిమీద పిస్సయిల్లు కురిసినంతగా కంపించిపోయింది నీలిమ.

"నువ్వు... తల్లివి... కావాలి."

ఆ మాట చెవుల్లో హోరెత్తింది.

"నైమిషా... ఏంటి నువ్వనేది" నీలిమ అయోమయంగా అంది.

"అవునక్కా... నాకెలాగూ గర్భసంచి లేదు. మాకు ఒక్క వంశాంకురమైనా కావాలి. అందుకోసం... నువ్వు తల్లివి కావాలని అడగడానికి వచ్చాము."

"నాకేం అర్థం కావట్లేదు. నువ్వు కోరుతున్న కోరిక ఎంత నీచమైందో కొంచెమైనా ఊహించావా? నీభర్త శరీరాన్ని పంచుకొని నేను తల్లిని కావాలా? ఎలా ఊహిస్తున్నావ్ నువ్వసలు?" నీలిమ గుండె బరస్ట్ అయింది.

"ఆయన శరీరాన్ని మరో ఆడది పంచుకోవాలని నేను కలలో కూడా ఆలోచించను. కాకపోతే మా మనసుల్ని పంచుకొని ఆలోచించమంటున్నాను... ప్లీజ్!"

నిరంజన్ ప్రేక్షకుడిలా చూస్తున్నాడు.

"నీ మాటలు నాకర్థంకావట్లేదు. నేను తల్లిని కావడమేంటి? నీకో పచ్చి నిజం తెల్సా? పెళ్లికి ముందే ఏ ఆడదానికి జరగని దారుణం నాకు జరిగింది. మూడుముళ్లు పడకముందే నా గర్భనాళాలు ముడిపడ్డాయి"

ఆ మాటకి... ఇద్దరూ విస్మయంగా చూసారు నీలిమవైపు. అయినా నైమిష తేరుకుంది.

"అది కాదక్కా... కొంచెం నేను చెప్పేది విను. మాకోసం నువ్వు తల్లివి కావాలంటే ఆయన శరీరాన్ని తాకనక్కర్లేదు. టెస్ట్‌ట్యూబ్ పద్ధతులు చాలా వచ్చాయి. ఆయన స్పెర్మ్‌ని నా అండంతో కలిపి టెస్ట్‌ట్యూబ్‌లో పొదిగిస్తారు. పొదిగించిన అండాన్ని... నీ గర్భసంచిలో ప్రవేశపెడతారు. తొమ్మిది నెలలు మాకోసం మోసి... ఓ బిడ్డని కనివ్వమని కోరడానికి వచ్చాం. నీ గర్భనాళాలు ముడేసివున్నా దీనికి సంబంధం లేదు. తొమ్మిది నెలలు నీ కడుపులో మోసి మాకివ్వు... కాదనకు ప్లీజ్ అక్కా" అంది నైమిష.

నీలిమకంతా విచిత్రంగా తోచింది.

అంతా జరిగాక నిరంజన్ నోరు విప్పాడు.

"ఆరోజు వేములవాడ గుడిమెట్లమీద మీ కాళ్లు పట్టుకొని ప్రాధేయపడ్డాం. ఈరోజు అదే స్థితిలో వున్నాం. మీకు పుట్టబోయేది మా బిడ్డే. మీరు తొమ్మిది నెలలు మోసిస్తారు. మమ్మల్ని కాదనకండి. ప్లీజ్..." నిరంజన్ చేతులెత్తి నమస్కరించాడు.

నీలిమ శిలాప్రతిమే అయింది.

"ఖర్చంతా మేమే భరిస్తాం అక్కా. నా భర్త సెమన్, నా ఓవరీ టెస్ట్‌ట్యూబ్‌లో పొదిగించాక... చిన్న ఆపరేషన్‌తో నీ గర్భంలో ప్రవేశపెట్టినప్పట్నించి డెలివరీ అయ్యేంతవరకూ... నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాము. ఒప్పుకో అక్కా... నీకు నమస్కరిస్తున్నాం..."

నీలిమ ఆలోచనలు అచేతనమయ్యాయి.

మెదడు మంచుగడ్డలా చల్లబడింది.

"మాకు బిడ్డని కనివ్వడానికి అంగీకరించక్కా... మా జీవితాల్ని నిలబెట్టు" నీలిమ మనసు ఉద్విగ్నంగా ఊపిర్లందక ఊగిసలాడుతోంది.

"ప్లీజ్..." నిరంజన్ అన్నాడు.

"అక్కా... ప్లీజ్ నైమిష అంది.

పదినిమిషాల తర్వాత నీలిమ తేరుకుంది.

చిన్ని స్వరంతో అంది. "మీరడిగేది... జస్ట్‌లైక్... విదేశాల్లో... రెంటెడ్ మదర్స్‌లాగా..."

"అవునక్కా... కానిక్కడ నీ గర్భసంచిని అద్దెకివ్వమని అడగట్లేదు. దయచేసి అలా అనుకోవద్దు కూడా. మాకోసం దయతో అంగీకరించు" అంది నైమిష.

అంతా అర్థమయ్యాక... నీలిమ ఆలోచనల్లో పడింది.

నిదానంగా కుర్చీలో కూచొని "నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి" అంది. ఆమెని ఆ సమయంలో ఒంటరిగా విడిచిపెట్టడమే సబబనిపించింది ఇద్దరికీ.

"మాకోరిక మన్నిస్తానని ముందుగా మాటిచ్చావ్ అక్కా. ఆలోచించుకోవటమే కాదు. సాయంకాలానికల్లా నీ అంగీకారాన్ని ఫోన్‌లో తెలియజేస్తావని... ఫోన్ దగ్గరే ఎదురుచూస్తుంటాం" అంది నైమిష.

ఇద్దరూ అక్కణ్ణించి కదిలారు.

నీలిమ మనసులో మళ్లీ అనంతమైన సంఘర్షణ.

రెండుమార్లు 'పెళ్లి' జరిగినా... మగాడి స్పర్శలోతులు కూడా తెలీకుండా ఇప్పుడు తల్లి కాబోతుందా??

అసలేంటి తన జీవితం??

నైమిష చెప్పినట్టు... ఇలాంటి కోరిక ఏ పురాణాల్లోనూ, ఏ చరిత్రలోనూ కన్పించదు. తనకి జీవితంలో తల్లినయ్యే యోగం ఇలా రాసుందా? బ్రహ్మ కూడా మద్యం తాగివుంటే... ఆ మద్యం మత్తులో తన తలరాత రాసివుంటాడేమో...

తల్లినయ్యాక... ఆబిడ్డ తనదికాదు.

కాలేజీ రోజుల్లో... మాతృత్వం గురించి, అందులోని గొప్పదనం గురించి ఫ్రెండ్స్‌తో ఎంత వాదించేదాన్ని.

పెరిగే కడుపుని ప్రేమించటంలో వుండే అనుభూతిని గురించి ఎంతగా ఊహించి చెప్పేదాన్ని చివరికి తన జీవితంలో మాతృత్వం ఇలా తొంగి చూడనుందా?

అసలు తను ఒప్పుకోవాలా.... వద్దా...

అనాలోచితంగా ఆమెకు ఓ పాట గుర్తొచ్చింది. కాలేజీ రోజుల్లో పాడిన పాటకి సెకండ్ ప్రైజ్ వచ్చిన పాటది. అప్పుడు ప్రైజ్ కూడా బిడ్డని లాలిస్తున్న తల్లిని బొమ్మనే ఇచ్చారు. ఆ పాటకూడా లాలిపాటే... ఒకప్పుడు రోజా పాడుకునేది.

జోలాలి... జోలాలి...

నైనా... ఒకటాయె... రెండాయె ఉయ్యాల
రెండు మూడు మాసములాయె ఉయ్యాల
మూడో మాసములోన ఉయ్యాల...
నైనా... ముడికట్లు బిగుతాయె ఉయ్యాల

జోలాలి... జోలాలి...

నైనా... నాలుగు మాసంలోన ఉయ్యాల

నడుమంతా పొంగిపోయె ఉయ్యాల.

జోలాలి... జోలాలి...

నాలుగు అయిదు మాసములాయె ఉయ్యాల

ఉవ్విళ్లు ఊరుతుండె ఉయ్యాల

జోలాలి... జోలాలి...

అయిదు... ఆరు మాసములాయె ఉయ్యాల

నైన... ఆరో మాసంలోన ఉయ్యాల

అలసటలే మొదలాయె ఉయ్యాల

జోలాలి... జోలాలి...

ఆరు... ఏడు మాసములాయె ఉయ్యాల

నైన... ఏడో మాసంలోన ఉయ్యాల

వేవిళ్లు మొదలాయె ఉయ్యాల

జోలాలి... జోలాలి...

ఏడాయె... ఎనిమిదాయె ఉయ్యాల

జోలాలి... జోలాలి...

నైనా... ఎనిమిది మాసంలోన ఉయ్యాల

కడుపులోన కదలికలు ఉయ్యాల

జోలాలి... జోలాలి...

ఎనిమిదాయె తొమ్మిదాయె ఉయ్యాల

నైనా... తొమ్మిదో మాసంలోన ఉయ్యాల

శ్రీకృష్ణ జన్మమురా ఉయ్యాల...

ఉయ్యాల...

ఉయ్యాల...

నీలిమ గొంతు సన్నగా పాడుతుంటె ఈలోకంలోపడి ఉలిక్కిపడింది. తనేంటి ఇలా ఆలోచిస్తోంది.

బాధగా కణతలు రుద్దుకుంది.

ఆలోచనల మధ్య అన్నం కూడా సరిగా తిన్లేదు.

మనసంతా గతం, వర్తమానం, భవిష్యత్తు చుట్టూ గిరికీలు కొడుతుంటే

అన్యమనస్కంగా మారింది.

వాళ్ల వంశాంకురం కోసం గర్భం ధరిస్తే... లోకం ఎలా అనుకుంటుంది? తననెంత విచిత్రంగా చూస్తుంది?

సైన్సు కూడా ఎంతగా ఎదిగింది?

ఈ మనుషులు తనని స్వార్థానికి వాడుకుంటున్నారా?

ఏమైనా... నైమిష మొహం చూస్తే ఎంత బాధగా వుంది. ఆ రోజంతా ఆలోచనలే.

చిత్రమైన ఒత్తిడి.

అనంతమైన... సంఘర్షణ. విచిత్రమైన... అనుభూతి.

*   *   *   *

గడియారం అయిదు గంటలు కొట్టేసరికి ఉలిక్కిపడింది.

గుండెల్లో దడ...

మేఘన కూడా స్కూల్‌నించి ఇంకా రాలేదేమిటి? తన ఫోన్ కోసం వాళ్లు ఎదురుచూస్తూంటారా?

ఫోన్‌లో ఏదో ఒకటి చెప్పాలి...

ఏం చెప్పాలి...?

నైమిష ప్రాధేయపూర్వకమైన మాటలు... నిరంజన్ దీనమైన చూపులు. ఆమెలో తీరం చేరని తుపాన్‌ని సృష్టించాయి. చివరికి తన నిర్ణయాన్ని మార్చుకుంది.

పిల్లని కనివ్వడానికి ఆమె మనసు నిరాకరించింది. మనసుని స్థిరపరచుకొని ఇంటికి తాళం వేసి మేఘన ఇంకా రాలేదేమిటా అని ఆలోచిస్తూనే టెలిఫోన్ బూత్‌వైపు నడిచింది.

నైమిష ఫోన్ నెంబర్ని డయల్ చేసింది.

తన తిరస్కారాన్ని ఎలా చెప్పాలా అన్న సందిగ్ధంలో నుదుటిమీద చిరుచెమట పేరుకొంది.

అవతల ఫోన్ రింగవుతుంటే... గుండె వేగం హెచ్చింది. అవతల్నుంచి ఫోనెత్తగానే "హలో..." అంది.

"నీలిమగారా... మీఫోన్ కోసం ఇక్కడే కూచున్నాం"

నిరంజన్ కంఠం విని... ఒళ్లంతా కంపించింది. అతడి శుక్ర కణాలు తన గర్భంలో పిండంగా ఎదుగుతాయా?

మనసంతా చేదుగా మారింది...

బలవంతంగా అక్షరాలు కూడదీసుకొని "సా...రీ..." అని చప్పున ఫోన్ పెట్టేసింది. ఏదో బరువు దిగిపోయినంత రిలీఫ్‌గా వెనుదిరిగింది.

ఇంటికొచ్చేసరికి... ఆటో బోయ్ కన్పించాడు కాని... మేఘన కన్పించలేదు. ఆటో

బోయ్ నీలిమకి ఎదురుగా వచ్చి "మేడమ్... మేఘనకి స్కూల్లో ఆటలాడుతుంటే కాలికి దెబ్బ తగిలింది. బాగా బ్లడ్ బ్లీడింగ్ అవుతుంటే శ్రీదేవి హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. ప్రిన్స్‌పాల్ మీకు చెప్పమన్నారు" అన్నాడు.

ఆ వార్త విని నీలిమ గుండెలదిరాయి. కంగారుగా ఇంటి తాళం కూడా తీయకుండా అదే ఆటో ఎక్కి శ్రీదేవి హాస్పిటల్‌కి చేరింది..

విశాలమైన ఆస్పత్రి.

తెల్లపావురాలు ఎగురుతున్నట్టు... నర్సుల హడావిడి ఎక్కువగా వుంది. మేఘన రూమ్ కనుక్కొని ఆదుర్దాగా పరిగెత్తింది. మేఘన గదిలో ముగ్గురు డాక్టర్లున్నారు. నీలిమని చూడగానే మేఘన మమ్మీ అంటూ ఏడ్వడం మొదలెట్టింది.

"ఏమైందమ్మా"

మేఘన కాలికి తగిలిన చిన్నగాయాన్ని చూస్తూనే ఆందోళనగా అడిగింది. ఒక నర్స్ గాయం దగ్గర కాటన్ అడ్డుపెట్టి పట్టుకుంది.

"వాలీబాల్ ఆడుతుంటే... పడిపోయాను. కాలికి దెబ్బతగిలి రక్తంపోయింది".

"ఏం కాదమ్మా... చిన్నగాయమే కదా. తగ్గిపోతుంది" నీలిమ అనునయంగా చెప్పింది. అయినా మేఘనలో వెక్కిళ్లు వస్తున్నాయి.

గదిలోంచి ముగ్గురు డాక్టర్లు వెళ్లిపోయారు. ప్రక్కగదిలో దాదాపు వాళ్లు పదిహేను నిమిషాలపాటు డిస్కషన్‌లో మునిగిపోయారు.

చిన్నగాయానికి కట్టుకట్టి పంపాల్సిందానికి... ఇంతసేపు మేఘనని ఎందుకు 'ఇన్ పేషెంట్‌గా' జాయిన్ చేసుకున్నారో నీలిమకి అర్థంకాలేదు. ఇంతలో ఒక డాక్టర్ వచ్చి "పాపకి మీరేమవుతారు?" అనడిగాడు.

"తల్లిని..." చెప్పింది నీలిమ.

"పాప వివరాలు చెప్పండి" అంటూ వయసు, చదువు, బ్లడ్‌గ్రూపు, తల్లిదండ్రుల పేర్లు మున్నగు విషయాలన్నీ రాసుకున్నాడు.

"చిన్నగాయమే కదా డాక్టర్... తీసికెళ్లొచ్చా?" అంది. డాక్టర్ నీలిమవైపు జాలీగా చూసాడు. ఆ చూపుల్లోని పిటీనెస్‌ని కనిపెట్టిన నీలిమ మనసు భయంగా కలవరపడింది.

మనసేదో కీడు శంకించింది.

"సారీ మీ పాప విషయంలో మరో ఇద్దరు డాక్టర్స్ హాస్పిటల్‌కి వస్తున్నారు. మీపాపలో విచిత్రమైన జబ్బు బయటపడింది. అందుకోసం ఇప్పటికిప్పుడు హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ ఝాన్సీమణి ఆధ్వర్యంలో అయిదుగురు డాక్టర్లతో ఒక కమిటీ వేసాం" అన్నాడాయన.

డాక్టర్ మాటలు సగం వరకూ అర్థమై నిర్ఘాంతపోయింది నీలిమ.

అప్పుడ్ నర్స్ మూడు బ్లడ్ బాటిల్స్ తెచ్చిపెట్టింది.

"మా పాపకి... మాపాపకి ఏం జబ్బు డాక్టర్?" మనసు అపశకునాన్ని తలుస్తుంటే మాటలు కూడదీసుకుంటూ అడిగింది.

"నాన్ క్లాటింగ్ డిఫీషియన్సీ"

"అంటే?" నీలిమకి అర్థంకాలేదు.

"అంటే ఇలాంటి జబ్బున్న వ్యక్తుల్లో రక్తం గడ్డకట్టుకుపోదు. బ్లీడింగ్ అవుతూనే వుంటుంది. ఎంత రక్తం ఎక్కించినాసరే. మరోవైపు బ్లీడింగ్ అవుతూనే వుంటుంది. బ్లడ్ క్లాటింగ్ అంటూ వుండదు. దాంతో రక్తస్రావం జరిగి ప్రాణాలకే ముప్పురావచ్చు. ఇలాంటి జబ్బు కోటిమందిలో ఒక్కరో, ఇద్దరికో వుంటుంది."

డాక్టర్ చెపుతుంటే నీలిమలో నవనాడులు కృంగిపోతున్నాయి. అప్పుడే హాస్పిటల్ ఆవరణలోకి సూపర్నెంట్ డాక్టర్ ఝాన్సీమణి కారు వచ్చి ఆగింది. కారు దిగుతూనే ఆమె మేఘన గదిలోకి వచ్చి ఏవో పరీక్షలు చేసింది. లాంజ్‌లోకెళ్లి ఏవో డిస్కషన్ చేసింది మిగతా డాక్టర్లతో. ఓవైపు నర్స్‌లు, కాంపౌండర్‌లు హడావిడిగా తిరుగుతున్నారు. ఆ దృశ్యం చూస్తుంటే నీలిమ గుండె చెరువవుతోంది. మేఘన కాలిలోంచి ఇంకా రక్తం వస్తోంది. రక్తం పోయినకొద్దీ మరోవైపు ఎక్కిస్తున్నారు. తలపై చేయివేసి నిమిరింది.

హాస్పిటల్ అంతటా లైట్లు వెలిగాయి.

రాయిలా మారిందనుకున్న మనసు మళ్లీ వెన్నలా కరుగుతోంది. పేగుబంధం కాకపోయినా పెనవేసుకున్న బంధమై... అనురాగాల మధ్య బందీలా మార్చిన పాపసైతం తనని ఏ విషాదంలోకి తీసికెళ్తుందో అన్న భయం నీలిమ గుండె పొరల్ని చీల్చుతోంది.

"మేఘనా..." అంది భారంగా.

మేఘన కళ్లు మూతలు పడుతున్నాయి. మరోవైపు రక్తస్రావం జరక్కుండా పట్టుకున్న నర్స్ ఇద్దర్నీ జాలీగా చూసింది.

"మీవారికి ఫోన్ చేయలేకపోయారా?" అంది. నీలిమ ఆమేవైపు నిర్లిప్తంగా చూసింది.

"డాక్టర్స్‌తో కమిటీ వేసారంటే మామూలు జబ్బుకాదు. కారిపోయే రక్తం గడ్డకట్టుకుపోయేలా ఏం చేస్తారోగాని... ఈ జబ్బుకి ఎన్ని బ్లడ్ బాటిల్స్ ఎక్కించినా ప్రయోజనం వుండదు. ఎందుకైనా మంచిది. ఈలోపు మీవారిని పిలిపించుకోండి" నర్స్ మరోసారి అంది.

నీలిమకి ఏం చెప్పాలో అర్థంకాలేదు.

అప్పుడే గదిలోకి డాక్టర్ ఝాన్సీమణి, ఆమెతోపాటు మరో నలుగురు డాక్టర్లు వచ్చారు. ఏవో ఇంజక్షన్స్ ఇచ్చారు. కొన్ని టాబ్లెట్లు మింగించారు. మేఘన కోసం రెండు బ్లడ్ బ్యాంకులకి ఫోన్ చేసారు.

ఝాన్సీమణి నీలిమని పరిచయం చేసుకొని ప్రక్కగదిలోకి తీసికెళ్ళింది.

నీలిమని కూచోమని చెప్పి "మీ ఆయనని పిలిపిస్తారా?" అంది.

"సారీ... ఆయనిప్పుడు ఇక్కడ లేరు" అంది తత్తరపడుతూ.

"అలాగా... మీపాపకి విచిత్రమైన జబ్బు బయటపడింది. ఎవరికైనా గాయం తగిలి రక్తం కారితే సాధారణంగా నిమిషంలోపు అది గడ్డకడుతుంది కానీ మీ పాపకి రక్తం గడ్డకట్టక కారిపోతూనే వుంటుంది. ఏదైనా బలమైన దెబ్బతగిలిప్పుడు ప్రాణాలకే నష్టం. రాష్ట్రం మొత్తమ్మీద ఇలాంటి పేషెంట్లు ఎనిమిదిమంది వరకూ ఉన్నారు. మీ వంశానికిగాని, మీ భర్త వంశానికిగాని చెందిన మాడుతరాల వ్యక్తులు మేనరికాలు చేసుకోవటం వల్ల వచ్చే చిత్రమైన జబ్బు ఇది. ఇది నయం కావడానికి ఎనిమిది డోసులు ప్రత్యేకమైన ఇంజక్షన్లు రోజుకి రెండు చొప్పున వేయాలి. కాకపోతే ఆ ఇంజక్షన్ ఒక్కో డోసుకి... పదివేల రూపాయలుంటుంది. దాదాపు మొత్తంగా హాస్పిటల్ ఖర్చుల్తో కలిపి లక్ష రూపాయల వరకూ ఖర్చవుతుంది. మీరు మరోరెండు గంటల్లో డబ్బు అరేంజ్‌చేయగలనంటే... ఆఇంజక్షన్స్ తెప్పిస్తాం. లేదంటే ఎంత రక్తం ఎక్కించినా మరోవైపు రక్తస్రావమవుతూనే వుంటుంది. పాప ప్రాణాలకు ముప్పు రావచ్చు. ఆలోచించుకొని... అరగంటలోగా మీ నిర్ణయాన్ని చెప్పండి. ఇంతకుమించి మేమేం చేయలేం" డాక్టర్ ఝాన్సీమణి చెప్పిన వివరాలు విన్నాక నీలిమ గుండె చిట్లిపోయింది. కళ్ళల్లో కన్నీటి కెరటాలు ఢీకొంటున్నాయి.

రెండు గంటల్లో .... లక్ష రూపాయలు!!

రెండు గంటల్లో...

లక్ష రూపాయలు!!!

"మీరు, టైం వేస్ట్ చేయకుండా... ఏదో ఒకటి ఆలోచించికోండి. చాలా క్రిటికల్ కండిషన్. తప్పదు. ఇలాంటి స్థితిలోనే గుండె రాయి చేసుకోవాలి" ఝాన్సీమణి నీలిమ భుజం తట్టి బయటికి వెళ్ళింది.

ఆమె అక్కడే నిల్చుంటే... నీలిమ బావురుమని ఏడ్చేదే.

ఆ క్షణాన... తను ఎంత ఒంటరిదో... తన బతుకు బాటలోకి గువ్వపిల్లలా వచ్చిన మేఘన కూడా తనని కష్టాల కడలిలో ముంచుతోందన్న బాధ... దుఃఖాన్ని తన్నుకొచ్చేలా చేస్తోంది. ఆ గదిలోవున్న గడియారం క్షణాల చప్పుడు చేస్తూ... కాలాన్ని గుర్తు చేస్తోంది.

రెండు గంటల్లో లక్ష రూపాయలు.

ఎలా వస్తాయి...?

ఎక్కణ్ణించి వస్తాయి...?

లేదంటే... ఒంట్లోని రక్తమంతా పోయి మేఘన కూడా తనని అన్యాయం చేసి పోతుందా?

పోనీ... పోనీ... పోతేపోనీ...

'ఛ' అనుకుంది కసిగా. మేఘనని దక్కించుకోవాలి. ఎలాగైనాసరే, లక్షరూపాయలు ఇప్పటికిప్పుడు ఎలా వస్తాయి?

ఆమెకు చప్పున గుర్తొచ్చారు.

నైమిష... నిరంజన్.

వాళ్లు కోరిన కోరికని ఒప్పుకుంటే...?

లక్ష రూపాయలు తీసుకొని బిడ్డని కనిస్తానని ఒప్పందం చేసుకుంటే...??

ఈ ఆలోచన రాగానే ఆమె ఆ గదిలోలేదు.

*　　　*　　　*　　　*

తలుపు తీసిన నైమిష చూసి ఆశ్చర్యపోయింది. గంట క్రితమే నిరందజన్‌తో ఫోన్‌లో 'సారీ' చెప్పిన నీలిమ నేరుగా ఇంటికి రావటం విస్మయంగానూ, అనుమానంగానూ తోచి ఇంట్లోకి ఆహ్వానించింది.

ఆమెను చూసి నిరంజన్ కూడా ఆశ్చర్యపోయాడు. వాళ్ల మోహాలలో ఏదో వెలుగు పాకుతోంది.

"రా అక్కా... కూచో..." సాదరంగా కూచోబెట్టి పళ్లరసం తెచ్చింది నైమిష.

నీలిమకి తాగాలన్పించలేదు. తలొంచుకొని కూచొంది.

ముగ్గురి మధ్యా నిశ్శబ్దం...

ఎవరికేం మాట్లాడాలో తోచటంలేదు. అప్పటికే అరగంట గడిచిందన్న ఆతృత నీలిమ అంతరంగాల్లో... చివరికి తనే మాటలు కూడదీసుకుంటూ...

"నైమీషా... మీకు బిడ్డని కనివ్వడానికి ఒప్పుకుంటున్నాను. కాని..." అంది.

వాళ్లలో ఒక్కసారిగా ఆనందం.

"కాని ఏంటి... చెప్పక్కా... నువ్వు ఒప్పుకున్నావ్... అంతే చాలు. ఏమిటో చెప్పు."

"ఒక షరతు..."

ఆ మాటతో వాళ్లు నివ్వెరపోయారు.

"ఏం కండిషనండి" నిరంజన్ కూల్‌గా అడిగాడు.

"మీకు... బిడ్డని కనిచ్చినందుకు... ల... లక్ష రూపాయలివ్వాలి... అదీ ఇప్పుడే కావాలి" చెప్పలేక చెప్పిందామె.

"మేఘనకి చిత్రమైన జబ్బు చేసింది. ఇప్పుడు ఆస్పత్రినించే వస్తున్నాను. ఎనిమిది డోసుల ఇంజక్షన్స్ ఇవ్వాలట. డోసుకి పదివేల రూపాయలు. దాదాపు లక్ష రూపాయలు రెండు గంటల్లో తెమ్మన్నారు. ఇప్పటికే అరగంట గడిచింది. అందుకోసమైనా... నేనీ నిర్ణయం

తీసుకోవాల్సి వచ్చింది. మేఘన చచ్చిపోతే నేను బ్రతకలేను నైమిషా...'' అప్పటివరకూ దాచుకున్న దుఃఖం ఉప్పెనలా వచ్చి పెనుశోకమై తెగిపడగా నైమిషని చుట్టేసి బావురుమంది నీలిమ.

ఇద్దరూ ఆమెను ఓదార్చారు.

అయిదు నిమిషాల తర్వాత నిరంజన్ అడిగాడు. ''మేఘన ఇప్పుడు ఏ హాస్పిటల్లో వుంది'' అని.

''శ్రీదేవి హాస్పిటల్''.

వెంటనే నిరంజన్ హాస్పిటల్‌కి ఫోన్ చేసి డబ్బు తెస్తున్నట్టు చెప్పాడు.

* * * *

మేఘనని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచి 'టిఫికల్ కండిషన్డ్ పేషెంట్' గా చికిత్స మొదలెట్టారు. నిరంజన్ నైమిష దగ్గరుండి అన్నీ చూసుకున్నారు. ఎనభైవేల రూపాయలు ఇంజక్షన్ డోసుల కొరకు నిరంజన్ చెల్లించాడు. పదివేలు మిగతా ఖర్చులయ్యాయి. నైమిష మరో పదివేల రూపాయల్ని నీలిమ చేతిలో వుంచింది.

''మా జీవితంలో వెలుగు నింపడం కోసం నువ్వు చేస్తున్న సాయానికి ఇది వెలకట్టడం కాదక్కా... నీకు అన్నింటికి మేం వున్నామని గుర్తుంచుకో. మళ్లీ కలుస్తాం'' అంది నైమిష.

''మేఘనకి ఇంకేం కాదు. వర్రీకాకండి. మీ నిర్ణయానికి మరోసారి థాంక్స్'' నిరంజన్ చెప్పి ఇద్దరూ వెళ్లిపోయారు.

అప్పటికే రాత్రి ఎనిమిదిన్నర దాటింది.

ఆస్పత్రి వరండాలో ఒంటరిగా కూచుంది నీలిమ. ఆలోచనలు దాడి చేస్తున్నాయి. మేఘనకి ముప్పు తప్పినందుకు మనసు కుదుటపడ్డా... ఆలోచనలే తేనెటీగలానూ రొదపెడుతున్నాయి.

ఆస్పత్రి చాలా రిచ్‌గా వుండటంతో నిశ్శబ్దం కూడా డిగ్నిటీగా రాజ్యమేలుతోంది. కనీసం డెటాయిల్ వాసన కూడా రాకుండా నీట్‌గా, పూలమొక్కల మధ్య అందంగా, ఆధునికంగా వుంది.

నీలిమ ఆస్పత్రిని పరిశీలిస్తుంటే... కొంతదూరంలో సిగరెట్ తాగుతున్న కుర్ర డాక్టర్ల మాటలు విన్పించాయి మసక వెలుతుర్లో...

''ఆ పాప జబ్బు గురించి హాస్పిటల్ ఛైర్మన్‌గార్కి తెలిసిందట. ఆ డిసీజ్ రేర్ కేస్ అయినప్పటికీ... ఎనభైవేలు పెట్టి ఇంజక్షన్ డోస్‌లు వేరే హాస్పిటల్ నించి తెప్పించటంతో కోపంతో మండిపడుతున్నాడట''

''ఆ ఇంజక్షన్స్ అవసరం ఇప్పటివరకూ మన హాస్పిటల్‌కు రాలేదు. బయటినించి

ఏదైనా మెడిసిన్ తెప్పిస్తే ఇన్సల్టింగ్‌గా ఫీలవుతాడాయన."

"ఏమైనా... పాప కేసు తెల్సుకోవడానికి, పాపని చూడ్డానికి పది నిమిషాల్లో వస్తాడట."

"డాక్టర్ ఝాన్సీమణికి ఆయనేం తిడతాడేమోనని భయం పట్టుకుంది" అంటూ సిగరెట్లు గబగబా పీల్చేసి వెళ్లిపోయారు.

నీలిమ నిట్టూర్చింది.

చిన్నగాయమనుకుంటే... మేఘనకి ఎంత పెద్ద జబ్బు బయటపడిందో. దానికోసం ఎంతమంది హడావిడి పడుతున్నారో అనుకుంది. అప్పుడే హాస్పిటల్ ఆవరణలోకి తెల్ల సియోలో వచ్చి ఆగింది. సూట్‌లో నిండుగా వున్న యువకుడు దిగగానే... డాక్టర్ ఝాన్సీమణితోపాటు మరో నలుగురు డాక్టర్లు ఎదురుగా పరిగెత్తుకొచ్చారు.

ఆయన నడుస్తూనే వాళ్లనేవో అడుగుతున్నాడు. ఆయనే హాస్పిటల్ ఛైర్మన్ అయివుండాలి. బహుశా మేఘన గురించే అయివుంటుంది అనుకొంది.

వాళ్లు వరండాలోంచి వెళ్తుంటే నీలిమ అతణ్ణి చూచాయగా చూసింది. ఆ వెంటనే ఆమెకు అతణ్ణి ఏక్కడో చూసినట్టుగా తోచింది.

ఎక్కడ చూసింది?

ఎక్కడ?

ఎక్కడ??

ఎక్కడ???

ఒక శిలా జ్ఞాపకం గుండె పొరల్లోంచి. రాలిపడి...

ఒక అనుభూతి కెరటం చీకటి శిథిలాల్ని చీల్చుకొని...

ఓ కన్నీటి శకలం కళ్లల్లో అణువిస్పోటమై పెకిలించుకొని...

ఓ కన్నెపిల్ల కలల అంచుల మీద వాలిపోయిన నీలినీడ కదిలిపోయి... కమిలిపోయి... కుమిలిపోయిన జ్ఞాపకం ఫెటేల్మని మెదడుని ఢీకొట్టినట్టు...

అతడు గుర్తొచ్చాడు!!

చంద్రప్రభాకర్!!!

మెడికల్ రిప్రెజెంటేటివ్ ఉద్యోగం కోసం ఊరొచ్చి లాడ్జింగ్‌లో దిగాలన్నా డబ్బులేక పెళ్లిచూపుల పేర ఇంట్లో చొరబడి అతిథి పేర అన్ని అవసరాలు తీర్చుకొని... ఉద్యోగం రాగానే కట్నం కోసం తన ఫ్రెండ్‌ని పెళ్లాడిన... చంద్రప్రభాకర్.

తన. మిత్రురాలు శైలజని కట్నం కోసం చంపిన... చంద్రప్రభాకర్.

డాక్టర్లతో కల్సి... అతడు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి వెడుతున్నాడు. ఆమె కళ్లలోంచి కన్నీరు రాలేదు. అవి తడిగా మారకముందే మనసు మొరాయించింది.

పోనీ... పోనీ... పోతేపోనీ...

*   *   *   *

మూడురోజుల తర్వాత... ఆరోజు మేఘనని డిశ్చార్జి చేస్తున్నట్టు డాక్టర్ ఝాన్సీమణి చెప్పింది. ముందు ముందు రక్తం పోయేలా ఏ ప్రమాదం తెచ్చుకోకూడదని మేఘనకి జాగ్రత్తలు చెప్పింది. మిగతా ఫీజులన్నీ చెల్లించాక...

"వస్తాం డాక్టర్" అంది నీలిమ.

"హాస్పిటల్‌కీ, పోలీస్ స్టేషన్‌కి వెళ్లివచ్చేటప్పుడు మళ్లీ వస్తామని చెప్పకూడదు" నవ్వింది ఝాన్సిమణి. నీలిమ, మేఘన కూడా నవ్వారు.

"లేదు డాక్టర్... మళ్లీ రావల్సివుంది. ఈసారి పేషెంట్‌గా నేను వస్తాను" అంది నీలిమ.

"అదేంటి?" అడిగింది ఝాన్సీమణి.

"ఫెర్టిలిటీ క్లినిక్‌కి రావల్సివుంది. హాస్పిటల్ సూపర్నెంట్ మీరే కదా. అప్పుడు కలుస్తాను మళ్లీ."

ఝాన్సీమణి ఏదో అడిగేంతలో... నర్స్ వచ్చి "నీలిమగూరూ... మిమ్మల్ని ఛైర్మన్‌గారు పిలుస్తున్నారు" అంది నీలిమ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"వెళ్లండి" అంటూ వార్డులవైపు వెళ్లిపోయింది ఝాన్సీమణి.

మేఘనని అక్కడే వుంచి నీలిమ ఛైర్మన్ గదిలోకి అడుగుపెట్టింది ఏ భావమూ కన్పించనీకుండా.

"కూచోండి" అన్నాడతడు. అతడి ప్రక్కనే ఒకామె. పి.ఏ.నేమో అనుకుంది.

నీలిమ కూచుంది. గది చాలా అరిస్ట్రోక్రాటిక్‌గా వుంది.

"నన్ను గుర్తుపట్టారా?"

"...."

"మీ పేరు నీలిమ... కదూ?"

"అవును"

"నన్ను గుర్తుపట్టారా?"

"గుర్తుపట్టాను..." చాలా చిరాగ్గా అంది.

"ఈవిడ నా భార్య" ఆమె వినయంగా నమస్కరించింది. ఆమెవైపు జాలిగా చూసింది నీలిమ. శైలజ చావు తెరలు తెరలుగా మనసు తెరపై కదలాడుతోంది.

శైలజకు ప్రియుడున్నట్టుగా ఉత్తరాలు సృష్టించి... చివరికి కిరోసిన్ పోసి అంటించిన నికృష్టుడు. తనూ కాలిపోయి 'నిమ్స్' కి తరలించారని విన్నది కాని... ఇంకా బ్రతికున్నందుకు

ఆమెకు రోతపుట్టింది.

అతడి ఎదురుగా కూచోలేక ముళ్లకంపపై కూచున్నంత ఇబ్బందిగా ఫీలైంది.

"నామీద మీకు అసహ్యంగా వుండొచ్చు. మర్చిపోయిన జ్ఞాపకం మళ్లీ గుర్తుకు తెచ్చానని విసుక్కోకండి. నా జీవితంలో ఒక వ్యక్తికి క్షమాపణలు చెప్పుకోవాలని ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నాను. ఆ వ్యక్తి మీరే. మీ ఫ్రెండ్ శైలజ మంటల్లో చనిపోయాక... నేను మనిషినయ్యాను. మళ్లీ మావాళ్ల బలవంతం మీద సుచిత్ర అనే అమ్మాయిని చేస్కున్నాను. నా పెళ్లయ్యాక కొద్దిరోజులకు నా భార్యకి చెప్పాను. మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం కోసం మీ ఊరొచ్చినప్పుడు లాడ్జింగ్, బోర్డింగ్‌కి డబ్బుల్లేక పెళ్లిచూపుల పేర ఆడిన నాటకాన్ని. ఆ విషయం తెల్సి సుచిత్ర నన్నెంతో అసహ్యించుకుంది. మీకు క్షమాపణలు చెప్పించాలని ఓసారి మీ ఊరుకూడా తీసికొచ్చింది. కాని మీరక్కడ లేరు. మెడికల్ రిప్రజెంటేటివ్ నించి శ్రీదేవి హాస్పిటల్ ఛైర్మన్‌గా ఎదిగినా నామనసులో ఎక్కడో, ఏమూలో అశాంతి. అది మీకు చేసిన ద్రోహమే కావచ్చు. శైలజకి చేసిన అన్యాయమే కావచ్చు. కనీసం మీకు క్షమాపణలు చెప్పే అవకాశం కూడా లేకపోవటం... చివరికి మీరే ఇలా ఎదురుపడతారని ఊహించలేదు. పాప రిపోర్ట్ చూస్తుంటే గార్డియన్‌గా నీలిమ అన్న పేరు కనబడింది. మీరే అయివుంటారని నా సిక్త్ సెన్స్ పదేపదే చెప్పింది. అందుకే హడావిడిగా వేరే పనులున్నా భార్యని తోడ్కొని వచ్చాను. మీరు వెళ్లబోతుంటే చూసాను. ఆనాటి తప్పుకు ఈనాడు క్షమించండి. దానికి ప్రాయశ్చిత్తంగా మీరు కట్టిన ఫీజు వాపసు తీసుకొండి..." చంద్రప్రభాకర్ లక్ష రూపాయల చెక్కుని నీలిమ ముందుకి జరిపాడు. చేతులు కాలిన చర్మంతో కన్పించాయి.

నీలిమకి అయోమయంగా తోచింది.

"ఆయన మునుపటి చంద్రప్రభాకర్ కాదు. చాలా మారిపోయారు. ముందు డబ్బుకోసం ఎన్ని తప్పుడు పనులు చేసినా... తీరా డబ్బు వచ్చాక గతాన్ని తల్చుకుంటూ పశ్చాత్తాపపడటం మానవనైజం. మీకు చేసిన మోసం, శైలజగార్కి ద్రోహం ఆయన్ని వెంటాడుతున్నాయి. ఢబ్బు బాగా సంపాదించాకగాని... డబ్బే ముఖ్యంకాదు అని తెలిసొస్తుంది చాలామందికి. ఈయనకీ అంతే. తను చేసిన పాపాలకి అశాంతికి లోనవుతున్నాడు. మీరెదురయ్యారు. మీరు క్షమిస్తే ఆయనలోని సగం అశాంతి దూరమవుతుంది. ప్లీజ్, లక్ష తీస్కోండి" అందామె వినయంగా.

ఆమె మాటల్లో విధేయత ఉట్టిపడింది.

"మీరింకా నమ్మరేమో... అటువైపు చూడండి" అంది. నీలిమ తలత్రిప్పి కుడివైపుకి చూసింది.

సుగంధపు బెరడుతో చేసిన దండలమధ్య... నిలువెత్తు శైలజ ఫొటో.

ముగ్గురి మధ్యా కాసేపు మౌనం...

ఒకప్పుడు తన జీవితంతో చెడుగుడు ఆడుకున్న మగాళ్లంతా మళ్లీ ఇలా

ఎదురవుతున్నారేమిటి?

చంద్రప్రభాకర్ ఇస్తున్న లక్ష తీసుకుంటె... నైమిష నిరంజన్‌కిచ్చిన మాట ఏమవుతుంది.

"మీపాపకి అయిన ఖర్చు భరించే అవకాశమైనా ఇవ్వండి. ప్లీజ్, డబ్బు తీస్కోండి" అన్నాడతడు.

నీలిమ ఆలోచనల్లోంచి తేరుకోవడానికి మరో అయిదు నిమిషాలు పట్టింది. ఆ తర్వాత నెమ్మదిగా అంది-

"నా కలలతో, నా ఫ్రెండ్ జీవితంతో ఆడుకున్నప్పటికీ మానవత్వమున్న మనిషిగా మారినందుకు థాంక్స్- కానీ ఈ లక్ష నేను తీసుకుంటే మరో కుటుంబానికి ద్రోహం చేసిందాన్ని అవుతాను. వివరాలు ఏమీ అడక్కండి. సారీ..." చెక్కుని టేబిల్‌పై వెనక్కి జరిపి... నీలిమ చివ్వున లేచి బయటికి వచ్చింది.

ఉరుకులు.

పరుగులు.

తరగలు.

నురగలై పారే... ఆడపిల్లల కలల్ని దాచే కన్నెప్పల్ని కాటేసిన... మగపురుగులు మారితేనేం? మారకపోతేనేం. అనుకుంది.

*   *   *   *

ఫెర్టిలిటీ క్లినిక్...

శ్రీదేవి హాస్పిటల్‌లో నైమిష, నిరంజన్, నీలిమ డాక్టర్ ఝాన్సీమణిని కలిసారు. ఆమె ఫెర్టిలిటీ క్లినిక్‌ని వాళ్లకి చూపించింది.

"సెమన్ డోనర్... ఎవరు?" అడిగింది ఝాన్సీమణి.

"మా ఆయనే... నేను ఓవరీ ఇస్తాను. నీలిమ బిడ్డని కని ఇస్తుంది. ఎందుకంటే నాకు గర్భాశయం దెబ్బతింది" అంది నైమిష.

"టెస్ట్‌ట్యూబ్ ద్వారా పిల్లల్ని కనటం గురించి వినటమేకాని ఎప్పుడూ చూడలేదు. కాని పురాణాల్లో కూడా టెస్ట్‌ట్యూబ్ బేబీలు, సెక్స్‌వల్ చేంజెస్ వున్నట్టుగా కథలున్నాయిగదా" అన్నాడు నిరంజన్.

ఝాన్సిమణి నవ్వింది.

"అవును డాక్టర్ శారీరకంగా కలవకుండానే గర్భాలు ధరించటం. ఆంజనేయుడి ద్వారా మత్స్యవల్లభుణ్ణి కనడానికి ఒకామె అలాంటి గర్భమే ధరించినట్టు కథలున్నాయి" అంది నైమిష.

"యస్... ఆ కథ నేనూ విన్నాను" అంది గైనకాలజిస్ట్.

అన్నీ నిశితంగా పరిశీలిస్తోన్న నీలిమ "టెస్ట్‌ట్యూబ్ బేబీల్లాగా... సెక్స్‌వల్ ఛేంజెస్ కథలు కూడా మన పురాణాల్లో వున్నాయి" అంది.

"వ్వాట్... మేం విన్లేదు" అన్నారు. నైమిష, డాక్టర్ ఝాన్సీమణి.

"అవును. పురాణాల్లో సెక్స్‌వల్ చేంజెస్ వున్నాయి. దైవసత్వుడనే మనువు సంతానంలేక వసిష్టుడ్ని మార్గం చెప్పమంటాడు. కొడుకే కావాలనుకుంటే యజ్ఞం చేయమంటాడు వసిష్టుడు. అయితే దైవసత్వుడి భార్యకు కూతుర్ని కనాలనే కోరిక వుంటుంది. ఆ కోరికతోనే 'హోతా' నూ ప్రార్థించి మాట తీసుకుంటుంది. ఆ తర్వాత కూతుర్ని కని 'ఇల' అని పేరు పెడతారుకాని కొడుకు పుట్టనందుకు యజ్ఞం నిష్ఫలమైందే అని రోజురోజుకూ కృంగిపోతాడు దైవసత్వుడు. శిష్యుడి మనోవేదన అర్థం చేసుకున్న గురువు వశిష్టుడు వరం ఇస్తాడు. 'ఇల' గా వున్న ఆ అమ్మాయి 'సుద్యుమ్నుడు' అనే అబ్బాయిగా మారిపోతాడు. ఇది సెక్స్‌వల్ ఛేంజ్ కాదా!" అని చెపింది.

ఆ క్లినిక్‌లోని సైన్సు వాతావరణం వాళ్లని ఫ్రీ గా మాట్లాడుకునేలా చేస్తోంది.

"ఇంతకీ మన ప్రయోగాలు ఎప్పుడు మొదలెడతాం డాక్టర్" అన్నాడు నిరంజన్.

'ఇప్పుడే... ఇక మీరు బయటికి వెళ్లండి" అంది.

వాళ్లిద్దరూ బయటికి వెళ్లగానే నైమిషకి హార్మోన్ ఇంజక్షన్ చేసింది. ఈ ఇంజక్షన్ ద్వారా నైమిషలోని అండాన్ని పరిపక్వం చెందించి, అండాశయం నుంచి బాగా ఎదిగిన అండాన్ని లాపరోస్కోపిక్ ద్వారా బయటికి తీసింది. ఇదంతా జరగడానికి దాదాపు మూడున్నర గంటల సమయం తీసుకుంది.

ఆ తర్వాత నిరంజన్‌ని మాత్రమే పిలిచి నిరంజన్ స్పెర్మ్‌ల్లోంచి బలమైన శుక్ర కణాన్ని వేరుచేసింది. అధునాతన పరకరాల మధ్య, మైక్రోస్కోపుల ద్వారా పరీక్షిస్తూ అండాన్ని శుక్ర కణాన్ని టెస్ట్‌ట్యూబ్‌లో వేసి 'లైఫ్ సపోర్టింగ్ సొల్యూషన్' జాగ్రత్తగా కలిపి అతి తక్కువ వెలుతుర్లో వుంచింది. ఆ తర్వాత లాబ్ బయటికి వచ్చి వాళ్లతో అంది.

"స్పెర్మ్, ఓవరీ రెండూ కల్సిపోయి ఫెర్టిలైజ్ అవుతాయి. అవి ఎనిమిది కణాల విభజన చెందే బ్లాస్టోసిస్ట్ అనే పిండంలో ఒకదశ ఏర్పడేవరకూ పరీక్ష నాళికలోనే వుంచి.. మూడువారాల తర్వాత ఎదిగిన అండాన్ని నీలిమ గర్భాశయంలో ప్రవేశపెట్టాలి. నీలిమ గర్భాశయంలో ప్రవేశపెట్టిన తర్వాత నార్మల్ డెలివరీ ద్వారాగాని, ఎక్కువగా ఆపరేషన్స్ ద్వారాగాని బిడ్డని తీయాల్సివుంటుంది. బెస్టాఫ్‌లక్' అంది.

"మొత్తం ఫెర్టిలిటీ క్లినిక్‌లోనే బిడ్డ తయారయ్యే రోజులున్నాయా డాక్టర్" అనడిగాడు నిరంజన్.

అతడి ప్రశ్నకు ముగ్గురూ నవ్వారు.

"కష్టమైన పనే... కాని... దానికోసం కూడా ఈ ప్రపంచంలో ఎక్కడో ఓచోట అలాంటి

పిశోధనలు జరుగుతూనే వుంటాయి. ఫలదీకరణ చెందిన అండం ఏడు విభజనలు చెందేంతవరకే కల్చరల్ మీడియంలో వుంచొచ్చు. అలాగే పిండం పెరుగుదలకి స్త్రీల లోపలి ప్రకృతి సిద్ధమైన ప్లాసంటా (మావి లేదా పిండ అవలంభనం) అవసరం. అది లేకుండా లాబ్‌లో ప్రయోగాలు చేస్తే పిండంలో ఎదుగుదల వుండదు. అందుకని వైద్యరంగం 'కృత్రమమైన మావి' ను తయారుచేయడానికి ప్రయత్నిస్తోంది. అహర్నిశలూ శ్రమించి అలాంటి అర్టిఫిషియల్ ప్లాసంటా సృష్టించబడినరోజు మాత్రం బ్రహ్మను తలదన్నే ప్రతిసృష్టి సాధ్యమవుతుంది. అప్పుడు పిండం ఫలదీకరణ మొదలు శిశువుగా రూపొందటం వరకూ తల్లికడుపు అనవసరం. టెస్ట్‌ట్యూబ్‌లు, ఫ్లాస్కులే అవసరమవుతాయి" అంది ఝాన్సీమణి.

"అప్పుడు మగాళ్లంతా టెస్ట్‌ట్యూబ్‌లకీ, ఫ్లాస్కులకీ తాళికట్టాలి" నిరంజన్ మాటతో అంతా నవ్వుకున్నారు.

అగ్రిమెంట్ కాగితాలపై అంతా సంతకాలు చేసాక సెలవు తీసుకున్నారు. కాని నీలిమ మాత్రం నైమిష, నిరంజన్‌లని సాగనంపి వెనుదిరిగొచ్చింది. వరండాలోంచి వెళ్తున్న ఝాన్సీమణిని "డాక్టర్" అని పిలిచింది. ఝాన్సీమణి ఆగగానే "మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి" అంది భయంగా.

"ఏంటమ్మా... మేఘన గురించా?"

"కాదు డాక్టర్... ఈ విషయం గురించే... నాకు... నాకు పెళ్లికి ముందే పిల్లలు పుట్టకుండా ట్యూబెక్టమీ జరిగింది. అందుకనీ..."

డాక్టర్ విస్మయంగా చూసి-

"నో ప్రాబ్లెమ్. ట్యూబెక్టమీ ఆపరేషన్ ద్వారా మగాడి స్పెర్మ్ గర్భాశయంలోకి చేరకుండా గర్భనాళాలు మాత్రమే ముడివేసేస్తాం. అయినా ఈ బిడ్డని ఎలా కనొచ్చు అనుకుంటున్నావా? ఎదిగిన అండాన్ని ఆపరేషన్ ద్వారా మాత్రమే నేరుగా నీ కడుపు అంటే గర్భాశయంలో ప్రవేశపెడతాం. ఆతర్వాత తొమ్మిది నెలలు నువ్వు మోయగానే తిరిగి ఆపరేషన్ ద్వారా బిడ్డని తీస్తాం" అంది.

"థాంక్యూ డాక్టర్" నీలిమలో ఏమూలో తొలిచేస్తున్న అనుమానం క్షణంలో వీగిపోయిన ఆనందం కనపడింది.

"కామన్‌గా రెంటెడ్ మదర్స్ మన ఇండియాలోనే అతి తక్కువ. విదేశాల్లో డబ్బు తీసుకొని బిడ్డల్ని కనిచ్చే కిరాయితల్లుల సంఖ్య ఎంతోవుంది. కాని ఇక్కడ ఇతరుల కోసం నీదికాని బిడ్డని నవమాసాలు మోసి కనిచ్చే తొలి తెలుగు రెంటెడ్ మదర్‌వి నువ్వే అవుతావేమో... బెస్టాఫ్‌లక్" డాక్టర్ నవ్వుతూ అనేసి వెళ్లిపోయింది.

ఆమె క్యాజువల్‌గానే అనేసిపోయినా... ఆమాట నీలిమ మనసుపై కొరడాతో కొట్టినట్టు జల్లుమంది.

గర్భసంచిని కిరాయికిస్తున్న తొలి తెలుగు తల్లిని నేనేనా? అన్న బావన ఆమెలో ఆనందమో, విషాదమో, సంతోషమో, దుఃఖమో అర్థంగాని స్థితిలోకి తీసికెళ్లింది.

ఇద్దరు మగాళ్లతో పెళ్లిళ్లయినా... కన్నెపొర కూడా చెరగని జీవితం తనది...

తనది కాని ఒక బిడ్డని పెంచుకుంటూ... లోకం దృష్టిలో తల్లిగానే వుంటోంది.

ఇప్పుడు...

పురుష స్పర్శ.... కనీసం చుంబనం కూడా తెలియకుండా కడుపులో పిండాన్ని మెయబోతోంది?? అంతర్జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడుకున్నట్టుగా... విధి తన జీవితంతో ఎంత దుర్భరంగా ఆడుకుంటోంది.

మళ్లీ మనసు మూగవోతుంటే... హాస్పిటల్‌నించి కదిలింది.

*    *    *    *

మేఘనని ఇంకా జాగ్రత్తగా చూసుకుంటోంది నీలిమ.

అపాయకరమైన ఏ తుంటరి పనులు చేయకుండా కనిపెడుతోంది. స్కూల్ ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడి నీలిమ జబ్బు గురించి చెప్పివచ్చింది.

ఓరోజు...

బ్లేడ్‌తో పెన్సిల్ చెక్కుతున్న దృశ్యం చూసి గాబరాగా లాక్కుంది.

"ఇంకోసారి ఇలాంటి పనులు చేస్తే వీపు చేరేస్తాను" అంది కోపంగా.

"పెన్సిల్ కూడా చెక్కుకోకూడదా?" రోషంగా అంది మేఘన.

"మళ్లీ నీకు బ్లడ్ బ్లీడింగ్ అవుతే బతికించుకునే శక్తి నాకులేదు."

"చస్తే ఛస్తానులే."

ఆ మాటకి నీలిమకి కోపం ముంచుకొచ్చింది.

"ఏమన్నావే... నీకోసం నేనెంత కష్టపడుతున్నానో నీకేం తెల్సు. ఛస్తుందట" అంటూ చెంప పగులగొట్టింది.

"నువ్వెవరు నన్ను కొట్టడానికి మా అమ్మవా?" బుగ్గ ఎర్ర కందిపోతుంటే బుసలుకొడుతున్న కోపంతో రెచ్చిపోయి అడిగింది మేఘన. ఆ మాటకి హతాశురాలైన నీలిమ సహనం చచ్చిపోయి మరో చెంప పగులగొట్టింది.

మేఘన పెద్దగా ఏడుస్తూ గదిలోకెళ్లింది.

మేఘన మాటలు నీలిమని బాగా కదిలించాయి. రెండు గంటలు ఏడుస్తూనే వుంది. నీలిమ కోపం తగ్గిపోయాక పాపని బుజ్జగించబోయింది. కాని కోపంగా ఆమె చేతిని విదిలించింది.

అలిగింది...

ఆమె ఎంత బ్రతిమాలినా.... ఆరాత్రి అన్నం తినలేదు.

మర్నాడు బుజ్జగించినా స్కూల్‌కి వెళ్లలేదు.

"ఇంత మొండిగా ఎందుకు తయారవుతున్నావ్?" అని ఓపిక నశించి మరోరెండు అంటించింది నీలిమ.

ఏడుస్తున్న మేఘన చటుక్కున ఏడుపు ఆపేసి గూట్లోని బ్లేడుని చేతిలోకి తీసుకుంది పౌరుషంగా.

"నన్ను కొడితే ఈ బ్లేడుతో కోసుకుంటా..."

మేఘన చర్యకి నీలిమ బిత్తరపోయింది.

"నన్ను ఇంకోసారి కొడితే బ్లేడుతో ఖచ్చితంగా కోసుకుంటా" మరోసారి కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ అందా పాప. నీలిమ చేష్టలుడిగిపోయిందానిలా కుర్చీలో కూలబడింది.

మరో పది నిమిషాల వరకూ బ్లేడుని పట్టుకునే వున్న మేఘన తర్వాత బ్లేడుని జామెట్రీ బాక్స్‌లో పడేసి తన గదిలోకి వెళ్లిపోయింది.

మేఘన మనస్తత్వం ఎలా మారుతోంది అన్న దీర్ఘాలోచనల్లో నీలిమ మునిగిపోయి వుండాగా ఎవరో కాలింగ్‌బెల్ నొక్కిన శబ్దం.

నీలిమ వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా ఓ యాభయ్యేళ్ల ముసలావిడ...

ఆమెవరో అర్థంకాలేదు నీలిమకి. ఆమె చేతిలో సంచి-

"భరణి ఇల్లు ఇదేనా తల్లి" అంది ఆవిడ.

"అవునండీ... మీరెవరు?"

"నేను భరణి తల్లిని"

నీలిమ ఆశ్చర్యంగా చూసి "లోపలికి రండి" అంది సాదరంగా. ఆవిడ లోపలికి రాగానే కూచోబెట్టి నీళ్లు అందించింది. భరణి దగ్గర వుండే ఆల్బంలో... పెళ్లయిన కొత్తలో ఓసారి అతడి తల్లిదండ్రుల ఫోటో చూసిందిగాని పోల్చుకోలేకపోయింది.

అతడు కూడా ఎప్పుడూ కనీసం తల్లిదండ్రుల గురించిన అతడి స్వంత విషయాలు కనీసం చెప్పకపోయేది.

కాసేపయ్యాక ఆవిడ ఇల్లంతా కలియజూస్తూ "నాపేరు సరస్వతమ్మ. మాది గుంటూరు. భరణిగాడి మనస్తత్వం వాళ్ల తండ్రికి సరిపడక గొడవలయ్యేవి. పదిహేనేళ్ల కిందే ఇల్లు విడిచిపెట్టి వెళ్లాడు. ఉద్యోగం సంపాదించుకొని ఎవరో అమ్మాయిని పెళ్లిచేసుకొని తెలంగాణాలో ఎక్కడో సెటిలయ్యాడని తెల్సింది. వాడు కొద్దిరోజులకిందే చనిపోయాడని తెల్సింది" అంది.

"భోంచేస్తారా?" అనడిగింది నీలిమ.

ఆవిడ చూపులు భరణి ఫొటోమీద పడ్డాయి. ఫొటో దగ్గరకెళ్ళి కళ్లల్లో నీళ్లు తీస్కుంది. అప్పటికే భోజనం పెట్టింది నీలిమ.

"కాళ్లు కడుక్కొని భోంచేయండి" అంది. ఆవిడ భోజనానికి కూచుంది.

"కొడుకు చనిపోయాక కోడల్ని చూసుకునే దౌర్భాగ్యం కలిగిందమ్మా. మావాడికి ఒక కూతురు పుట్టింది అని కూడా విన్నాను" అంది.

"గదిలో చదువుకుంటోందిండీ. ముందు మీరు భోజనం చేయండి" అంటూ కొసరి కొసరి వడ్డించింది. ముసలావిడి ముఖం విప్పారింది. భోజనం అయ్యాక "ఏదమ్మా... నా మనవరాలు" అంది.

"మేఘనా..." నీలిమ పిలిచినా కోపంతో రాలేదు. మరోసారి పిల్చింది.

"మీ నానమ్మ నిన్ను చూడ్డానికి వచ్చింది."

ఈమాటతో అడుగులో అడుగేస్తూ గదిలోంచి వచ్చింది. బొద్దుగా వున్న మనవరాల్ని చూడగానే 'రామ్మా... నేను మీ నానమ్మని" అంటూ చేతులుసాచింది. మేఘన అనుమానంగా దగ్గరికి రాగానే ఆపిల్స్, అరటిపల్లు చేతిలో పెట్టింది.

మొహమంతా ముద్దులు పెట్టింది.

"నిజమేనమ్మా... మీనానమ్మని. గుంటూరునించి వచ్చాను" అంది.

"నా...న...మ్మా..." మేఘనలో ఏదో సంతోషం. కాసేపట్లోనే చనువేర్పడింది. అయినా నీలిమవైపు అప్పుడప్పుడు గుర్రుగా చూస్తుంటే... నీలిమ నవ్వుకుంది.

స్కూలు కబుర్లు చెప్పటం మెదలెట్టింది. వాళ్లిద్దర్నీ చూస్తుంటే నీలిమకి ఆనందంగా వుంది. ముసలావిడ మధ్య మధ్యలో నీలిమకి తన కుటుంబ విషయాలన్నీ చెప్తోంది.

"ఇల్లు విడిచిన భరణి మాకు ఒక్కడే కొడుకైనా... కనీసం తండ్రి చనిపోయినప్పుడు కూడా రాలేదు. వాడంతటి కఠినాత్ముడు. ఓసారి వాణ్ణి వెతుక్కుంటూ వస్తే నన్ను కొట్టి పంపించాడు తప్ప... వాడు కనీసం తల్లి అని కూడా చూళ్లేదు. అప్పటికే వాడిక్కడ పెళ్లి చేసుకున్నాడు. కాని పాప పుట్టలేదింకా... అప్పటి కోడలు కూడా నీలాగే ఆదరించింది. కాని వాడే కనికరించక కొట్టిపంపాడు. తర్వాత ఆమె చనిపోయిందని తెలిసినా రావడానికి భయమేసింది. చివరికి వాడు చనిపోయాడని తెల్సినప్పుడు ఏడ్చాను. మొత్తుకున్నాను. కాని ఈమధ్యే వాడికో పాప వుందని, వాడి రెండో భార్య దగ్గర ఆ పాప వుంటోందని తెలిసి మనవరాలి మీద మమకారం పెరిగి ఇలా అడ్రసులు వెతుక్కుంటూ వచ్చానమ్మా..." అందావిడ.

"మీ మనవరాలు కూడా మీ కొడుకులాగే పెంకిఘటం. అయినా... ఈ చివరి దశలోనైనా మీరు మాతో వుండిపోండి" అంది నీలిమ.

"లేదమ్మా... నేను వెళ్లిపోవాలి. నామనవరాలిని తీసికెళదామనే అష్టకష్టాలు పడుతూ

వచ్చాను.

వేయి శతఘ్నుల విస్ఫోటాలు నెత్తిన పిడుగుల్లా కురిసినట్టు అచేతనంగా చూసింది నీలిమ ఆ మాటవిని.

"మేఘనని మీతో తీసికెళ్లిపోతారా?" అంది ఆందోళనగా.

"అవునమ్మా... అందుకే వచ్చాను. నా కొడుకు దూరమైనా... కనీసం వాడికి పుట్టిన బిడ్డలోనైనా వాణ్ణి చూసుకొని బ్రతుకుతాను" అందావిడ.

నీలిమకి నోటమాటరాలేదు.

విషయం అర్థం చేసుకుందేమో... మేఘన వెంటనే ముసలావిడని చుట్టేస్తూ "నేను నానమ్మ వెంట వెళ్తాను" అంది.

ముసలావిడ ప్రేమగా మేఘన తలను నిమిరింది.

"రాత్రి బస్సుకి తీసికెళ్తానమ్మా. తెల్లారితే గుంటూరు చేరుకోవచ్చు" అందావిడ.

నీలిమ అయోమయంలో పడిపోయి దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తోంది.

"ఇప్పుడే వెళ్దాం నానమ్మా."

మేఘన గారాబానికి ముసలావిడ మురిసిపోతూ "వెళ్దామమ్మా... నీకోసమే వచ్చాను తల్లీ. మరో గంటయితే సాయంకాలం అవుతుంది. అప్పుడు బయల్దేరదాం. సరేనా..."

"ఓ... సరే."

మేఘన తన గదిలోకి పరిగెత్తి అన్నీ సర్దుకోవటం మొదలెట్టింది. మెడికల్ రిపోర్ట్ కూడా పెట్టుకుంది.

"మేఘన లేకపోతే నాకేం తోచదండీ..." నీలిమ మాటల్ని కూడబలుక్కుంటూ అంది.

"నా మనవరాలి కోసమే... ఈ ముసలి శరీరాన్ని మోసుకుంటూ ఇంత దూరం వచ్చింది. వట్టి చేతుల్తో పంపించకమ్మా.... ఈ అఖరి బతుకులో కనీసం మనవరాలైనా నా చెంత వుండనీ... " అందావిడ.

నీలిమని ఏమీ మాట్లాడనిచ్చేలా లేదామె.

"నాకొడుకు నా రక్తం పంచుకు పుట్టాడు. నా కొడుకు రక్తం ఇది పంచుకొని పుట్టింది. రక్తసంబంధం కాబట్టే ఇంతదూరం వచ్చాను తల్లీ" ఆమె మాటలు సౌమ్యంగానే వున్నా... ఎక్కడో కలుక్కుమన్న బాధ.

వీళ్లవన్నీ రక్తసంబంధాలు...

తనేమౌతుంది...?

ఏమీకాదు...

మేఘన తన రక్తం పంచుకున్న బిడ్డకాదుగదా. నిజానికి... భరణి రక్తం పంచుకుపుట్టిన

బిడ్డకూడా కాదు. అసలు నిజం ఈ వృద్ధురాలికేం తెలుసు... అయినా మేఘన కూడా ఎంత తొందరగా తననించి వెళ్లిపోతోంది.

నీలిమ స్తబ్దుగావున్నా మెదడ్ని తొలిచేస్తున్న ఆలోచనలు...

ఇద్దరూ వెళ్తోంటే-

"మేఘనా... వెళ్లిపోతున్నావా?" అంది నీలిమ.

"నేను నీతో మాట్లాడను."

"నిజంగా వెళ్లిపోతున్నావా?"

"నిఝంగా..."

"ఈ అమ్మని విడిచిపెట్టిపోతావా?"

"నువ్ మా అమ్మవేం కాదు."

కళ్లు కన్నీటి చెలిమలయ్యాయి.

"కనీసం ఒక ముద్దు ఇచ్చి వెళ్లవూ..."

"నీకు ముద్దివ్వను ఫో..."

"ఎందుకురా?"

"మా నానమ్మ వచ్చింది కదా... నా ముద్దులన్నీ నానమ్మకే" ముసలావిడ నవ్వింది.

గుమ్మం దాటాక వాళ్లు ఆటోఎక్కి వెళ్లిపోయారు.

వెళ్తూ...వెళ్తూ... మేఘన కనీసం టాటా కూడా చెప్పకుండా పోయింది.

పోనీ... పోనీ... పోతేపోనీ...

* * * *

ఇల్లంతా నిశ్శబ్దమైపోయింది.

ఇంట్లోంచి శవం తరలిపోయింతర్వాత ఏర్పడే బాధాకరమైన స్మశాన నిశ్శబ్దం...

ఇంట్లో లైట్లు కూడా వేయాలన్పించలేదు.

మనసంతా శూన్యం నిండింది.

అప్పుడే ఇంటి ముందాగిన కార్లోంచి డ్రైవర్ దిగొచ్చాడు. చేతిలో ఏదో గిఫ్ట్ బాక్స్. సరాసరి ఇంట్లోకి వచ్చి...

"మేడమ్... నన్ను నైమిషగారు పంపించారు. రేపు హాస్పిటల్‌లో జాయినవ్వాలట. మిమ్మల్ని రేపు పదిగంటల వరకు రెడీగా వుండమన్నారు" అని చెప్పాడు.

నిర్లిప్తంగా 'సరే' అంది.

అతడు వెళ్లిపోబోతూ... "అమ్మా... మీ పాపకి ఆరోగ్యం ఎలావుందో అడిగి రమ్మన్నారు. పాపకోసం ఈ బొమ్మ కూడా పంపించారు" అంటూ బాక్స్ చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

నీలిమ బాక్స్ విప్పింది.

అందమైన బేబీ బొమ్మ...

దానిమీద 'అయాం ఎ గుడ్ గర్ల్' అని రాసివుంది.

ఆ అక్షరాలు చూసాక నవ్వుకుంది. బొమ్మ వెక్కిరించినట్టూ అన్పించింది.

ఆ వెంటనే... మేఘన కోసం పలవరించింది.

ఎవర్ని కాపాడుకోవడానికి... రెంటెడ్ మదర్‌గా మారాలనుకుందో... ఆ పాపే...

గుండెల మీద తన్నిపోయింది. తన ప్రేమ బూడిదలో పోసిన అమృతమైపోయింది.

అప్పుడు... మనసు పగిలిందేమో...

కన్నీళ్లు కాల్వలు కట్టాయి. మంచంపై బోర్లాపడి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఇంట్లోని నిశ్శబ్దం కూడా ఆమె బాధలకి సానుభూతి ప్రకటిస్తూ... మౌనం పాటిస్తోంది.

*            *            *            *

ఫెర్టిలిటీ క్లినిక్‌లో టెస్ట్‌ట్యూబ్‌లో నైమిష అండం, నిరంజన్ శుక్ర కణం కల్సిపోయి ఫలదీకరణ చెందగానే ఆ బ్లాస్టొసిస్ట్‌ని... చిన్న ఆపరేషన్ ద్వారా నీలిమ గర్భాశయంలోకి ప్రవేశపెట్టింది డాక్టర్ ఝాన్సీమణి.

ఆమెకు మరో అయిదుగురు అసిస్టెంట్ డాక్టర్లు సహకరించారు. ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాక... ఆరోజు పెళ్లికాకముందే ట్యూబెక్టమీ కోసం ఆపరేషన్ థియేటర్‌కి వెళ్లిన సంఘటన గుర్తొచ్చింది.

మరి ఈరోజు...

ఆలోచనలన్నీ మత్తు ఇంజక్షన్‌లో కరిగిపోయాయి.

ఆపరేషన్ థియేటర్‌లో ఆ ప్రక్రియ జరుగుతున్నంతసేపూ బయట టెన్షన్‌గా గడిపారు నైమిష, నిరంజన్.

తర్వాత వాళ్లని ఝాన్సీమణి లోపలికి పిలిచింది.

"ఇక నీలిమని దాదాపు తొమ్మిది నెలలపాటు జాగ్రత్తగా చూసుకోవాలి. నెల నెలా బి.యు. టెస్టులతోపాటు బి.పి చెక్ చేయించుకోవాలి. బ్యాలెన్స్‌డ్ డైట్ తీస్కోవాలి" అని చెప్పి నీలిమవైపు చూసి "ఈ తొమ్మిద నెలలు ఎలాంటి టెన్షన్స్‌కి గురికాకూడదు" అంది కొన్ని మందులు రాసిస్తూ.

"థాంక్యూ డాక్టర్" అన్నారు ఆనందంగా నైమిష, నిరంజన్.

"థాంక్స్ చెప్పాల్సింది నాక్కాదు. ఈ పనికి ఒప్పుకున్నందుకు నీలిమకి చెప్పండి" అంది నవ్వుతూ.

ముగ్గురూ బయటికొచ్చారు.

"అక్కా... ఈ తొమ్మిది నెలలు మా ఇంట్లోనే వుండిపోవచ్చుకదా" అంది నైమిష.

"వద్దమ్మా... నాఇంట్లో నేను ఫ్రీగా వుండగలుగుతాను. కావాలంటో రోజూ నువ్వొచ్చి కబుర్లు చెప్పు" అంది నవ్వుతూ.

"మీ ఇష్టమండీ, ఏదేమైనా మీరు చేస్తున్న సాయం మా జీవితాలకి ఓ అర్థాన్నీ, పరిపూర్ణతనీ, పరమార్థాన్ని ఇస్తుంది. మీకు ఎలా కృతజ్ఞతలు తెలిపినా చాలా తక్కువే అవుతుంది" చెప్పాడు నిరంజన్.

"అంతంత పెద్దమాటలొద్దుగాని... నేను ఎప్పట్నించి ప్రెగ్నెన్సీ లీవ్ అప్లయ్ చేయాలి?" అనడిగింది.

"ఈక్షణంనించే... ఇంకా మీకు ఆఫీసా... నెలనెలా డబుల్ సాలరీ తెచ్చిస్తాను" అంది నైమిష, ముగ్గురూ నవ్వుకున్నారు.

"అన్నట్టు... మేఘన ఎలా వుంది?" అనడిగింది నైమిష.

"బావుంది. వాళ్ల నానమ్మ దగ్గరిగి పంపించాను... నేనే" కళ్లలో నీళ్లు కన్పించనీకుండా చెప్పింది.

తర్వాత వాళ్లు నీలిమని కార్లో ఇంటిదగ్గర డ్రాప్ చేసారు.

*　　　　*　　　　*　　　　*

మేఘన లేని ఇల్లు బావురుమన్నట్టుగా వుంది. అనుక్షణం మేఘన తలపులు కలవరపెడుతుంటే అన్నీ అణచుకోవడానికి ప్రయత్నిస్తోంది. పాపని మర్చిపోవడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యపడట్లేదు.

మరోవైపు... తన కడుపులో శిశువు పెరుగుతుంది అన్న ఆలోచన ఓ విచిత్రానుభూతిని కలుగజేస్తోంది. తన్మయంగా కడుపుని నిమురుకుంటే... ఏదో అవ్యక్తానురాగం పెల్లుబుకుతోంది.

రోజూ ఎనిమిది గంటలవరకే టిఫిన్స్, ఫ్రూట్ జ్యూస్‌లతో ఠంచన్‌గా దిగుతుంది నైమిష. ఇంట్లోని పనంతా తానే చేసి వెళ్తుంది. నీలిమ కడుపువైపు ఆరాధనగా చూస్తుంది. పిల్లల పట్ల నైమిషకున్న ప్రేమానురాగాలు చూస్తుంటే నీలిమకి జాలిగా అన్పించింది. ఇల్లంతా బుడిబుడి బాబుల ఫోటోలు, క్యాలండర్లతో నింపేసింది.

"అక్కా... నీగ్గో పిల్లల బొమ్మలు ఎందుకు తేలేదో తెల్సా... గర్భంతో వున్నవాళ్లు ఆ బొమ్మల్నే చూస్తూ గడిపితే... పుట్టబోయే పిల్లలు కూడా అలాగే వుంటారట" అంటుంది అమాయకంగా.

మంచి సంగీతం పెట్టేది.

ఎప్పుడైనా నిరంజన్ వచ్చినా బెరుకుగా కాస్సేపు గడిపి వెళ్లిపోయేవాడు. నైమిష మాత్రం పొద్దంతా గడిపేది.

నైమిష సహచర్యంలో కాలం ఆరునెలలు మింగేసింది.

పెరుగుతున్న కడుపుని తానే విచిత్రంగా చూసుకుంది నీలిమ.

ఆరోజు...

మధ్యాహ్నం...

నైమిష వెళ్ళిపోయింది. కాలింగ్ బెల్ మోగితే నీలిమ బారంగా వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా తల్లి!!!

"అమ్మా..." కళ్ళల్లో కన్నీటి కుండలు పగిలిపోయాయి. అనసూయమ్మ వస్తూనే కూతుర్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. పదనిమిషాల వరకూ మౌనంగా రోదించారు.

"ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి... ఇంకా ఇక్కడేం వుందని వుంటున్నావ్. ఆ పాప కోసమే బ్రతుకుతున్నావా?" అనడిగింది గద్గదంగా.

"లేదమ్మా... నీలిమ వెళ్ళిపోయింది. వాళ్ళ నానమ్మ తీసికెళ్ళింది. నాన్నెలా వున్నారు?"

"బాగానే వున్నారు. నీ గురించే బెంగపెట్టుకున్నారు. నిన్ను తీసుకరమ్మన్నారు" అంటూ అప్పటిదాకా సరిగా గమనించని అనసూయమ్మ... నీలిమ కడుపు ఎత్తుగా వుండటంతో అనుమానంగా చూసింది.

తల్లి చూపుల్ని అర్థం చేసుకున్న నీలిమ జరిగిందంతా చెప్పింది.

అంతా విన్నాక తల్లి చీవాట్లు పెట్టింది.

"నీకసలు బుద్దుందా? ఒకరికి బిడ్డని కనివ్వటమేంటి? లోకం ఏమనుకుంటుందో ఒక్కసారైనా ఆలోచించావా? అసలు తెలిసే చేస్తున్నావా ఈ పని? ఇప్పటిదాకా నీ జీవితం నీటి బుడగలా పగిలిపోయిందని మేం రోజురోజుకీ ఏడుస్తున్నాం. ఆరోజు వద్దన్నా బావని చేసుకున్నావ్. తర్వాత మాకు భారమని భరణిని చేస్కున్నావ్. ఇప్పుడు ఎవరికో బిడ్డని కనివ్వడానికి సిద్దపడ్డావ్. స్వయంకృతాపరాధం కాకపోతే ఏమిటే ఇదంతా..." అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

"అమ్మా... జరిగిందేదో జరిగింది. నువ్వు అన్నీ గుర్తుచేయకు. కాసేపు నీ ఒళ్లో పడుకోనివ్వు."

అనసూయమ్మ బిడ్డని ఒడిలో పడుకోబెట్టుకుంది. నీలిమ మౌనంగా కళ్ళు మూసుకుంటే...

"నీలూ..." అంది తల్లి.

"ఏంటమ్మా..."

"నువ్వు నాకో మాటివ్వాలి."

"ఏం మాట."

"ఇస్తానంటేనే కోరుతాను."

"ఏంటమ్మా అది"

"నువ్వు వాళ్లెవరికో బిడ్డని కనిచ్చాక... మనింటికి వెళ్లిపోదాం."

నీలిమ చప్పున తల్లి కళ్లల్లోకి చూసింది.

"తల్లిదండ్రులకి బిడ్డలెప్పుడూ బరువుకారమ్మా... ఇప్పటికైనా మాతోనే వుండిపో."

"నన్ను ఆలోచించుకోనివ్వు" అని మళ్లీ కళ్లు మూసుకుంది.

"డెలివరీ ఎప్పుడన్నారు" అడిగింది తల్లి.

"ఏప్రిల్ థర్డ్ వీక్‌లో..."

"నేను మొదటి వారంలో వస్తాను. డెలివరీ అయ్యాక తీసికెళ్తాను. నువ్వు కడుపుతో గనక లేకపోతే ఇప్పుడే ఈడ్చుకుపోయేదాన్ని" అనురాగం, ఆవేశం అనసూయమ్మ మాటల్లో కలగలిపి వస్తున్నాయి.

అప్పుడే నైమిష రాగానే... నీలిమ తల్లిని పరిచయం చేసింది.

అనసూయమ్మ రెండురోజులుండి వెళ్లిపోయింది.

*　　　*　　　*　　　*

ఏడోనెల నిండిపోగానే నీలిమని హాస్పిటల్‌లో జాయిన్ చేసారు.

గైనకాలజిస్ట్ ఝాన్సీమణి ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సులు అతి జాగ్రత్తగా చూసుకుంటున్నారు. నైమిషనైతే తనే బిడ్డని కంటున్నంతగా హడావిడి పడుతోంది.

నీలిమ 'జోలాలి...' పాట మనసులో పాడుకోబోయి... పుట్టబోయే బిడ్డమీద తనకే హక్కులేదనే నిజం గుర్తొచ్చి ఆగిపోయింది.

రెంటెడ్ మదర్‌గా... చాలా విచిత్రమైన స్థితిని ఎదుర్కొంటోంది. అక్రమంగా కనే తల్లిసైతం అలాంటి పరిస్థితిని ఎదుర్కొని వుండదేమో...

ఓరోజు డాక్టర్లు, నర్సులు తనగదిలో హడావిడి పడుతుంటే ఏమిటని అడిగింది నీలిమ ఓ నర్స్‌ని.

"భలేవారే... మీకు తెలీదా? మిమ్మల్ని చూడటానికి హాస్పిటల్ ఛైర్మన్‌గారు ఫ్యామిలీతో వస్తున్నారట" అంది. ఆమాట పూర్తికాగానే తలుపు దగ్గర ఫ్లవర్ బోకేలతో కన్పించారు.

సుచిత్ర... చంద్రప్రభాకర్.

సుచిత్ర దగ్గరకొచ్చి "బెస్టాఫ్‌లక్..." అని ఫ్లవర్‌బోకేలు అందించింది.

"టెస్ట్‌ట్యూబ్ పద్ధతిలో ఈ ఆస్పత్రిలో ఎందరో పాపల్ని కన్నా... తెలుగువారు మాత్రం ఈ పద్ధతిలో ఎవరూ బిడ్డని కనలేదు. ఒక తెలుగు మదర్ టెస్ట్‌ట్యూబ్ బేబీ కనబోతుందని తెల్సి ఆశ్చర్యపోయాం. తీరా రిపోర్టుల్లో మీరని తెలిసాక ఆశ్చర్యపోయి అభినందించకుండా

వుండలేకపోయాం" సుచిత్ర అంది.

చంద్రప్రభాకర్ డాక్టర్లతో మాట్లాడుతున్నాడు.

"మావారు సారీ చెప్పాక కూడా మీకోపం తగ్గలేదనుకుంటాను. చెప్పాను గదా, ఆయనిప్పుడు మునుపటి చంద్రప్రభాకర్ కాదు. ఇలా చనువుగా వచ్చి గ్రీటింగ్స్ చెబుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. బైదిబై.. ఈహాస్పిటల్‌లో ఏ బిల్లు మీరు చెల్లించక్కర్లేదు... అలా అయితేనే మామీద కోపం తగ్గిందనుకుంటాను."

సుచిత్ర మాటలకి నీలిమ నవ్వి 'థాంక్స్' అంది.

తర్వాత వాళ్లు వెళ్లిపోయారు.

ఛైర్మన్ వచ్చివెళ్లిపోవటంతో ఆస్పత్రి సిబ్బంది నీలిమని మరింత కంటికి రెప్పలా చూడటం మొదలెట్టారు.

* * * *

డెలివరీ టైం మరో అయిదు రోజులుండనగా నీలిమ తల్లి అనసూయమ్మ వచ్చింది. బిడ్డని అంటిపెట్టుకునే వుంది.

నైమిష, నిరంజన్ షిరిడీ వెళ్లారు బాబా దర్శనానికి.

డాక్టర్ ఝాన్సీమణి టెస్ట్‌లు చేసి "సిజేరియన్ అక్కర్లేదు. రేపోమాపో నార్మల్ డెలివరీ కావచ్చు" అని చెప్పింది.

కాని అనుకోకుండా ఆరోజు ఉదయాన్నే... నీలిమకి నొప్పులు ప్రారంభమయ్యాయి. కడుపులో బిడ్డ చిరుపాదాలతో నెట్టుతున్న ఒత్తిడి. నడుం పట్టుకొని సుడులు తిరిగిపోతుంటే... ఝాన్సీమణి లేబర్‌రూంకి తరలించింది.

ఏవో ఇంజక్షన్స్ చేసారు.

అరగంట పోరాటం తర్వాత నీలిమ అలిసిపోయింది. ఆ వెంటనే కేర్‌మన్న ఏడుపు... గుండెల్లో గుడిగంటలై మ్రోగాయి. అరమోడ్పు కన్నులతో పక్కలోని పసిగుడ్డుని ఆప్యాయంగా చూసింది.

నిమ్మపండులా... ముద్దుగా...బొద్దుగా... మగబిడ్డ!!

అయిదు నిమిషాలు చూసిందో లేదో... కళ్లు మూతలుపడి నిద్ర ముంచుకొచ్చింది.

అరగంట తర్వాత మెలకువ రాగానే ప్రక్కలోని బిడ్డని చూసుకుంది.

బోసి నవ్వుల్తో ఆడుతున్నాడు. శరీరమంతా కదల్లేనంతగా నొప్పుల్తో వుంది. చుట్టూ చూసింది.

డాక్టర్ ఝాన్సీమణి, తల్లి విషణ్ణవదనంతో కన్పించారు.

అనుమానంగా 'అమ్మా...' అని పిలిచింది.

"నైమిష ఏది? బిడ్డని చూసుకుందా?

అప్పుడు చెప్పింది తల్లి ఉద్విగ్నంగా....

గుండె మంచుముద్దలా గడ్డకట్టుకుపోయే వార్త...

శరీరంలోని ఇనుము కరిగి మంచు సముద్రమైపోయే సంఘటన... బయట ఎక్కడో... బరువైన మబ్బుతునకలు ఢీకొని ఉద్భవించిన తటిల్లత విద్యుత్తును మధిస్తూ గుండెల్లోకి చొచ్చుకుపోయినట్టు...

పిడుగులాంటి మాట...

శరీరం కంపించింది.... నాలుక పిడచకట్టుకుపోయింది.

"బాబా దర్శనం చేసుకొని బొంబాయినించి వస్తున్న నైమిష, నిరంజన్‌ల విమానం కూలిపోయింది. మృతుల్లో వాళ్లు కూడా వున్నట్టు ఇప్పుడే తెల్సింది."

క్షణాలు దౌర్భాగ్యంగా చచ్చిపోతూ నిశ్శబ్దపు గాంభీర్యాన్ని సంతరించుకుంటున్న ఆగదిలో స్మశాన వాతావరణం అలుముకుంది.

భయంగా... జేవురించిన మొహంతో బిడ్డని చేతుల్లోకి తీసుకుంది.

'ప్రస్తుతం ఈ బిడ్డ పరిస్థితేమిటి?'

'బిడ్డ భవిష్యత్తు ఏమిటి?'

అందరి కళ్లలోనూ ప్రశ్నలు...

బిడ్డవైపు నిర్వికారంగా చూసింది నీలిమ. ఏ బాధా తెలియని వాడు నవ్వుతూ కేరింతలు కొడుతున్నాడు.

భగవంతుడా... ఇంకా నామీద కసి తీరలేదా?

మనసు పగిలిపోతోంది.

కన్నీల్లు కూడా రానంత భయంకర దుఃఖం.

'ఈ బిడ్డని ఏం చేయాలి?'

సుడులు తిరుగుతున్న ఆలోచనలు.

నైమిష నిరంజన్ కనీసం కూడా చూసుకోలేని దురదృష్టకర పరిణామం...

పాపం... నైమిష బిడ్డకోసం ఎంతగా కలవరపడింది?

ఎంత కష్టపడింది?

ఎన్ని కలలుకన్నది?

ఈ బిడ్డని ఇప్పుడేం చేయాలి? ఎవరికి అప్పగించాలి? తన శ్రమకి ఫలితంగా పుట్టిన బిడ్డనేం చేయాలి?

నీలిమలో ఉత్తుంగ తరంగాలై పొంగులెత్తుతున్న కన్నీటి కల్లోలం...

నిర్వేదంగా పసిగుడ్డుని అలాగే చూస్తుండిపోయింది. గుమ్మం దగ్గర అలికిడైతే అంతా అటువైపు చూసారు.

విషాద వదనంతో వచ్చిన సుచిత్ర, చంద్రప్రభాకర్!

"మాకిప్పుడే తెల్సింది. మీత్యాగాన్ని ఆ దురదృష్టవంతులు అందుకోలేకపోయారు. ఈ బిడ్డ మీకు భారమనిపిస్తే... మాకివ్వండి. అపురూపంగా పెంచుకుంటాం. మాకో పాప వున్నప్పటికీ... బాబుని మేం పెంచుకోవడానికి సిద్ధంగా వున్నాము. మీ జీవితానికి బరువు కాకూడదనే ఆ బిడ్డని అడుగుతున్నాము. మరోలా భావించక... ఆలోచించుకోండి" అన్నాడు. చంద్రప్రభాకర్.

"అవును. మా పాపతో సమానంగా బాబుని పెంచుకుంటాం. విధి ఎలా ఆడిస్తుందో గాని... బాబు మా ఇంట్లో మా బిడ్డగా ఆడుకునే అవకాశం ఇవ్వండి. మీ ఋణం తీర్చుకోనివ్వండి" సుచిత్ర అంది.

నీలిమకేం చేయాలో పాలుపోలేదు.

తల్లి దగ్గరగా వచ్చి చెవిలో చెప్పింది.

"అవునమ్మా... ఇప్పటికే నీ జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. ఇంకా ఈ బిడ్డతో కూడా నువ్ కష్టాలు పడితే మేం చూళ్లేం. ఏమీ ఆలోచించకుండా బాబుని వాళ్లకిచ్చేయ్. మన వూరెళ్లిపోదాం..."

మంచు తుఫాన్‌లో చిక్కుబడిపోయినట్టు... మొద్దుబారిపోయింది నీలిమ మనసు.

ఇంకా ఆలోచిస్తే... మెదడు నరాలు చిట్లిపోతాయేమో అన్నంత బాధ.

ఓ కన్నీటి చుక్క బిడ్డపై పడింది.

ఒక్క ముద్దు...

ఒకే ఒక్క ముద్దు... బాబు నుదుటిపై అద్దింది.

తన సర్వస్వాన్ని ధారబోస్తున్నట్టుగా...

నిదానంగా... బిడ్డని సుచిత్ర చేతుల్లో పెట్టింది.

* * * *

బస్సు కదిలింది-

నీలిమ తల్లి ప్రక్కనే సీట్లో వాలిపోయి కళ్లు మాసుకుంది. బస్సులో వేసిన కేసెట్‌లోంచి ఓ లలితగీతం విన్పిస్తోంది.

**'అత్తారింటికి దారేదమ్మా...**

**ఉరుకుల పరుగుల గోదారమ్మా...'**

ఆ పాట వింటూ... బరువు గుండెల్లోని బాధనంతా కనుకొసల్లోని కన్నీటి బొట్టులోకి

చేర్చి... మనసు తగలబడిపోతుంటే... కుప్పకూలుతున్న దుఃఖాన్ని ముంచేసి... మండే గాయాల మైలురాళ్లని దాటి... అదుపు తప్పి ఆగాధంలోకి జారిపోయిన జీవితంలా... కన్నీటి బొట్లు కదిలిపోయి...

గుండెల మీద పడి ఇంకిపోయింది.

పోనీ... పోనీ... పోతేపోనీ...